

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

19వ వసంతంలోకి ...

ఉత్తరాంధ్ర

విశాఖపట్నం, శ్రీకాకుళం

విజయనగరం

శనివారం 14-02-2026 పేజీలు: 22


# భవిష్యత్తుకు బృహత్తర ప్రణాళిక

- పునః పరిశీలన పేరుతో 9 నెలలుగా అభ్యంతరాల స్వీకరణ
- ఇప్పటి వరకు 3722 విజ్ఞప్తులు రాక.. విలక్షణ అభ్యంతరాలు 717 మాత్రమే
- వీటిలోను పరిగణనలోకి తీసుకున్నవి 427

2 లో




# ఇంటర్, పదో తరగతి పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

➩ మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్ లు పూర్తిస్థాయి నిషేధం, జిరాక్స్ షాపులపై నిఘా అవసరం

2వ పేజీలో



# నేషనల్ ట్రావెల్ మార్ట్ పర్యాటక రంగంలో కొత్త అధ్యయనానికి నాంది

– పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



- టూర్ ఆపరేటర్లే ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి బ్రాండ్ అంబాసిడర్లు అని మంత్రి దుర్గేష్ వెల్లడి
- గడిచిన 18 నెలల్లో రూ.20,088 కోట్ల పెట్టుబడులు, 1.22 లక్షల ఉద్యోగాల సృష్టి
- స్వర్ణాంధ్ర విజన్ 2047 దిశగా పర్యాటక రంగం పరుగులు పెడుతోందని వెల్లడి




3వ పేజీలో

# పోర్ట్ కార్యదర్శిగా ఎం శంకర్ బాబు



2వ పేజీలో

# అనధికార లేఔట్లను క్షుణ్ణంగా పరిశీలించండి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

2వ పేజీలో



# దళితుల పాపము పాలికులకు తగలదా..

4వ పేజీలో



➢ మా ప్రాణాలు అయినా పణంగా పెడతామె తప్ప భూములు ఇచ్చే పని లేదు దళిత కుటుంబాలు ➢ దళితులు దీక్షకు మద్దతుగా వైయస్సార్ పార్టీ నాయకులు కర్ణం ధర్మ శ్రీ బోడ్డెడ ప్రసాదు నాయకులు, కార్యకర్తలు ➢ఓటు వేసి గెలిపించిన పాపానికి మాకు శిక్ష అంటున్న దళితులు

# భవిష్యత్తుకు బృహత్తర ప్రణాళిక




**విశాఖపట్నం, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** కూటమి ప్రభుత్వ 'మాస్టర్ ప్లాన్' బెడిసికొట్టింది. వీఎంఆర్‌డీఏ బృహత్తర ప్రణాళికపై చేసిన ఆరోపణలు తప్పని తేటతెల్లమైంది. వైఎస్సార్‌సీపీ హయాంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిపెట్టుకుని శాస్త్రీయంగా 'మాస్టర్ ప్లాన్--2041' సిద్ధం చేసినట్లు నిరూపణైంది. బృహత్తర ప్రణాళికపై బురద జల్లుతూ.. పునః పరిశీలన పేరుతో 9 నెలలుగా అభ్యంతరాలు స్వీకరిస్తూనే ఉన్నారు. కానీ ఇప్పటి వరకు గత ప్లాన్‌లో లోటు పాట్ల ఒక్క అభ్యంతరం రాకపోవడమే కూటమి కుట్ర ప్రణాళికకు నిదర్శనం. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు, నీతి అయోగ్ సిఫార్సుల మేరకు మాత్రమే మాస్టర్‌ప్లాన్‌లో స్వల్ప సవరణలు చోటు చేసుకోనున్నాయి.

**– 2021లోనే మాస్టర్ ప్లాన్ పూర్తి**

వీఎంఆర్‌డీఏ పరిధిలో ప్రజల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బృహత్తర ప్రణాళిక--2041కు ఆమోద ముద్ర వేసింది. వాస్తవానికి 2011లో ఈ ప్రణాళికకు శ్రీకారం చుట్టినప్పటికీ.. 2019 వరకు పూర్తి కాలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. ఇందులో వచ్చిన 17,460 అభ్యంతరాలు, సలహాలను సమగ్ర పరిశీలన చేసి వీఎంఆర్‌డీఏ, రెవెన్యూ, ఇతర సంబంధిత విభాగాల అధికారులతో సంయుక్త తనిఖీలు, సందర్శనలు నిర్వహించారు. మారుతున్న పరిస్థితులు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా.. ఆ ప్రాంత భౌగోళిక స్థితిగతులను అనుసరించి 2021 నవంబర్ 8న వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్--2041కు అప్పటి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది.

**– తప్పుడు ఆరోపణలు పటాపంచలు..**

ఈ బృహత్తర ప్రణాళిక--2041పై కూటమి నేతలు ఎన్నికల ముందు నుంచి ఆరోపణలు గుప్పించారు. అశాస్త్రీయంగా ప్రణాళికను తయారు చేసినట్లు నానా యాగీ చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది మే 19 నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తున్నారు. ఇప్పటి వరకు మొత్తం 3722 అభ్యంతరాలు వచ్చాయి. వాటిలో విలక్షణ అభ్యంతరాలు(యూనిక్ అబ్జెక్షన్స్) కేవలం 717 మాత్రమే ఉన్నాయి. మిగిలిన అన్నీ ఒకే అంశంపై వచ్చిన ఫిర్యాదులు అవడంతో వాటిని పక్కనపెట్టారు. అలాగే 717లో కూడా 427 అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నారు. మిగిలిన 290 అబ్జెక్షన్స్‌ను తోసిపుచ్చారు. వాస్తవానికి ఈ అభ్యంతరాల స్వీకరణ ద్వారా గత మాస్టర్‌ప్లాన్‌లో అవకతవకలు జరిగాయని నిరూపించడానికి చంద్రబాబు ప్రభుత్వం విశ్వప్రయత్నాలు చేసింది. కానీ ఇందుకు విరుద్ధమైన పరిస్థితులు నెలకొనడంతో నోరెత్తలేని పరిస్థితి ఏర్పడింది.

**– మార్చి 10 వరకు అభ్యంతరాల స్వీకరణ**

మాస్టర్‌ప్లాన్‌పై మార్చి 10వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఏ రోజు వచ్చిన అబ్జెక్షన్స్‌ను ఆ రోజు పరిశీలిస్తున్నారు. ఆ అభ్యంతరాలకు అనుగుణంగా చర్యలు తీసుకుని మార్చి 15లోగా టెక్నికల్ ఎక్స్‌పర్ట్ కమిటీకి మాస్టర్‌ప్లాన్‌ను పంపించనున్నారు. అనంతరం మార్చి చివరి నాటికి తుది బృహత్తర ప్రణాళికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ప్రభుత్వం కూడా 60 రోజుల్లో మాస్టర్ ప్లాన్‌కు ఆమోద ముద్ర వేసే అవకాశం ఉంది.

మాస్టర్‌ప్లాన్‌లో స్వల్ప మార్పులు. విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) రూపొందిస్తున్న మాస్టర్ ప్లాన్--2041లో అభివృద్ధి పనులను, మార్పులను అధికారులు పొందుపరుస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు, నీతి ఆయోగ్ సిఫార్సులకు అనుగుణంగా ప్లాన్‌లో సవరణలు చేయనున్నారు. ప్రధానంగా భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు రహదారులు, విశాఖ ఎకనామిక్ రీజియన్(వీఈఆర్)లో ప్రాజెక్టులతో పాటు, పర్యావరణ పరిరక్షణ, అటవీ ప్రాంతాలను చేరుస్తున్నారు. వాటిలో ప్రధానంగా..

**రవాణా, కనెక్టివిటీ:**

– విశాఖపట్నం పోర్ట్ కంటైనర్ టెర్మినల్ నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ వరకు సవరించిన కోస్టల్ కారిడార్ అలైన్‌మెంట్‌ను మాస్టర్ ప్లాన్‌లో చేర్చారు.

– అనకాపల్లి నుంచి కొత్తవలస వరకు ప్రతిపాదిత రైల్వే లైన్‌ను రైల్వే డివిజన్ నుంచి వచ్చిన సరిహద్దుల ప్రకారం ఖరారు చేశారు.

– రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌వేను ఒక ప్రధాన ప్రాంతీయ కనెక్టివిటీ కారిడార్‌గా గుర్తించి మాస్టర్ ప్లాన్‌లో పొందుపరిచారు.

– సదుపాయాలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కనెక్టివిటీని మెరుగుపరచడానికి విజయనగరం రూరల్, అనకాపల్లి, విశాఖపట్నం పరిధిలో కొత్త రోడ్లను ప్రతిపాదించారు.

– వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ సిద్ధం చేసిన 37 రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లను (ఆర్‌డీపీ) బేస్ డేటాలో చేర్చారు.

**పర్యావరణ పరిరక్షణ, అటవీ ప్రాంతాలు:**

– పర్యావరణ పరిరక్షణ కోసం కంబాలకొండ ఎకో--సెన్సిటివ్ జోన్ సరిహద్దులను అటవీ శాఖ నివేదికల ప్రకారం అప్‌డేట్ చేశారు.

– పచ్చదనాన్ని పెంచే లక్ష్యంతో 9.17 హెక్టార్ల విస్తీర్ణంలో 20 ప్రాంతాలలో 'మియావాకీ' పద్ధతిలో దట్టమైన అడవుల అభివృద్ధిని ప్రతిపాదించారు.

– చిప్పాడ అటవీ ప్రాంత సరిహద్దులను అటవీ శాఖ నిబంధనల ప్రకారం నోటిఫై చేశారు.

**నీటి పారుదల, ఇతర ప్రాజెక్టులు:**

– సుజల స్రవంతి, పోలవరం, తారకరామ కాలువలకు సంబంధించి ఇరిగేషన్ శాఖ సూచనల మేరకు అలైన్‌మెంట్లను ఖరారు చేశారు.

– విజయనగరం రెవెన్యూ శాఖ ఇచ్చిన డేటా ప్రకారం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ సరిహద్దులను అప్‌డేట్ చేశారు.

– మాస్టర్ ప్లాన్ తయారీలో భాగంగా 300 ఏపీడీపీఎంఎస్ లేఅవుట్లు, 780 ఎల్‌ఆర్‌ఎస్ లేఅవుట్లు, 90 వన్--సెంట్ లేఅవుట్లను బేస్ డేటాలో చేర్చారు.

– మాస్టర్ ప్లాన్ 2041లో మొత్తం రోడ్ల పొడవు సుమారు 3961 కిలోమీటర్లు. అదనంగా 418.9 కిలోమీటర్ల మేర కొత్త కనెక్టివిటీ రోడ్లను ప్రతిపాదించారు.

– మొత్తం 29 సీఎల్‌యూ (భూ వినియోగ మార్పిడి) దరఖాస్తులను ఆమోదించి ప్లాన్‌లో చేర్చారు.

## ఇంటర్, పదో తరగతి పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

**– సీఎస్ తో వీసీ అనంతరం అధికారులకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశాలు**

**విశాఖపట్నం, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** జిల్లాలో నిర్వహించనున్న ఇంటర్, 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీసీ హాలు నుంచి జాయింట్ కలెక్టర్ తో కలిసి ఆయన భాగస్వామ్యమయ్యారు. జిల్లాకు సంబంధించిన అంశాలను వివరించారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, ప్రభుత్వ భవన నిర్మాణాలకు భూముల గుర్తింపు ప్రక్రియలను మరింత వేగవంతం చేస్తామని చెప్పారు. జిల్లాలో ఇంటర్, పదో తరగతి పరీక్షల నిర్వహణకు చేపట్టిన చర్యలను సీఎస్ కు నివేదించారు. అనంతరం జిల్లా అధికారులతో పలు అంశాలపై మాట్లాడారు. మార్చి 16 నుంచి జరగనున్న పదో తరగతి, ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు పూర్తిగా నిషేధించాలని, పరీక్షల స్వచ్ఛతకు ఎలాంటి ఆటంకం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటర్, పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్య భద్రత దృష్ట్యా అవసరమైన చోట్ల మెడికల్ క్యాంపులు, డీ–హైడ్రేషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. తెలిపారు. అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల పరిధిలో జిరాక్స్ సెంటర్లపై నిఘా పెంచాలని, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, పోస్టల్ శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించడమే లక్ష్యంగా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. అలాగే రేషన్ పంపిణీ, పెన్షన్ల పంపిణీ, అకౌంటింగ్ వ్యవస్థ, యూనిటైడ్ ఫ్యామిలీ సర్వే పురోగతిపై ప్రధాన దృష్టి సారించాలని చెప్పారు. జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఇన్చార్జి డీఆర్వో సత్తిబాబు, ఆర్.ఐ.ఓ., డీఈవో, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## జీవీఎంసీ పరిధిలో అనధికార లేఔట్లను క్షుణ్ణంగా పరిశీలించండి

**– ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టండి – జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**



**విశాఖపట్నం, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలో అసంపూర్ణంగా ఉన్న అనధికార లేఔట్ లలో ఎల్‌ఆర్‌ఎస్ అనుమతుల మంజూరుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, నగరంలో గల అటువంటి అనధికారిక లేఔట్లను క్షుణంగా పరిశీలించి నివేదికను సిద్ధం చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు కమిషనర్ ఆదేశించారు . గురువారం ఆయన మధురవాడ జోన్ కొమ్మాది విలేజిలో ఎ బి కె రియల్ ఎస్టేట్ సంస్థ వేసిన అనధికారిక లే అవుట్ ను జీవీఎంసీ డిప్యూటీ సిటీ ప్లానర్ కే.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శబ్నం శాస్త్రి తో కలిసి పరిశీలించారు. మధురవాడ జోన్, కొమ్మాది విలేజ్ లో సర్వేనెంబర్ 36,37 పార్ట్,65,66,67,68,69 పార్ట్,72,73 పార్ట్,88,89,90,91పార్ట్ సర్వే నంబర్ల లో 14.4 ఎకరాలలో 163 ప్లాట్లతో ఎబికె రియల్ ఎస్టేట్ సంస్థ వేసిన లేఔట్ లో ఎల్‌ఆర్‌ఎస్ మంజూరు కొరకు దరఖాస్తు చేసిన స్థల యజమానుల ప్లాట్లను కమిషనర్ స్వయంగా పరిశీలించారు. ఈ పరిశీలనలో సంబంధిత అనధికారిక లేఔట్ లో అంతర్గత రోడ్లు మిగిలిన రహదారులకు అనుసంధాన పరచనందున అసంపూర్ణంగా లేఔట్ ఉందని గమనించిన కమిషనర్ సంబంధిత లేఔట్ యజమానితో ఫోన్లో మాట్లాడుతూ అందుకు గల కారణాలపై ఆరా తీశారు. ఆ లేఔట్ లో కొనుగోలు చేసిన స్థల యజమానులు ఎల్‌ఆర్‌ఎస్ పథకం మంజూరు కొరకు 83 మంది స్వయంగా దరఖాస్తు చేసుకున్నారని, అందులో 75 స్థలాల ఎల్‌ఆర్‌ఎస్ అనుమతుల మంజూరుకు సంబంధించి పరిశీలనకు రావడం జరిగిందని, స్థల యజమానులు సౌకర్యార్థం లేఔట్ లో రోడ్లు అనుసంధాన పరచనందున రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్‌ఆర్‌ఎస్ మంజూరుకు స్థల యజమానులు ఇబ్బందులకు గురవుతున్నారని, అనుమతుల మంజూరుకు అడ్డంకులు ఏర్పడుతున్నాయన్నారు. వెంటనే లేఔట్ లో గల రోడ్లను ప్రధాన రోడ్లకు అనుసంధానం చేసే ప్రక్రియ జరిపి అభివృద్ధి పరచాలని, అలా కాని ఎడల చట్టపరమైన కఠిన చర్యలు చేపడతామని కమిషనర్ రియల్ ఎస్టేట్ యజమానికి హెచ్చరించారు. విశాఖ నగరంలో ఉన్న అనధికార లేఔట్లను క్షుణ్ణంగా పరిశీలించే ప్రక్రియ చేపట్టి నివేదికను సిద్ధం చేయాలని, ఎల్‌ఆర్‌ఎస్ మంజూరుకు అనుమతులు కోరుతూ సమర్పించిన దరఖాస్తులను నిశితంగా పరిశీలించాలని డిసిపి వెంకటేశ్వరరావుకు , ఫోన్ ద్వారా జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ .ప్రభాకర రావు కు కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## పోర్ట్ కార్యదర్శిగాఎం శంకర్ బాబు బాధ్యతలు స్వీకరణ



**విశాఖపట్నం, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** ఎం. శంకర్ బాబు విశాఖపట్నం పోర్ట్ నూతన కార్యదర్శిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం పోర్ట్ కు రాక పూర్వం ఆయన మార్మగోవ పోర్ట్ , గోవా, కార్యదర్శిగా సేవలందించారు. కేంద్ర పోర్టులు నౌకా జల రవాణా శాఖ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఆయనను విశాఖపట్నం పోర్ట్ అథారిటీకి కార్యదర్శిగా బదిలీ చేసి నియమించారు. కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించే ముందు, శంకర్ బాబు విశాఖపట్నం పోర్ట్ ఉపాధ్యక్షురాలు రోష్ని అపరంజి కొరాటిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పోర్ట్ విభాగాధిపతులు, ఉన్నతాధికారులు మరియు సిబ్బంది శంకర్ బాబుకి పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

# రేపు మాంసం దుకాణాలకు సెలవు

## - జీవిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్



**విశాఖపట్నం, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని మాంసం దుఖాణాలకు ఆదివారం మహా శివరాత్రి సందర్భంగా నగరంలో గల మాంసం, చికెన్, చేపలు మొదలైన దుఖాణాలకు, జంతు వధశాలలకు సెలవు ప్రకటించినట్టు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. మహా శివరాత్రి సందర్భంగా నగరంలో వేటమాసం, కోడి మాంసం, చేపలు, రొయ్యలు అమ్మకాలు నిషేధించడమైనందున సంబంధిత దుఖాణాలకు, జంతు వధశాలలకు సెలవు ప్రకటించడమైనదని, సంబంధిత దుఖాణాలు, జంతు వధశాలలు మూసివేయాలని, అతిక్రమించి మాంసపు దుకాణదారులు ఎవరైనా తమ దుకాణాలను తెరిచి మాంసము, చేపలు, రొయ్యలు విక్రయించినా, జంతు వధ శాలలు తెరిచినా జీవీఎంసీ కఠిన చర్యలు తీసుకోవడం జరుగునని కమిషనర్ తెలియజేశారు. స్వచ్ఛంధంగా దుఖాణాలను మూసివేయాలని కమిషనరు తెలిపారు.

# బంగ్లాదేశ్ ఎన్నికలలో శివరామ జ్యోష్యం నిజమైంది



**విశాఖపట్నం, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** బంగ్లాదేశ్ 13 వ పార్లమెంటరీ ఎన్నికల కోరకు జరిగిన ఓటింగ్ లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ అధ్యక్షుడు తారిక్ రహమాన్ మరియు జమాత్-ఇ-ఇస్లాం పార్టీ మధ్య గెట్టి పోటీ వుంటుంది అని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ మిత్ర పక్షాలతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది ముందుగానే పత్రికా ప్రకటన ద్వారా తెలియజేసిన ప్రముఖ వాస్తు, జ్యోతిష్య పండితులు లక్కోజుశివరామ చెప్పిన జ్యోతిష్యం నిజమైంది. జ్యోతిష్య శాస్త్ర్యంలోని నవగ్రహాల సంచారం బట్టి లెక్కలు కట్టిన ఆయన ఫలితాలను ముందుగానే అంచనా వేశారు.

# ఉజ్వల్ పథకం క్రింద గ్యాస్ కనెక్షన్లు పంపిణీ



**కొత్తూరు, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** కొత్తూరు మండలం మహాసింగి గూడ గ్రామం లో కేంద్రప్రభుత్వం అమలు ఉజ్వల్ పథకం క్రింద, 14మంది కి ఉచిత గ్యాస్ కనెక్షన్లు దేశం నేతలు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ లోతుగెడ్డ లక్ష్మీనారాయణ, బోర శ్రీరాములు, మహాసింగి వెళ్లి ఎంపిక చేసిన గిరిజన లబ్ధిదారులకు సందజేశారు. మొదట్లో ఉజ్వల్ పథకం పై ప్రచారం దేశం నేతలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు యల్ తులసీ వర ప్రసాదరావు ఆదేశాలు మేరకు అర్హులైన వారిని ఎంపిక చేసి గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పడాల వెంకట కృష్ణ, లోతుగెడ్డ ఇందిరా రామ్, గోగుల శ్రీధర్,కలమట తిరుపతిరావు, ఎద్దు లక్ష్మణ రావు , గేదెల మన్మధరావు, వడమ శ్రీనివాసరావు , మహాసింగి గ్రామస్తులు పాల్గొన్నారు.

# నేషనల్ ట్రావెల్ మార్ట్ ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో కొత్త అధ్యయనానికి నాంది

**విశాఖపట్నం, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** 'నేషనల్ ట్రావెల్ మార్ట్' కేవలం ఒక సమావేశం కాదు.. ఇది ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో ఒక సరికొత్త అధ్యయనానికి నాంది అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఫిబ్రవరి 13, 14 తేదీల్లో విశాఖలో నిర్వహిస్తున్న ఈ మెగా టూరిజం మార్ట్‌లో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ యొక్క తీరప్రాంతం, గిరిజన ప్రాంతాలు, వారసత్వ ప్రదేశాలు మరియు ఎకో-అడ్వెంచర్ టూరిజంను ప్రదర్శించడం, దేశీయ పర్యాటకాన్ని పెంచడమే లక్ష్యంతో టూర్ ఆపరేటర్లు, హోటల్ గ్రూప్ లు, ట్రావెల్ నిపుణులతో నిర్వహించిన సమావేశంలో పర్యాటక రంగం అభివృద్ధిలో టూర్ ఆపరేటర్ల ప్రాముఖ్యతను వివరిస్తూ టూర్ ఆపరేటర్లే మా బ్రాండ్ అంబాసిడర్లు అన్న మంత్రి దుర్గేష్ వ్యాఖ్యలతో హర్షధ్వానాలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కేవలం ఆధ్యాత్మిక వారసత్వానికే కాకుండా, పరివర్తన మరియు ఆవిష్కరణలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోందని అన్నారు. జాతీయ పతాక రూపకర్త పింగలి వెంకయ్య పుట్టిన ఈ నేల పట్ల రాష్ట్రం గర్వపడుతోందని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ సంస్కృతిని, రామాయణ కాలం నాటి దండకారణ్య విశేషాలను ప్రస్తావిస్తూ, పొరుగు రాష్ట్రాలతో సమన్వయానికి ప్రాధాన్యతనిచ్చారు. కేంద్రం సహకారంతో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పర్యాటక రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి దుర్గేష్ తెలిపారు. నూతన పర్యాటక పాలసీ 2024-29,పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా, సబ్సిడీలు, ఎస్జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, స్టాంపు డ్యూటీ మినహాయింపులతో ఇన్వెస్టర్లకు పెద్దపీట వేస్తున్నామన్నారు. కేవలం 18 నెలల్లో రూ.20,088 కోట్ల విలువైన 117 ప్రాజెక్టులకు ఒప్పందాలు జరిగాయని, దీని ద్వారా 1,22,637 ఉద్యోగాల సృష్టికి మార్గం సుగమమైందని వెల్లడించారు. తద్వారా హోటల్స్, రిసార్ట్స్, థీమాటిక్ పార్క్ లు తదితరాలు పెద్దఎత్తున ఏర్పాటు చేయడానికి పెట్టుబడిదారులు ముందుకు వచ్చారన్నారు. కేవలం 'ఈజ్ ఆఫ్ డూయింగ్' మాత్రమే కాకుండా, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్' ద్వారా సింగిల్ విండో విధానంలో అనుమతులు జారీ చేస్తున్నామని స్పష్టం చేశారు. సరళీకృత విధానాలు, సింగిల్ విండో క్లియరెన్స్, ఇన్వెస్టర్ ఫెసిలిటేషన్ సెల్స్, రియల్-టైమ్ ట్రాకింగ్, పారదర్శకమైన భూ కేటాయింపులు నిర్ణీత కాలపరిమితిలో అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు.

### టూర్ ఆపరేటర్లు - మా స్టోరీ టెల్లర్స్:మంత్రి దుర్గేష్

ఆంధ్రప్రదేశ్ అందాలను దేశ విదేశాల పర్యాటకులకు పరిచయం చేసే కథకులు, ప్రచారకర్తలు, నిర్వాహకులు టూర్ ఆపరేటర్లు అని మంత్రి దుర్గేష్ కొనియాడారు.. "ప్రభుత్వం పునాది వేస్తే, టూర్ ఆపరేటర్లు దానికి ప్రాణం పోస్తారు. మీరు కేవలం వ్యాపారవేత్తలు కాదు, మా రాష్ట్ర అందాలను ప్రపంచానికి వినిపించే స్టోరీ టెల్లర్స్" అని మంత్రి దుర్గేష్ కొనియాడారు. టూర్ ఆపరేటర్లే ప్రభుత్వానికి, మార్కెట్ డిమాండ్‌కు మధ్య వారధి అని, వారే మా అసలైన రాయబారులని పేర్కొన్నారు.ప్రభుత్వం కొత్త సర్క్యూట్‌లను, క్రూయిజ్‌లను లేదా హోమ్‌స్టే నమూనాలను ప్రవేశపెట్టినప్పుడు వాటిని మెరుగుపరిచి, ప్రమోట్ చేసినప్పుడే అవి విజయవంతమవుతాయన్నారు. ప్రభుత్వ విజన్‌ను పర్యాటక ప్యాకేజీలుగా, మధుర జ్ఞాపకాలుగా మార్చే శక్తి టూర్ ఆపరేట్లకు ఉందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు టూర్ ఆపరేటర్లు చేతులు కలిపినప్పుడే పర్యాటకం వర్ధిల్లుతుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించాలని కోరారు.తద్వారా ఇన్ బౌండ్ టూరిజంను పెంచాలని సూచించారు. సృజనాత్మకత, సంస్కృతి, సామాజిక ప్రభావాల అద్భుత కలయికతో టూర్ ఆపరేటర్లు, ఇన్వెస్టర్లు మరియు భాగస్వాములు అందరం కలిసి ఆంధ్రప్రదేశ్‌ను భారత్‌లోనే అత్యంత శక్తివంతమైన పర్యాటక కేంద్రంగా (భారతదేశపు ఎక్స్‌పీరియన్స్ క్యాపిటల్) తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు.

**భవిష్యత్తు ప్రణాళికలు:** విశాఖ నుండి అరకు వరకు త్వరలో కారవాన్ టూరిజం ప్రారంభిస్తామని, గ్రామీణ సంస్కృతిని పరిచయం చేసేలా హోమ్‌స్టేలు, బెడ్ అండ్ బ్రేక్ ఫాస్ట్ పాలసీ, టెంట్ సిటీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. త్వరలో రాబోయే మైస్, ఫిల్మ్ టూరిజం పాలసీలు అసెట్-లైట్ మోడల్ పెట్టుబడులకు ఊతమిస్తాయని భావిస్తున్నామన్నారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి కుంభమేళా తరహాలో టెంట్ సిటీలను సిద్ధం చేస్తామన్నారు. రాష్ట్రం కేవలం టెంపుల్ టూరిజానికే పరిమితం కాకుండా ఎకో, అడ్వెంచర్, క్రూయిజ్, రివర్, అగ్రి, హెరిటేజ్, మెడికల్ మరియు వెల్ నెస్ టూరిజంకు పెద్దపీట వేస్తోందని వివరించారు. మన రాష్ట్రం పర్యాటక రంగంలో ఒక 'స్టార్టప్' లాంటిది. ఇక్కడ వేగం, కొత్త ఆలోచనలు, అద్భుతమైన వృద్ధికి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు.

# విశాఖలో ఎంపీ భారత్, ఏం ఎల్ ఏ వెలగపూడి అక్రమాలకు ప్రభుత్వం మద్దతు

### : ప్రియాంక దండి



**విశాఖపట్నం, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** విశాఖలో భూముల విలువ పెరగడంతో విశాఖ ఎంపీ భారత్, తూర్పు నియోజకవర్గ శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణ బాబు ఆగడాలు పెరిగిపోయాయని వారికి జిల్లాలో కొంతమంది పోలీస్ ఉన్నతధికారులు మద్దతు పలుకుతున్నారని కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో గీతం యూనివర్సిటీ ప్రభుత్వ భూమిని కబ్జా చేసిందని గుర్తించి అధికారులు ఆ భూమిని వెనక్కి తీసుకుంటే విశాఖ నగర కార్పొరేషన్ లో అధికార మార్పిడి జరగగానే ఆ విలువైన భూమిని కౌన్సిల్ సహాయంతో అధికారికంగా ఎంపీ కొట్టేయాలని చూస్తున్నారని,అలాగే వెలగపూడి పై అనేక భూ దందా ఆరోపణలు ఉన్నాయని వారి అక్రమాలు అడ్డుకునే అధికారులంటే వారి ఆటలు సాగవని అలాంటి వారిని బదిలీ చేయిస్తున్నారని మంచి అధికారిగా పేరు తెచ్చుకున్న శ్రీకాకుళం డిఎస్పీ వివేకానంద విశాఖ నగరంలో అత్యంత కీలకమైన హార్బర్ ఏసీపీగా బదిలీ అయిన 24 గంటలలోనే తిరిగి శ్రీకాకుళం బదిలీ అవడానికి వెలగపూడి ప్రభుత్వంలో చక్రం తిప్పాడని ఆరోపణలు విపిస్తున్నాయి. తమ భూ దందాలకు ఎవరు అడ్డు రాకూడదని తమ చెప్పు చేతల్లో ఉండే పోలీస్ అధికారులను వేయించుకుంటున్నారని, వీళ్లు చేసే భూ దందాలలో ప్రభుత్వ పెద్దలకు కూడ వాటాలు ఉన్నాయని అనుమానం కలుగుతోందని,అంతే కాకుండ కూటమి ప్రభుత్వం వచ్చాక విశాఖలో డ్రగ్స్ కల్చర్ పెరిగిందని అందులో కూటమి నాయకుల సహకారం ఉందని హార్బర్ ఏసీపీగా వివేకానంద అడ్డు పడతాడని వెంటనే బదిలీ చేయించారని ఎంపీ భారత్, తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణ బాబు పాపం పండిందని విశాఖ ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెప్తారని, ప్రభుత్వం మారితే వీరి అక్రమాల పై పూర్తి విచారణ కోరతానని ప్రియాంక అన్నారు.

# ఆదిత్యాలో ఫీజుల గందరగోళం

### -జీవో ప్రకారం ఫీజులు చెల్లించాల్సిందే.. యాజమాన్యం - ఆందోళన చెందుతున్న విద్యార్థులు - విద్యార్థులు యజమాన్యం మధ్య వాదోపవాదలు - ఫీజులు చెల్లించేది లేదంటూ విద్యార్థులు నిరసన

**టెక్కలి, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో శు క్రవారం యాజమాన్యం విద్యార్థుల మధ్య గందరగోళం వాతావరణం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నెంబర్ 118 లో భాగంగా ఆదిత్య కళాశాల యాజమాన్యం కొత్త జీవో ప్రకారం విద్యార్థుల తప్పనిసరిగా మూడు సంవత్సరాలకు సంబంధించి మొదటి నుండి మూడు సంవత్సరాలు ఫీజులు చెల్లించాల్సిందేనని గ్రూపుల మెసేజ్లు ద్వారా విద్యార్థులకు తెలిపారు. దీంతో శుక్రవారం విద్యార్థులు యాజమాన్యం తో మాట్లాడుతూ అయిపోయిన సంవత్సరం ఏడాదులు ఫీజులు మరలా ఎందుకు చెల్లించాలని, ఒక్కొక్క సంవత్సరానికి 12000 రూపాయలు చొప్పున 36వేల రూపాయలు చెల్లించాలని, లేనియెడల పరీక్షలకు రాయించమని, అదనపు చార్జులు వేయడం జరుగుతుందని చెప్పడంతో విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో ఆవేదనతో నిరసన వ్యక్తం చేశారు. కళాశాల యాజమాన్యం విద్యార్థుల నిరసనను సద్దుమణిగించి విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.




ఈ సందర్భంగా డైరెక్టర్ వివి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన కొత్త జీవో ప్రకారం 2023 నుండి 2026 వరకు సంబంధించిన ఫీజులు మొత్తం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చెల్లించాలని తెలిపారు. ఒకేసారి కట్టకుండా విడతల వారీగా చెల్లించాలని, ప్రభుత్వం నుంచి వచ్చిన ఫీజు రిఫ్రిస్మెంట్ వాళ్లకి తప్పించి, మిగిలిన వాళ్లు తప్పనిసరిగా చెల్లించాలని చెప్పడంతో విద్యార్థులు కేకలతో మేము ఫీజులు చెల్లించమని చెప్పడంతో వాగ్వాదం చేస్తూ త్వరలో మీ తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి తెలియపరుస్తామని చెప్పి అక్కడ నుండి జారుకున్నారు. దీంతో ఈ విషయం తేలక పోవడంతో విద్యార్థులు అసహనం వ్యక్తం చేశారు.




## మిస్సింగ్ అయిన విద్యార్థునీ లను 24 గంటల్లో తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

**– సిబ్బందిని అభినందించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ గఫూర్**



**నర్సీపట్నం, ఫిబ్రవరి 13, మేజర్న్యూస్:** నర్సీపట్నం పురపాలక సంఘం పరిధిలో గల శివపురం ప్రాంతానికి చెందిన ఇద్దరు విద్యార్థు నీ లు మిస్ అయ్యారని వారి తల్లిదండ్రులు బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారని సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.కె గఫూర్ తెలిపారు. కంప్లైంట్ అందిన తక్షణమే రెండు ప్రత్యేకమైన టీములను ఏర్పాటు చేసి చర్యలు ప్రారంభించామని వివరించారు. విద్యార్థులు తప్పిపోయిన విధానాన్ని పరిశీలించి సీసీ కెమెరాలు . ప్రయాణించిన బస్సు.టెక్నాలజీని ఉపయోగించి చింతపల్లి ప్రాంతంలో గల ఎస్పై సహకారం తీసుకొని జెర్రీలు ప్రాంతంలో ఉన్నట్టు గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని సీఐ తెలిపారు. విద్యార్థులు ఇద్దరూ ఆరు .ఏడు తరగతులు శివపురం గవర్నమెంట్ హైస్కూల్లో చదువుతున్నారని తెలిపారు. విద్యార్థులు ఇంటి నుంచి వెళ్లిపోయిన పరిస్థితులను విద్యార్థులు అడిగి తెలుసుకోగా సెల్ఫోన్లో రీల్స్ చూస్తూ ఉండటం వలన టీచర్ మందలించిందనే కారణంగా ఇంటి నుంచి వెళ్లిపోయామని విద్యార్థులు తెలిపారని సిఐ తెలిపారు. కేసును పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## దర్జీనగర్ కాలనీలో ఆక్రమణలు తొలగించరూ!

**– ప్రభుత్వ లెక్కల ప్రకారం 20 అడుగుల వెడల్పుతో రోడ్లు**

**– నేడు ఐదారుకు పరిమితం – ఆక్రమణలు గుర్తించి అమ్యామ్యాలతో సరి?**



అనకాపల్లి, ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్: మండలంలోని బవులువాడ పంచాయతీ శివారు దర్జీనగర్ కాలనీలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన లే–అవుట్ ప్రకారం వీధి రోడ్లు సుమారు ఇరవై అడుగుల వెడల్పు అని కాని నేడు ఆక్రమణలు ఎక్కువైపోయి కేవలం ఐదారు అడుగుల వెడల్పుతో దర్శనమిస్తున్నాయని, ఆక్రమణలను తొలగించాలని కాలనీ ప్రజలు జిల్లా గ్రామ పంచాయతీ అధికారులను కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే... బవులవాడ పంచాయతీలో దర్జీనగర్ కోలనీని అనకాపల్లి ఎమ్మెల్యేగా చేసిన దివంగత నేత కోడుగంటి గోవిందరావు హాయాంలో ఏర్పాటు చేశారు. ప్రభుత్వ రికార్డులు, లే అవుట్ ప్రకారం 20 అడుగుల వెడల్పు రోడ్లు ఉండి సువిశాల ప్రాంతంగా మూడేసి సెంట్లు చొప్పున ఇళ్లకు పట్టాలు ఇచ్చారు. ఆ తర్వాత కాలంలో దాడి వీరభద్రరావు, కొణతాల రామకృష్ణ, గంటా శ్రీనివాసరావు, పీలా గోవిందా సత్యనారాయణ, గుడివాడ అమర్ నాథ్ తదితరులు ఎమ్మెల్యేలుగా వారి వారి పదవీ కాలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ అభివృద్ధి పరిచారు. నేడు దర్జీనగర్ పట్టణ వాతావరణంను తలదన్నే రీతిలో అభివృద్ధి చెందినది. ఈ క్రమంలో కొంత మంది ధనికులు ఈ కోలనీలోని ఇళ్ళను కొనుగోలు చేసి, తిరిగి పునర్ నిర్మిస్తూ ఇరవై అడుగుల వెడల్పు గల రోడ్డును సుమారుగా నాలుగు, ఐదు అడుగుల మేరకు రోడ్లు ఆక్రమించి సదరు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేసారు. ఫలితంగా ఇరుకు సందుల వలే పంచాయతీ రోడ్లు దర్శనమిస్తున్నాయి. స్థానిక పంచాయతీ అధికారులు గుడ్లప్పగించి చూస్తున్నారు తప్పా ఆక్రమణదారులకు ఎందుకు నోటీసులు జారీచేయడం లేదు?వారికందవలసిన నజరానాలు అందుతుంటే ఎవరు రోడ్లు ఆక్రమించి నిర్మాణాలు చేసినా పట్టించుకోవడం లేదా? ఈ కాలనీలో కోటి రూపాయల విలువైన భవనాలు నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అసలు నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారా? ఈ ప్రాంతంలోని అక్రమ నిర్మాణాలు తొలగించి పూర్తి స్థాయి రోడ్లు వినియోగంలోకి తీసుకురావాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

# దళితుల పాపము పాలికులకు తగలదా..

**– మా ప్రాణాలు అయినా పణంగా పెడతామె తప్ప భూములు ఇచ్చే పని లేదు దళిత కుటుంబాలు – దళితులు దీక్షకు మద్దతుగా వైయస్సార్ పార్టీ నాయకులు కర్ణం ధర్మ శ్రీ బోడ్డెడ ప్రసాదు నాయకులు, కార్యకర్తలు – సిపిఎం పార్టీ నాయకులు దళితులకు మద్దతు తెలిపారు – దళితులు భూమిని కబ్జా కాకుండా చదును పనుల అడ్డగింత – ఓటు వేసి గెలిపించిన పాపానికి మాకు శిక్ష అంటున్న దళితులు – తమ భూములు ఇచ్చేది లేదని తేల్చి చెప్పిన దళితులు**





**అచ్చుతాపురం, ఫిబ్రవరి 13, మేజర్న్యూస్:** యలమంచిలి రాంబిల్లి మండలం, పంచదార్ల గ్రామంలో దళితులకు చెందిన భూములను చదును చేయడానికి రాంబిల్లి మండలం రెవిన్యూ అధికారుల సమక్షంలో బుల్డోజర్ను తీసుకొచ్చి చదును చేసే ప్రయత్నం చేయగా, బాధిత దళితులు అడ్డుకున్నారు. తమ భూములు ఇచ్చేది లేదని, దీనిపై ఇప్పటికే ఆందోళన చేస్తున్నామని తెలిపారు. తమ ఓటు వేసిన పాపానికి మాకు ఈ శిక్ష విధించారని దళిత రైతులు వాపోతున్నారు. అలాగే తమ భూముల విషయంపై జిల్లా కలెక్టరు ఆర్డీఓకు ఫిర్యాదు చేసి ఉన్నామని, కనుక అది తేలే వరకు తమ భూముల్లో ఎటువంటి చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేశారు. మీరు ఏదో ఒక సర్దుబాటు చేసుకొని పరిష్కారం చేసుకోవాలని, లేకపోతే ఇలా ఆపడం వల్ల మీ పై కేసులు పెడతామని రెవెన్యూ, పోలీస్ అధికారులు హెచ్చరించారు. అధికారుల వైఖరిపై బాధిత దళిత రైతు అనంతల ఈశ్వరరావు బుల్డోజర్కు అడ్డంగా కూర్చొని నిరసన తెలుపుతున్న దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుటాల కనకరత్నం, గుడాబంది సాయమ్మ, కొల్లి అప్పలనారాస, గుటాల రాజు, డి పట్టా కలిగిన దళిత రైతుల కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

# దళితుల భూములపై జనసేన ఎమ్మెల్యే సుందరపు కన్ను

**– దళితులకు అండగా వైఎస్ఆర్సీపీ నాయకులు మద్దతుగా**

**– మాజీ ప్రభుత్వ విప్, యలమంచిలి నియోజకవర్గం సమన్వయకర్త – కరణం ధర్మ**



**అచ్చుతాపురం రాంబల్లి, ఫిబ్రవరి 13, మేజర్న్యూస్:** అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త అరకు పార్లమెంట్ పరిశీలకులు బొడ్డేడ ప్రసాద్ మాజీ శాసనసభ్యులు పాయకరావుపేట నియోజకవర్గం సమన్వయకర్తబి కంబాల జోగులు వైఎస్ఆర్సీపీ మీడియా అధికార ప్రతినిధి ఆ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మంచా నాగమల్లేశ్వరి ఈరోజు అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం రాంబిల్లి మండలం పంచదార్ల గ్రామంలో దళితుల భూములను లాక్కొనేందుకు కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్లిభారీ స్కెచ్ వేశారు.దాదాపుగా రూ.200 కోట్లు విలువైన 43.64ఎకరాలు భూమి కబ్జా చేయాలని చూస్తున్నారంటూ రాంబిల్లి మండలం పంచదార్ల గ్రామానికి చెందిన దళితులు ఆరోపిస్తున్నారు. 1978లో సర్వే నెంబర్.2లో 31దళిత కుటుంబాలకు 43.64 ఎకరాలు భూమి ఇచ్చింది దళితులకు ఇచ్చిన భూముల్ని దౌర్జన్యంగా లాక్కొనేందుకు కూటమి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ స్కెచ్ వేశారంటూ ఆరోపిస్తున్నాయి.అంటున్న వైఎస్ఆర్సీపీ నాయకులు మాజీ ప్రభుత్వ విప్ యలమంచిలి నియోజకవర్గం సమన్వయకర్త శ్రీ కరణం ధర్మశ్రీ మరియు అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త లిబొడ్డేడ ప్రసాద్ ఎలమంచిలి నియోజకవర్గ వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మాకు న్యాయశీ చేయండి






**నక్కపల్లి,** ఉత్తరాంధ్ర జిల్లాలనుంచి పశువులను హైదరాబాద్ తమిళనాడు, కేరళా రాష్ట్రాలకు కొత్తవలస శేఖర్ ఎగుమతి చేస్తున్నా రాణి దేవవరం గ్రామ పాడి రైతులు అన్నారు. నక్కపల్లి పోలీసు ఎస్టేషన్లో డీఎస్పీ శ్రీనివాసరావు,సిఐ మురళికు వినతి పత్రం అందజేసారు. మానుంచి సేకరించిన ఆదార్ కార్డుల ఆధారంగా పశుసంవర్ధకశాఖ నుంచి అక్రమంగా అనుమతులు పొంది తన వద్ద ఉన్న సుమారు 50 వాహనాల్లో ప్రతిరోజు పశువులను కబేళాకు తరలిస్తున్నాడు. తమ నుంచి సేకరించిన ఆధార్ కార్డులను దుర్వినియోగం చేస్తున్నాడ నీ అతనిపై చర్చలు తీ సుకోవాలన్నారు. ఈ కార్యక్రమశీ లో దేవర నాగేశ్వరరావు, బుజ్జి, శ్రీను, లచ్చా బాబు, సత్తిబాబు తడితరులు పోల్గొన్నారు.




## శివరాత్రి జాతరకు భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు



**నెల్లిమర్ల, ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్ :** శివరాత్రి జాతరకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి డివి మల్లికార్జునరావు అధికారులను ఆదేశించారు. మండలంలో రామతీర్థంలో ఈనెల 15,16 తేదిలలో నిర్వహించనున్న శివరాత్రి జాతరకు సంబంధించి ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ముఖ్యంగా పారిశుధ్యం సంబంధించి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదనపు పారిశుధ్య సిబ్బంది, పారిశుధ్య వాహనాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతరలో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ శంకర్ జగన్నాథం, పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బ్యాంకు ఖాతాలు వెంటనే రెన్యువల్ చేసుకోవాలి : ఎస్‌టిఓ పద్మనాభం



**బొబ్బిలి, ఫిబ్రవరి 13: మేజర్ న్యూస్ :** బొబ్బిలి, రామభద్రపురం పరిధిలో 339 సంస్థల, పొదుపు సంఘాలు, ప్రభుత్వ, ఇతర బ్యాంక్ ఖాతాలను ఈ కేవైసీ డాక్యుమెంట్లు సమర్పించి రెన్యువల్ చేసుకోవాలని బొబ్బిలి సబ్ ట్రెజరీ అధికారి పద్మనాభం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్బిఐ నిబంధనలు ప్రకారం వాటిలో నిల్వ నగదు వాడుకలోకి తీసుకురావాలి. రెన్యువల్ చేసిన ఖాతా వివరాలు ఉప ఖజానా కార్యాలయం, బొబ్బిలికి అందజేయాలని చెప్పారు. మున్సిపల్ ఆఫీస్ కౌన్సిల్ హాల్‌లో పొదుపు సంఘాల వారితో నిర్వహించిన సమావేశంలో, పి.వి.పద్మనాభం, ఉప ఖజానా అధికారి పాల్గొన్నారు.

## ఆంధ్ర ప్రదేశ్ విశ్రాంతి ఉద్యోగుల తెర్లాం యూనిట్ సంఘ ఎన్నిక ఏకగ్రీవం

### – ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి ఎల్.జగన్నాథం



**తెర్లాం ఫిబ్రవరి 13 మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ విశ్రాంతి ఉద్యోగుల తెర్లాం యూనిట్ సంఘం ఎన్నిక ఏకగ్రీవం గా జరిగింది. శుక్రవారం తెర్లాం లో జరిగిన ఈ ఎన్నికల్లో ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి ఎల్ జగన్నాథం సమక్షంలో ఎన్నిక జరగడం విశేషం. అధ్యక్షులుగా పప్పల శివుడు నాయుడు ప్రధాన కార్యదర్శిగా ఎం రమణ కోశాధికారిగా బోను సత్యం ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం. వెంకట నాయుడు లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి ఎల్ .జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికల్లో బొబ్బిలి విశ్రాంతి ఉద్యోగుల సంఘ యూనిట్ గౌరవ అధ్యక్షులు మరిశర్ల సింహాచలనాయుడు హాజరు కావడం మరో విశేషం. ఈ సందర్భంగా సింహాచలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగా పదవీ విరమణ చేసి విశ్రాంతి ఉద్యోగులుగా ఉన్న మనం కలిసికట్టుగా ఐక్యమత్యంతో మన హక్కులను పోరాటానికి అందరూ సన్నద్ధులు కావాలని కోరారు. ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా కలిసికట్టుగా ఆ సమస్యను పరిష్కరించే దిశగా ప్రతి ఒక్కరూ కలసి రావాలని ఆకాంక్షించారు.

# బాలస్వామికి బాలారిష్టాలు

### – ప్రక్షాళన చేయకపోతే కష్టాలే




**విజయనగరం కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయనగరం నగర పాలక సంస్థ కమిషనర్ గా ఈనెల10వ తేదీన బాధ్యతలు స్వీకరించిన బి.బాలస్వామి అనేక బాలారిష్టాలను ఎదుర్కొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. బాధ్యతలు చేపట్టిన తర్వాత 29 మంది స్వర్ణ వార్డు సచివాలయాల కార్యదర్శులకు మెమో జారీ చేస్తూ మొదటి సంతకం చేశారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో పురోగతి లేనందున వీరికి మెమో జారీ చేశారు. అయితే చాలా మంది కార్యదర్శులు మెమో తీసుకోలేదు. దీన్ని బట్టి బాధ్యతల నిర్వహణలో ఎంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఎగ్జిక్యూటివ్ అథారిటీ ఇచ్చిన మెమోలను తీసుకోకపోవడం వారిలో ఉన్న నిర్లక్ష్యం తేటతెల్లమైంది. మరోవైపు కార్యాలయంలో ఉన్న ఉద్యోగులు బాధ్యతగా పనిచేయడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో పాలన సాగించడం కమిషనర్‌కి కత్తి మీద సాములా పరిణమిస్తోంది. వాస్తవానికి విజయనగరం నగర పాలక సంస్థ పరిధిలో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే నత్తనడక గా జరుగుతోంది. అనేకసార్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ రామ సుందర్ రెడ్డి హెచ్చరించారు. మరో వైపు రాష్ట్రస్థాయి అధికారులు కూడా సీరియస్ అయ్యారు. ఈ నేపథ్యంలో ఒకవైపు కార్యాలయాన్ని, మరోవైపు సచివాలయాలను ప్రక్షాళన చేయకపోతే కమిషనర్ బాలస్వామి మరిన్ని ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా రాజకీయ నాయకుల నీడ కింద పనిచేసే ఉద్యోగులను గుర్తించి సీరియస్ యాక్షన్ తీసుకోకపోతే పాలనాపరంగా కష్టాలను ఎదుర్కొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వెంటనే అంతర్గత బదిలీలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా ఓ వైసీపీ నాయకుడికి ఇన్ ఫార్మర్ గా వ్యవహరిస్తున్న ఉద్యోగులపై వేటు వేయాల్సిన అవసరం కూడా ఉంది. ఇలాంటి ఉద్యోగులపై వేటు వేయకపోతే రానున్న రోజుల్లో అధికారులు మరింత అభాసుపాలు కావాల్సి ఉంటుంది. కార్యాలయ రహస్యాలను, గోప్యతను బహిర్గతం చేస్తున్నవారి భరతం పట్టాల్సిన అవసరం కూడా ఎంతైనా ఉంది. కార్యాలయంలోని అన్ని విభాగాల్లోనూ నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. అవినీతి, అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అందువల్ల కార్యాలయంలో ఉద్యోగుల పనితీరును పరిశీలించేందుకు అప్పుడప్పుడు ఆకస్మిక తనిఖీలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

**సచివాలయాల పనితీరుపై కూడా దృష్టి పెట్టాలి :** నగర పాలక సంస్థ పరిధిలో 61 స్వర్ణ వార్డు సచివాలయాల ఉన్నాయి. ఈ సచివాలయాల్లో 485 మంది కార్యదర్శులు పనిచేస్తున్నారు. చాలామంది కార్యదర్శులు సక్రమంగా పనిచేయడం లేదనే ఆరోపణలున్నాయి. మరికొంత మొక్కుబడిగా చేస్తున్నారనే విమర్శలున్నాయి. అయితే కొద్దిమంది మాత్రమే పూర్తిస్థాయిలో పనిచేస్తున్నారని అధికారులు గుర్తించారు. చాలామంది కార్యదర్శులు స్థానికంగా నివాసం ఉండటం లేదు. దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తుండటం వల్ల పౌర సేవలకు అంతరాయం కలుగుతోంది. పని ఒత్తిడి కారణంగా అనేకమంది కార్యదర్శులు అనారోగ్యానికి గురవుతున్నారు. రెగ్యులర్ బాధ్యతలతోపాటు వివిధ రకాల సర్వే బాధ్యతలను అప్పగించడంతో ఒత్తిడికి గురవుతున్నారు.

**29 మంది కార్యదర్శులకు మెమోలు :** నగరంలో జరుగుతున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో పురోగతి సాధించని 29 మంది స్వర్ణ వార్డు సచివాలయాల కార్యదర్శులకు కమిషనర్ బి బాలస్వామి మెమోలు జారీ చేశారు. 61 సచివాలయాల్లో 481 మంది కార్యదర్శులకు సర్వే బాధ్యతలను అప్పగించారు. సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నా, అనేక సచివాలయాల్లో ముందుకు సాగడం లేదు. ఈ నేపథ్యంలో సర్వే ప్రక్రియను సక్రమంగా చేయని కార్యదర్శులకు మెమోలు జారీ చేశారు.

**25.38 శాతం మాత్రమే యుఎఫ్ఎస్ సర్వే :** నగర పాలక సంస్థ పరిధిలో ఇంతవరకు యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే (యుఎఫ్ఎస్) 25 38 శాతం మాత్రమే జరిగింది. కొన్ని చోట్ల కుటుంబ సభ్యులు అందుబాటులో లేకపోవడం, మరికొన్ని చోట్ల కార్యదర్శులు బాధ్యతగా చేయకపోవడం వల్ల సర్వే ముందుకు సాగడం లేదు. నగరంలో 80,706 ఇళ్లు ఉండగా ఇంతవరకు 60,220 కుటుంబాల సర్వే జరిగింది. ఇంకా 20,486 కుటుంబాల సర్వే పెండింగ్ లో ఉంది. 2025 డిసెంబర్ 14 వతేదీ ప్రభుత్వం యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను మొదలుపెట్టింది .

# రహదారి సౌకర్యాలతోనే గ్రామాల అభివృద్ధి



**పూసపాటిరేగ, ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్ :** పల్లెలు అభివృద్ధి చెందాలంటే గ్రామాలకు అనుసంధాన రహదారి నిర్మాణాలు చేపట్టినప్పుడే సాధ్యమవుతుందని మార్క్ఫెడ్ రాష్ట్ర చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గం తెదేపా ఇన్చార్జ్ కర్రోతు బంగారు రాజు అన్నారు. మండలంలోని లంకలపల్లి పాలెం పంచాయితీ నుంచి చౌడువాడ పంచాయతీకి అనుసంధాన బిటి రోడ్డు నిర్మాణానికి తెదేపా నాయకులతో కలిసి మార్క్ఫెడ్ రాష్ట్ర చైర్మన్ కర్రోతు బంగారు రాజు భూమి పూజ చేసి రహదారి నిర్మాణ పనులను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. వందల చరిత్ర కలిగిన లంకలపల్లి పాలెం రహదారుల సౌకర్యం లేకపోవడం వలన రెండు మాసాల కిందట రైతు సదస్సుకు విచ్చేసిన మార్క్ఫెడ్ రాష్ట్ర చైర్మన్ కర్రోతు బంగారు రాజుకు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు తమ గోడును వెల్లబోసుకున్నారు. దీనితో రహదారి సౌకర్యానికి నిధులను మంజూరు చేయడంతో పాటు తన సొంత బాధ్యతగా రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటానంటూ అప్పటి గ్రామ సభలో బంగారు రాజు హామీ ఇచ్చారు. దీనితో బంగార్రాజు గ్రామస్తులకు ఇచ్చిన హామీ ప్రకారం రహదారు పనులకు శంకుస్థాపన చేయడమే కాకుండా రహదారి సౌకర్యాన్ని సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా గ్రామ పెద్దల సమక్షంలో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ రహదారిని పూర్తి చేయడం ద్వారా లంకలపల్లి పాలెం, చౌడువాడ పంచాయతీల మధ్య మరింత రహదారి సౌకర్యాలు మెరుగుపడి పల్లెలు అభివృద్ధి చెందుతాయి అన్న ఆశాభావాన్ని బంగార్రాజు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు చిన్నం నాయుడు, శంకర్రావు, జగన్నాథం, ప్రసాద్ రావు, ఏఎంసీ సభ్యుడు మోహనరావు, ఇనపకుర్తి శ్రీనివాసరావు, పసుపులేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# అరకులోయలో కార్మికుల సార్వత్రిక సమ్మె సక్సెస్

**– మూతపడిన పర్యాటక కేంద్రాలు, దుకాణాలు**






**అరకులోయ, ఫిబ్రవరి 12, మేజర్‌న్యూస్:** తమకు తీవ్రంగా నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్ ను తక్షణమే రద్దు చేసి పాత కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలనే డిమాండ్లతో కార్మికులు చేపట్టిన జాతీయ సార్వత్రిక సమ్మె విజయవంతం అయ్యింది.దేశవ్యాప్త సమ్మెలో భాగంగా అరకులోయలో సిఐటియు ఆధ్వర్యంలో తలపెట్టిన సమ్మె ప్రశాంత వాతావరణంలో జయప్రదంగా ముగిసింది.సిఐటియు,ఆదివాసీ గిరిజన సంఘం,సిపిఎం రాష్ట్ర,జిల్లా,మండల స్థాయిల నాయకుల నేతృత్వంలో జరిగిన జాతీయ సార్వత్రిక సమ్మెలో అంగన్వాడీ కార్యకర్తలు,టూరిజం,ఐ టి డి ఏ,వైద్య ఆరోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణలో పనిచేస్తున్న కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసన వ్యక్తం చేస్తూ నినాదించారు.స్థానిక గిరిజన సంస్కృతి మ్యూజియం ముఖ ద్వారం వద్ద కార్మిక సంఘం నాయకులు,కార్మికులందరూ బైఠాయించి తమ హక్కులు చట్టాలను కాపాడుకునేందుకు సమ్మె చేపట్టారు.ఈ ప్రాంతం కార్మిక వర్గం చేపట్టిన సమ్మెకు అరకులోయ ప్రెస్ క్లబ్ కార్యనిర్వాహక సభ్యులంతా సంఘీభావం తెలిపారు. అరకులోయ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎల్బి. వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఏపీయూడబ్ల్యూజే పర్యవేక్షణలోని ప్రెస్ క్లబ్ సభ్యులు సంపూర్ణ మద్దతు ప్రకటించి సమ్మెలో కూర్చున్నారు.అరకులోయ ప్రెస్ క్లబ్ తో పాటు పలు ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు సైతం మద్దతు ప్రకటించాయి.కార్మికుల సార్వత్రిక సమ్మె కారణంగా అరకులోయలోని వ్యాపారులు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసి మద్దతును తెలియజేశారు.సమ్మె సందర్భంగా కార్మికులు విధులను బహిష్కరించడంతో పర్యాటక కేంద్రాలు మూతబడ్డాయి.బొర్రా గుహలు,గిరిజన సంస్కృతి మ్యూజియం,పద్మాపురం, కొత్తవలస ఉద్యానవన కేంద్రాలు,చాపరాయి,కటిక, తాడిగుడ జలపాతాలను మూసి వేశారు.ఈ సందర్భంగా సిఐటియు అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి వి. ఉమామహేశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు.బాలదేవ్, అరకులోయ ప్రెస్ క్లబ్ నాయకుడు దురియా. గోవర్ధన్ మాట్లాడుతూ కేంద్రం కొత్తగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ కార్మికులను బానిసలుగా చేస్తాయని,కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు లాభం కోసం కార్మికులను పణంగా పెట్టి మోడీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు.ఈ లేబర్ కోడ్ వల్ల కార్మికులు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటారని చెప్పారు. కొత్తగా తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో 500 సంఘాలు పాల్గొన్నాయని తెలిపారు. కొత్తగా లేబర్ కోడ్స్ దేశవ్యాప్తంగా అమలులోకి రావడంతో 29 కార్మిక చట్టాలు రద్దు అయ్యాయని వారు తెలిపారు.కార్పొరేట్ల ఒత్తిడితోనే పాలకవర్గం లేబర్ కోడ్స్ ను అమల్లోకి తెచ్చిందన్నారు.పని గంటలు 8 నుండి 12 కు మార్చారని చెప్పారు.ఈ కోడ్ వలన కార్మికులకు శిక్ష యజమానులకు రక్షగా మారినట్టు ఉమామహేశ్వర రావు,బాలదేవ్,గోవర్ధన్ అభివర్ణించారు.కొత్తగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని , విశాఖ ఉక్కుతో సహా ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని,కనీస వేతనం 30 వేల రూపాయలు చెల్లించాలని ,అంగన్వాడి, ఆశ,మధ్యాహ్నం భోజన పథకం,వి వో ఏ తదితర స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.అనంతరం కార్మికులు అరకులోయ పట్టణ ప్రధాన రహదారిలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం సీనియర్ నాయకులు రఘునాథ్,వరభారికి. మహేష్,ఆదివాసీ గిరిజన సంఘం,సిఐటియు నాయకులు చిన్నబాబు, కిండంగి. రామారావు,మగ్గన్న,హరి,భగత్ రాం,రామన్న, రమేష్,నాగేంద్ర,ఐటీడీఏ వర్కర్స్ యూనియన్ నాయకులు దాడి.రాజు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మెడికల్ మాఫియాను అరికట్టి ప్రజారోగ్యాన్ని కాపాడండి

**: సిపిఐ డిమాండ్ – ఫిబ్రవరి 14న జిల్లా కలెక్టరు ఆఫీస్ వద్ద నిరసన జయప్రదం చేయాలని పిలుపిచ్చిన సిపిఐ**



**మధురవాడ, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో ప్రజలు ఆరోగ్యంతో చలగాటమాడే మెడికల్ మాఫియాను అరికట్టాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం మధురవాడ సిపిఐ కార్యాలయం వద్ద గోడ పత్రిక ఆవిష్కరణ చేసారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత సమాజ ప్రాధాన్య అవసరాల విషయంలో విద్య, వైద్యం ప్రధానమైనవని, ప్రాధమికంగా ప్రజారోగ్యం అనేది ప్రభుత్వ బాధ్యతగా రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్నారని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నూతన మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తామంటూ ఒంటెద్దు పోకడకు పోతోందని విమర్శించారు. ఔషధం పేరుతో విషం అమ్మే బోగస్ మెడికల్ కంపెనీలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 14వ తేదీ శనివారం విశాఖ జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద నిరసన చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఆ నిరసనలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ, పెంటపల్లి కాంతమ్మ, ఎన్ అప్పారావు,కె జగ్గాస్వామి, కె రాంమహేష్, డి సతీష్, మోహన్, మహేష్,నాగరాజు,ఎ ఎన్ బాబు, పి రమణ, కె రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరిలోనూ పరమాత్మను చూడండి

**– పరులకు ఎంతో కొంత సేవ చేయండి – సేవా భావం కలిగిన వారికి నిరంతరం పరమశివుడు ఆశీస్సులు – నగర్ పోలీస్ కమిషనర్ బాగ్చీ**



**విశాఖపట్నం, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** సమాజంలో ప్రతి ఒక్కరిలోనూ పరమాత్మను చూడగలిగితే అటువంటి వ్యక్తులు ధన్యజీవులని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బాగ్చి అన్నారు.. శుక్రవారం ఇక్కడ డాబా గార్డెన్స్ వైజాగ్ జర్నలిస్టుల ఫోరం ప్రెస్ క్లబ్ లో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దేహంలోనూ ఆ పరమాత్ముడు కొలువై ఉంటారన్నారు. . చేసే పనులు బట్టి స్వర్గ ప్రాప్తి.. నరక ప్రాప్తి లభిస్తుందన్నారు.. కాబట్టి.. ప్రతి ఒక్కరూ అందుకు తగ్గట్లుగానే మంచి పనులతో ముందుకు సాగాలన్నారు. ఇతరులకు ఎంతో కొంత సహాయం చేయగలిగితే అటువంటి వారికి ఆ పరమశివుడు ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు.. ఆంధ్రప్రదేశ్ లో ఎక్కడ లేని విధంగా శివాలయాలు ఉన్నాయని అది మనమంతా అదృష్టంగా భావించాలన్నారు.. ప్రపంచవ్యాప్తంగా శివరాత్రి పర్వదినాన్ని ఎంత గొప్పగా జరుపుకుంటారని అటువంటి మహోన్నతమైన పరమేశ్వరుడు ఆశీస్సులు సర్వ మానవాళి పై ఉండాలని సిపి ఆకాంక్షించారు. గౌరవ అతిథిగా హాజరైన విశాఖ జిల్లా బిజెపి అధ్యక్షులు ఎం ఎం ఎన్ పరశురామరాజు మాట్లాడుతూ హిందూ సమాజంలో అందరూ సమానమే అన్నారు.. మహాశివరాత్రి పర్వ దినాన్ని ప్రతి ఒక్కరు ఆనందమయంగా జరుపుకోవాలని.. ఆ పరమ శివుడు ఆశీస్సులు అందరి పైన ఉండాలని పేర్కొన్నారు. పదిమందికి సేవ చేయడంతో పాటు పరమాత్ముడు మెచ్చేమంచి పనులు కూడా చేసినప్పుడు మన జన్మ సార్ధకత అవుతుంది అన్నారు.. జనసేన పార్టీ నాయకులు. 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ ఆ పరమశివుడు ఆశీస్సులతోనే తాను నిత్యం అనేక సేవా కార్యక్రమాలు చేపట్టగలుగుతున్నట్లు చెప్పారు.. త్వరలోనే దక్షిణ నియోజకవర్గం పరిధిలో నిరుపేదలకు సామూహిక వివాహాలు జరిపించనున్నట్లు చెప్పారు.. మంగళ సూత్రాలు నుంచి అన్ని ఖర్చులు తానే భరిస్తానన్నారు.. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు.. కార్యక్రమ నిర్వాహకులు ప్రజాపిత బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం ప్రతినిధి బి కే రామేశ్వరీ మాట్లాడుతూ ప్రపంచమంతా ఆత్మ శక్తితోనే నడుస్తుంది అన్నారు. శివరాత్రి రోజు రాత్రి 12 గంటలకు లింగోద్భవం జరుగుతుందని భక్తులు ప్రగాఢ విశ్వాసంలో పరమశివుడు భూమి మీద అవతరిస్తారు అన్నారు. ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ పరమత సహనం కలిగి ఉండి మానవతా దృక్పథంతో దయ.. ప్రేమ .కరుణ కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా టీవీ టూరిజం డైరెక్టర్ మణిభూషణ్.. ఆదిత్య రూపకల్పన చేసిన పరమశివుడి ప్రత్యేకతతో కూడిన పాటను నగర పోలీస్ కమిషనర్ ఆవిష్కరించారు.. ఈ పాటను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రూపొందించారు.. ఈ సందర్భంగా అతిథులందరికీ ప్రసాదాలు అందజేసి జ్ఞాపికలు బహుకరించారు.. ప్రజాపిత బ్రహ్మకుమారిస్ ప్రతినిధులు సోమేశ్వరి.. లలిత.. రూప.. ఎవరిది టూ టౌన్ సీఐ ఎర్రమనాయుడు.. ఎస్ఐ సంధ్య.. బ్రహ్మకుమారీలు తదితరులంతా పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కు 22 వినతులు

**– జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు**



**విశాఖపట్నం, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమంలో 22 వినతులు వచ్చాయని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు తెలిపారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయం తన ఛాంబర్ లో సిపి లు, డీసీపీలు, ఏసీపీ లతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ సిటీ ప్లానరు మాట్లాడుతూ జీవీఎంసీ లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమం లో జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు నమోదవుతున్నందున, జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు/ వినతులను స్వీకరించ్టందుకు గానూ ప్రత్యేకంగా ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమానికి సంబంధించి 22 వినతులు స్వీకరించడం జరిగినదని, అందులో ముఖ్యంగా భీమిలి జోన్ కు 01, మధురవాడ జోన్ కు 03, ఈస్ట్ జోన్ కు 07, సౌత్ జోన్ కు 02, నార్త్ జోన్ కు 02, వెస్ట్ జోన్ కు 01, పెందుర్తి జోన్ కు 02, గాజువాక జోన్ కు 04 వినతులు వచ్చాయని తెలిపారు. స్వీకరించిన /ఫిర్యాదులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగు అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించడమైనదన్నారు. పట్టణ ప్రణాళికా విభాగమునకు సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు మొదలైనవి ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమంలో ప్రజలు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.

# వంశధార నిర్వాసితుల కన్నీటికి సాక్షాలు

**– చంద్రబాబు నాయుడు ప్రభుత్వమే..**




**పాతపట్నం, ఫిబ్రవరి 13 మేజర్‌న్యూస్:** వంశధార ప్రాజెక్టు నిర్వాసితుల విషయంలో గత తెలుగుదేశం ప్రభుత్వం చేసిన అవినీతిని కప్పిపుచ్చుకుంటూ, నేడు అసెంబ్లీ సాక్షిగా తప్పుడు ఆరోపణలను చేస్తుందని వైఎస్‌ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే శ్రీమతి రెడ్డి శాంతి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య దేవాలయమైన అసెంబ్లీలో వాస్తవాలను వక్రీకరించి మాట్లాడటం శోచనీయమన్నారు. 2014 నుండి 2019 వరకు సాగిన తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వంశధార నిర్వాసితుల కోసం కేటాయించిన సుమారు 436 కోట్ల రూపాయలలో భారీ ఎత్తున అవినీతికి పాల్పడింది సాక్షాత్తు చంద్రబాబు నాయుడు ప్రభుత్వమే. ముఖ్యంగా యూత్ ప్యాకేజీల మంజూరులో అర్హులకు అన్యాయం చేస్తూ తమ అనుచరులకు దోచిపెట్టారు. యూత్ ప్యాకేజీల పంపిణీలోనూ, నష్టపరిహారం చెల్లింపుల్లోనూ పచ్చ చొక్కాల నాయకులు అక్రమాలకు పాల్పడి నిర్వాసితుల కడుపు కొట్టారు. నష్టపరిహారం చెల్లింపులో పారదర్శకత లోపించి, క్షేత్రస్థాయిలో అక్రమాలు జరిగాయి. టీడీపీ ప్రభుత్వ వైఫల్యాలను సరిదిద్దుతూ, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్వాసితుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించింది. నిర్వాసితులకు అండగా ఉంటూ 216.71 కోట్ల రూపాయల అదనపు పరిహారాన్ని మంజూరు చేసింది. ఒక్క రూపాయి కూడా అవినీతికి తావులేకుండా, నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే నిధులు చేరేలా పారదర్శక విధానాన్ని అమలు చేశాం. సుమారు 164 మందికి మాత్రమే పరిహారం అందాల్సి ఉంది. ఇది కూడా కేవలం ఎన్నికల కోడ్ మరియు సాంకేతిక కారణాల వల్ల ఆగిందే తప్ప, ఉద్దేశపూర్వకమైంది కాదు. ఇది మినహా మిగిలిన వారందరికీ సంపూర్ణంగా న్యాయం జరిగింది. అసెంబ్లీ వేదికగా టీడీపీ చేస్తున్న విమర్శలు కేవలం రాజకీయ లబ్ధి కోసమే. క్షేత్రస్థాయిలో నిర్వాసితులు జగనన్న ప్రభుత్వం అందించిన సాయం పట్ల సంతృప్తిగా ఉన్నారని అన్నారు. తప్పుడు ఆరోపణలు చేయడం మానుకొని, వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. గతంలో మీరు చేసిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు ప్రచారం చేయడం మానుకోవాలని హెచ్చరించారు.

# ట్రాఫిక్ చర్యలు ముమ్మరం చేసిన ఎస్ఐ..

**– అపరిమిత విద్యార్థులు ప్రయాణికులతో సంచరిస్తున్న ఆటోలు..**



**నరసన్నపేట, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** నరసన్నపేట పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై పోలీస్ యంత్రాంగం కదిలింది. స్థానిక కళాశాల రోడ్ లో ఎటువంటి వాహనాలు నిలపకూడదని పోలీసులు హెచ్చరించారు. ఇరుకైన రహదారి కావడంతో పలుమార్లు ట్రాఫిక్ జామ్ అవుతుందని గమనించిన పోలీసులు దుకాణదారులు కూడా ద్విచక్ర వాహనాలను షాపుల ముందు ఉంచుకోవదదని హెచ్చరించారు. శుక్రవారం ఈ మేరకు పోలీసులు మైక్ సహాయంతో దుకాణదారులకు హెచ్చరికలు జారీ చేశారు. వాహనాలు రోడ్డుపై నిలిపితే కఠిన చర్యలు చేపడతామని సూచించారు. ట్రాఫిక్ నియమాలు కచ్చితంగా అమలు చేస్తామని ప్రజల సహకరించాలని ఎస్సై బి. గణేష్ అన్నారు. కళాశాల రహదారితో పాటు పట్టణంలోని అన్ని ప్రాంతాలలో ట్రాఫిక్ పై నిఘా అవసరమైన చర్యలు చేపడతామని ప్రజలు సహకరించాలని ఎస్సై అన్నారు. వాహనదారులు కచ్చితంగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని, మహిళలపై ఎటువంటి వేధింపులకు పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. విలువైన ఆభరణాలు ధరించి మహిళలు రోడ్లపై తిరగరాదని, ఇటీవల బంగారం కోసం దొంగతనాలు అధికమయ్యాయని ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఎస్సై గణేష్ విజ్ఞప్తి చేశారు. దేవాలయాలు, గృహ సముదాయాలు, దుకాణాలు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు. నరసన్నపేట పట్టణంలో పోలీసులు తీసుకుంటున్న ట్రాఫిక్ చర్యల పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అపరమిత ప్రయాణికులతో, విద్యార్థులతో రోడ్లపై తిరుగుతున్న ఆటోలపై దృష్టి సారించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆటోవాలాలు రేష్ డ్రైవింగ్ తో, ఆటోలో పాటల సౌండ్ లతో పట్టణం, వీధులలో సంచరిస్తున్నారని, దీనిని నిరోధించాలని పోలీసులకు స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆక్రమణలపై తహసీల్దార్ కు ఫిర్యాదు





**సంతబొమ్మాళి, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** మండలంలో నౌపద గ్రామం ఇందిరా కాలనీలో ప్రభుత్వ భూమి పోలాబంధ చెరువు, స్మశానం, స్మశానం రోడ్డు, జీజే కాలేజీ రోడ్డు, ఆర్ అండ్ బి రోడ్డు లను ఇందిరా కాలనీవాసులు ఆక్రమణ చేశారని, అటువంటి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ బి హేమ్సుందర్రావుకు నౌపద గ్రామానికి చెందిన గాలి మల్లేశ్వర రెడ్డి శుక్రవారం వినతి పత్రం అందించారు. నౌపద గ్రామం ఇందిరా కాలనీకి చెందిన 21 మంది పోలాబంధ చెరువు గట్టు, పక్కనే ఉన్న స్మశానం, స్మశానానికి వెళ్లే రోడ్డు, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డు, ఆంజనేయ గుడి ఎదురుగా ఆర్ అండ్ బి రోడ్డు, బొబ్బిలి కాలనీ నుండి ఇందిరా కాలనీ కి వెళ్లే గోలి రోడ్డు, వినాయకుడి మండపం కబ్జాలు చేసి, అటువంటి ఆక్రమణలలో ఇల్లులు, షాపులు పశువుల శాలలు నిర్మించుకున్నారని ఫిర్యాదులో వివరించారు . ప్రభుత్వ స్థలాలు ఆక్రమణదారుల చేతిలో అన్యక్రాంతమవుతున్న చర్యలు లేకపోవడం విచారకరమని పేర్కొన్నారు. అలాగే కిలుగు సత్యం అనే వ్యక్తి పక్కా గ్రామ రిజిస్ట్రేషన్ ఉన్న నా సొంత ఆస్తిని ఆక్రమణ చేయాలనే ప్రయత్నం చేస్తూ నాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను గుర్తించి పరిరక్షించాలని తహసీల్దారుకు విజ్ఞప్తి చేశారు విజ్ఞప్తి చేశారు.

# శాసనసభలో వంతెన సమస్యను ప్రస్తావించిన

**– ఎమ్మెల్యే బొగ్గు**



**పోలాకి, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** పోలాకి మండలంలో ఉన్న వనిత మండలం వంతెన నిర్మాణానికి ప్రభుత్వం సహకరించాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ వంతెన నిర్మాణం పూర్తి అయితే నౌపడ నుండి కళింగపట్నం వరకు ఉన్న తీర ప్రాంత వాసులకు ఎంతో ఉపయోగపడుతుందని గుర్తు చేశారు. నిర్వాసితులకు సుమారు 78 లక్షలు ఇవ్వవలసి ఉన్న బకాయిలను చెల్లించినట్లయితే పనులు తిరిగి ప్రారంభమవుతాయని, అలాగే గార మండలం పాత పోలీస్ స్టేషన్ తొలగించి నూతన పోలీస్ స్టేషన్ నిర్మించేందుకు కూడా కృషి చేయాలని, దీనిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే సభ దృష్టికి తెచ్చారు.




# సైనిక సంక్షేమానికి అండగా 'యోగ' రామారావు

**– సైనిక సంక్షేమ నిధికి రూ. లక్ష విరాళం**



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** భరతమాత ముద్దుబిడ్డలైన దేశ రక్షకుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. యోగా గురువు, రామారావు ఉచిత గురుకుల సంస్థ (హైదరాబాద్) సహకారంతో 'సైనిక సంక్షేమ నిధి'కి ప్రకటించిన లక్ష రూపాయల చెక్కును శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో కలెక్టర్ చేతులు మీదగా జిల్లా సైనిక సంక్షేమ అధికారి శైలజ కి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అమరవీరుల కుటుంబాలకు, గాయపడిన సైనికుల పిల్లల ఉన్నత చదువులకు ఈ నిధి ఎంతో తోడ్పడుతుందన్నారు. రామారావు సేవలు స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు. సైనిక సంక్షేమ శాఖ సిబ్బంది బైరి మురళి పాల్గొన్నారు.

# భావనపాడు తీర ప్రాంతంలో

# దాహం కేకలు




**సంతబొమ్మాళి, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** మండలంలో భావనపాడు సముద్ర తీర ప్రాంతంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. భావనపాడు గ్రామంలో గొంతు తడుపుకునేందుకు అల్లాడుతున్నారు. సూర్యమణిపురం నుంచి రావాల్సిన సురక్షిత నీరు అందక మహిళలు ఇసుక దిబ్బల చెలమల వద్ద కిలోమీటర్ల దూరంలో బిందెలతో బారులు తీరుతున్నారు. వేసవికాలం మొదలవ్వకముందే తాగునీటికి కటకట మొదలయ్యింది. ఎన్నికల సమయంలో నాయకులంతా వచ్చి వాగ్దానాలు ఇవ్వడమే తప్ప పట్టించుకోవడంలేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. మంత్రి అచ్చెన్నాయుడు కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలలలో ఇంటింటికి కులాయి ద్వారా మంచినీరు అందిస్తామని వాగ్దానం చేశారే గాని కనీసం పట్టించుకోవడంలేదని సోషల్ మీడియా ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యమణిపురం నుంచి సరఫరా అవుతున్న మంచినీటి పైపులు మరమ్మతులకు గురి కావడంతో ఒకరోజు వస్తే పది రోజులు నీరు రావడంలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో గ్రామంలో తాగునీటి పంపిణీ అస్తవ్యస్తంగా మారిందని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో మంచినీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు మహిళలు కోరుతున్నారు.




## రోడ్డు పక్కన చెత్త వేయరాదు : ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్



**సీతంపేట మేజర్ న్యూస్ :** రోడ్డు పక్కన ఎటువంటి చెత్తను గానీ, ప్లాస్టిక్ వ్యర్థాలను గానీ వేయరాదని ఐటిడిఏ పీవో పవార్ స్వప్నిల్ అన్నారు. శుక్రవారం ఆయన సీతంపేట బాలుర గురుకుల పాఠశాలలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటిడిఏ కార్యాలయ పరిసరాల్లోనూ, పాఠశాల పరిసరాల్లోనూ ఎటువంటి ప్లాస్టిక్ వ్యర్థాలను వేయకూడదని అన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు ప్రతిరోజు అవగాహన కల్పించాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను బయట వేయడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని అన్నారు. మన పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని విద్యార్థులకు సూచించారు.

## రెవిన్యూ రికార్డుల ప్రక్షాళనతో రైతులకు భరోసా

### జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి

### జిల్లా యంత్రాంగం పనితీరుపై గ్రామ పెద్దల హర్షం - కలెక్టర్‌కు ఘన సన్మానం





**సీతానగరం, ఫిబ్రవరి 13 మేజర్ న్యూస్ :** రెవిన్యూ రికార్డుల ప్రక్షాళనతో రైతులకు భరోసా లభిస్తుందని, అందుకే భూ రికార్డుల క్షేత్రస్థాయి శుద్ధీకరణ అని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. భూ రికార్డుల ప్రక్షాళన ద్వారా భవిష్యత్తులో సివిల్ వివాదాలకు తావుండదని అన్నారు. ప్రతి రైతుకూ తన భూమిపై పూర్తి హక్కు కల్పించడమే దీని లక్ష్యమని పేర్కొన్నారు. శుక్రవారం సీతానగరం మండలంలోని గుచ్చిమి సచివాలయం వద్ద భూ రికార్డుల క్షేత్రస్థాయి శుద్ధీకరణ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్ లతో కలిసి కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ రికార్డులను నేరుగా గ్రామస్తుల సమక్షంలోనే అధికారులు ప్రదర్శించారు. భూముల సరిహద్దులు, యాజమాన్య హక్కులు మరియు రీసర్వే ద్వారా సవరించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులలో ఎటువంటి తప్పులు లేకుండా పక్కాగా రూపొందించడం పట్ల జిల్లా కలెక్టర్ అధికారులపై ప్రశంసలు కురిపించారు.ముఖ్యంగా క్షేత్రస్థాయిలో రీసర్వే డీటీలు, విలేజ్ సర్వేయర్లు మరియు వీఆర్ఓలు పడిన శ్రమను ఆయన అభినందించారు.

**కలెక్టర్ కు గ్రామస్తుల సన్మానం :** జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రీసర్వే ప్రక్రియను విజయవంతం చేయడం, తమ భూ సమస్యలను పరిష్కరించడం పట్ల గ్రామ పెద్దలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి గారిని, జేసీ మరియు సబ్ కలెక్టర్లను గ్రామస్తులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. గుచ్చిమి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్వచ్ఛత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని గ్రామస్తులను కోరారు. ప్రతి గ్రామం ముస్తాబు కావాలని, ఇందుకు గ్రామస్తులంతా ఒక మాటపై నడవాలని, మీ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని, అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటారని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు, విలేజ్ సర్వేయర్లు, వీఆర్ఓలు మరియు పెద్ద సంఖ్యలో రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## నాటు సారా విక్రయిస్తే కఠిన చర్యలు

### - సీతానగరం ఎక్సైజ్ సిఐ డి.పద్మావతి



**గరుగుబిల్లి, ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్ :** గ్రామాల్లో నాటు సారా తయారు చేయడంతో పాటు రవాణా చేయడం మరియు విక్రయించడం చట్టరీత్యా నేరమని సీతానగరం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి పద్మావతి అన్నారు. మండల పరిధి లోని కొత్తూరు గ్రామంలో నాటు సారా నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో సీతానగరం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి పద్మావతి మాట్లాడు తూ నాటు సారా సేవించడం వలన జరిగే అనర్థాలపై ప్రజలకు క్లుప్తంగా వివరించారు. ఈమేరకు గ్రామాల్లో నాట్ సారా తయారు చేయడం రవాణా చేయడం మరియు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈసందర్భంగా ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి.పద్మావతి హెచ్చరించారు. గ్రామాల్లో ఎక్కడైనా అనధికారికంగా నాటుసార, మద్యం విక్రయాలు చేపడితే సమాచారం అందించాలని ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి.పద్మావతి కోరారు.గ్రామాల్లో నాటు సారా మరియు మద్యం విక్రయాలు చేపడితే టోల్ ఫ్రీ నెంబర్ 14405 లేదా 9440902373 మొబైల్ నెంబర్‌కు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మహిళా సంఘాల సభ్యులు, ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## సింహాద్రి సనారీ విశ్వేశ్వర అన్నపూర్ణ మఠంలో మహా శివరాత్రి మహోత్సవాలు



**పాలకొండ, మేజర్ న్యూస్ :** స్థానిక కోమటిపేటలోని జగద్గురు సింహాద్రి సనారీ విశ్వేశ్వర అన్నపూర్ణామాంబ మఠంలో మహా శివరాత్రి మహోత్స వాలను అత్యంత వైభవంగా నిర్వహించేం దుకు సర్వం సిద్ధమైంది. ఈ ఆధ్యాత్మిక వేడుకలకు సంబంధించి మఠం కమిటీ ఆహ్వాన పత్రికను విడుదల చేసింది. ఫిబ్రవరి 15న (మహా శివరాత్రి పర్వదినం) తెల్లవారుజామున 3 గంటల నుండే స్వామివారికి పంచామృతాలతో విగ్రహారాధన, భక్తులచే విశేష అభిషేక కార్యక్రమాలు ప్రారంభ మవుతాయి. మధ్యాహ్నం 12 గంటలకు స్వామి వారికి మహానైవేద్యం సమర్పించి, అనంతరం 1 గంట నుండి ఆలయ అభివృద్ధి కమిటీ, పురజనులు మరియు భక్తుల సహకారంతో భారీ ఎత్తున మహా అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుండి అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. ఈ పూజల్లో పాల్గొనదలచిన భక్తులు ముందుగా మఠం కమిటీని సంప్రదించి టిక్కెట్లు తీసుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఉత్సవాల్లో భాగంగా అంతకుముందే, అనగా ఫిబ్రవరి 4వ తేదీ బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు సనారీ విశ్వేశ్వర స్వామి మాలాధారణ కార్యక్రమం వైభవంగా జరిగింది. శివరాత్రి పర్వదినం రోజున ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు రాజాంకు చెందిన బ్రహ్మశ్రీ బంగారుదుర్గాప్రసాదరావు ఆచారి గీతాపారాయణం చేస్తారు. అనంతరం 10 గంటల నుండి 12 గంటల వరకు ఆయుర్వేదరత్న బ్రహ్మ డాక్టర్ అందులూరి సోమేశ్వరరావు ఆచారి జగద్గురు సనారి విశ్వేశ్వర స్వాముల జీవిత చరిత్ర, మహిమల గురించి ఉపన్యసిస్తారు.

వీరు వీర బ్రహ్మం గారి జీవిత చరిత్ర, కాలజ్ఞానం మరియు సనారీ వారి జీవితచరిత్ర గ్రంథకర్తగా భక్తులకు విశేష ఆధ్యాత్మిక ప్రసంగం అందించనున్నారు. సాయంత్రం 6 గంటలకు స్వామి వారి తిరువీధి ఉత్సవం మంగళ వాయిద్యాలుతో అతివైభవంగా సాగుతుంది. రాత్రి 9 గంటల నుండి బి. మల్లేశ్వరరావు టీచర్ ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి, ఆర్కెస్ట్రా కార్యక్రమాలు భక్తులను అలరించనున్నాయి. ఈ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వేడుకల్లో భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని మఠం కమిటీ చైర్మన్ టేకి రామకృష్ణ అధ్యక్షులు టేకి ప్రసాదరావు ఉపాధ్యక్షులు రీసు రవి, సెక్రటరీ ఒమ్మి శంకర్రావు, కోశాధికారి మేటికోట ఉమామహేశ్వరరావు, సెక్రటరీ సుగంధం సంగీతరావు, జాయింట్ సెక్రెటరీ గోన్నాభక్తుల ప్రకాశరావు, ప్రధాన అర్చకులు దుర్గాప్రసాద్ పాడి కోరారు.

## రైతులు వ్యవసాయ రంగంలో సరికొత్త ప్రయోగాలు తెలుసుకోవాలి

### - వ్యవసాయ శాఖ అధికారి కొల్లి తిరుపతిరావు



**పాచిపెంట, ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్ :** వ్యవసాయ రంగంలో రైతులు ఎప్పటికప్పుడు సరికొత్త ప్రయోగాలను తెలుసుకొనే విధంగా ఉండాలని సూచించారు. మండలంలో పనుకువలస రైతు సేవా కేంద్రం పరిధిలో కోస్ట వలస గిరిజన గ్రామంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి కొల్లి తిరుపతిరావు మాట్లాడుతూ పంటలపై విషయ పరిజ్ఞానాన్ని మరియు ఆదాయం పెంపుపై అవగాహన కొరకు రైతుల కోసం 14 వారాలు పాటు పొలంబడి అను కార్యక్రమాలను చేపట్టడం జరుగు తుందని తెలిపారు. పలు గ్రామాలలో పొలంబడి కార్యక్రమాలను నిర్వహించడం వలన రైతులకు వ్యవసాయ రంగంపై అవగాహన కలుగుతుందని తెలిపారు. వేప కషాయం ద్రావణం, ఘనజీవామృతం వంటి కషాయాలను తయారు పై అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్రంలో అభ్యుదయ రైతు చేసిన ప్రయోగంపై వివరిస్తూ

**ప్రయోగం:** వరి నూకలు మరియు సోయా పొడర్ తో కలుపు నివారణ. ఒక ఎకరం మడికి వరి నాటిన మూడు రోజుల లోపు 25 కిలోల వరి నూకలు దానికి కొంత సోయాచిక్కుడు పిండి కలిపి చల్లుకుంటే కలుపు నివారణ జరగడమే కాకుండా పంట ఆరోగ్యంగా ఎదుగుతుందని తెలిపిన విషయాన్ని రైతు పాపారావు పొలంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ విధానంలో ఎరువులు కూడా వాడాల్సిన అవసరం ఉండదని తెలిపారని ఈ ప్రయోగం సఫలమైతే రైతుకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారి తెలిపారు. గతవారం నిర్వహించిన రైతుల పోటీలో ఘన జీవామృతం తయారీని చక్కగా వివరించిన మహిళా రైతు ఉర్లీ జన్ని లలిత కు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రమీల, క్లస్టర్ ఇంచార్జ్ విజయ్ పాల్గొన్నారు.

# రామస్వామి దేవస్థానం మాడ వీధులకు మోక్షం

### ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ఆదేశాలతో దేవాలయం చుట్టూ ఆక్రమణలు తొలగింపు – భక్తులు హర్షాధిరేకాలు





**నెల్లిమర్ల, ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోనే ప్రసిద్ధి పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి దేవస్థానంలో ఏడాది పొడువునా నిర్వహించే ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు హాజరవుతూ ఉంటారు. అయితే ఆలయ మాడ వీధులు ఇరుగ్గా ఉండడంతో శివరాత్రి, వైకుంఠ ఏకాదశి, శ్రీరామనవమి ఉత్సవాల సమయంలో భక్తులకు ఆటంకం కలగడంతో పాటు, దేవుడి పెళ్లి సమయంలో మూడు వాహనాల సేవకు ఆటంకం ఏర్పడేది. స్థానికులు ఆలయం చుట్టూ ఆక్రమణలు చేసి షాపులు ఏర్పాటు చేయడం వల్ల ఉత్సవాల సమయాలలో భక్తుల దర్శినానికి, విగ్రహాల ఊరేగింపునకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆదేశాలతో జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి, జిల్లా ఎస్పీ దామోదర్ చొరవతో ఎట్టకేలకు ఆలయం చుట్టూ ఉన్న ఆక్రమణ షాపులను తొలగించారు. ఈఓపీఆర్డీ శంకర్ జగన్నాథం, ఎస్ఐ బి.గణేష్ రెండు రోజులు నుంచి ఆలయం చుట్టూ ఉన్న షాపులను జెసిపి సాయంతో తొలగించారు. ఇటీవల శివరాత్రి ఉత్సవాల నిర్వహణపై దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, పంచాయతీ రాజ్, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, పోలీసు, ఎక్సైజ్, అగ్నిమాపక తదితర శాఖల అధికారులతో ఎమ్మెల్యే లోకం నాగ మాధవి సమీక్షా సమావేశం నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో సమస్యల పరిష్కారానికి సమీక్ష నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆలయం చుట్టూ ఉన్న షాపులపై సిఐ జి రామకృష్ణ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

మాడ వీధులలో షాపులు ఏర్పాటు వల్ల స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులకు అసౌకర్యం కలగడంతో పాటు, ఉత్సవాల సమయంలో విగ్రహాల ఊరేగింపునకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని సిఐ చెప్పారు. దీంతో ఎమ్మెల్యే ఆక్రమణలు తొలగింపునకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాజకీయ ఒత్తుడులకు లొంగకుండా అధికారులు ఆక్రమణలు తొలగించారు. దీంతో రామతీర్థం రామస్వామి దేవస్థానం మాడ వీధులకు మోక్షం లభించింది. ఏళ్ల తరబడి ఉన్న సమస్యను పరిష్కరించడంతో భక్తులు హర్షాధిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

## దివ్యాంగ పిల్లలకు పుస్తకాలు పంపిణీ



**రామభద్రపురం, ఫిబ్రవరి 13 (మేజర్ న్యూస్) :** మండలంలోని భవిత కేంద్రంలో శుక్రవారం దివ్యాంగ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. మూడడ్ల తిరుపతి, వాసవి దంపతుల క ఎమార్తె మేధశ్రీ పుట్టినరోజు సందర్భంగా 25 మంది దివ్యాంగ విద్యార్థులకు విలువైన విద్యా సామగ్రిని ఎంఈవో ఆమిటి తిరుమల ప్రసాద్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు సేవ చేయడం దేవుడుకి సేవ చేసినట్టేనని తెలిపారు. దివ్యాంగ విద్యార్థులకు ఈ సామగ్రి అందజేసిన తిరుపతి, వాసవీ దంపతులను ఆయన అభినందించారు. అలాగే ప్రభుత్వం కూడా ఉచిత విద్యా, ఉపకరణాలు, స్కాలర్షిప్లు, అలవెన్సులు, ఫిజియోథెరపీ వంటి కార్యక్రమాలు దివ్యాంగ విద్యార్థులకు కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పిలు చింతల రాజేశ్వరి, గండి తేజశ్విని, దివ్యాంగ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ముందుకెళ్లాలి

### ఎస్.కె.ఎ.డి.ఎం కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు






భోగాపురం, ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్ : ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని, క్రమశిక్షణతో కూడిన విద్య ప్రతి విద్యార్థికి అందిస్తున్నామని ఎస్.కె.ఏ.డి.ఎం కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం భోగాపురంలో ఆయా కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అధ్యక్షతన వహించిన ఈ కార్యక్రమానికి, విద్యావేత్త, స్థానిక ఉపాధ్యాయులు పడాల చంద్రశేఖరరావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణ, లక్ష్యసాధనతో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని తెలిపారు. కార్యక్రమానికి ముందుగా విద్యార్థులు స్వాగత గీతంతో అతిథులను ఆహ్వానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. గత సంవత్సరం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ముఖ్య అతిథి పడాల చంద్రశేఖర రావు చేతుల మీదుగా మెమెంటోలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమానికి పలువురు ఉపాధ్యాయ నాయకులు, విద్యావేత్తలు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది. విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామ కమిటీల డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

### – వైకాపా మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ



**భోగాపురం, ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్ :** వైఎస్సార్సీపీ కార్యకర్తలను పార్టీ కేంద్ర కార్యాలయంతో అనుసంధానం చేసే ప్రక్రి యలో భాగంగా చేపడుతున్న గ్రామ కమిటీల డిజిటలైజేషన్‌ను మండలంలో త్వరితగతిన పూర్తిచేయాలని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సూచించారు. ఈ సందర్భంగా బడ్డుకొండ మాట్లాడుతూ మండలంలోని 22 పంచాయతీల్లో ఈ కార్యక్రమం ప్రారంభించాలన్నారు. భవిష్యత్తు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు ఈ గ్రామ కమిటీ ద్వారానే ముందుకు వెళ్లాలని సూచించారు. ఉత్సాహంగా పనిచేసే వారిలో రాజారెడ్డి ముందుంటారని, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తే దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, నాయకులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సుందర హరీష్, కొల్లి రామ్మూర్తి, శీరపు గురునాథ్ రెడ్డి, దువ్వ అప్పన్న, దువ్వ రాంబాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఫ్రైడే డ్రై డేలో పారిశుధ్యంపై అప్రమత్తంగా ఉండాలి

### – మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ బండారు శ్రీనివాసరావు



**కొత్తవలస, ఫిబ్రవరి 13 మేజర్ న్యూస్ :** మండలంలో వియ్యంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లో గల రామలింగాపురం సచివాలయం లో వైద్యాధికారి డా"సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో "హెల్త్ సూపర్ వైజర్,ఎమ్. ఎల్.హెచ్.పి., ఏ. ఎన్. ఎమ్. హెల్త్ అసిస్టెంట్,ఆశ వర్కర్స్ ఆధ్వర్యంలో లో ఫ్రై డే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి శుక్రవారం గోలెలు, కుండీలు, ప్లాస్టిక్ డ్రమ్స్ కడిగి ఆరబెట్టాలని, ఇంటి పరిసరాలలో కొబ్బరి బొండాలు, టైర్లు, ప్లాస్టిక్ డబ్బాలు లేకుండా చూడాలని తెలిపారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా చూడాలని, మంచి నీటి లోనే దోమలు లార్వాలు వృద్ధి చెందుతాయని తెలిపారు. కిరాణా షాప్స్, టీ దుకాణాలు, మాంసం దుకాణాలు లో డస్ట్ బిన్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మంచి నీటి నీటి నిల్వల్లో దోమలు నివారణ మందు నీ పిచికారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, హెచ్. ఎస్. ఈశ్వరరావు,, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఎమ్ ఎల్. హెచ్. పి. గీతికా, ఏ ఎన్. ఎమ్. బేగం, ఆశ వర్కర్స్ జ్యోతి, రాములమ్మలు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



**విజయనగరం కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగర పాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయాల కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డియుసేవ అధ్యక్షుడు బూసాల శ్రీను కోరారు. ఈ మేరకు శుక్రవారం నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామిని యూనియన్ నాయకులతో కలిసి సమస్యలపై ప్రస్తావించారు. పని ఒత్తిడి వల్ల కార్యదర్శులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ఒక్క రోజు క్యాజువల్ లీవ్ మంజూరులో విధానపరమైన సడలింపులు కల్పించాలని కోరారు. కార్యభారం కారణంగా ఎగ్జిక్యూటివ్ అధికారి అందుబాటులో లేకపోతే సెక్రటరీలకు జారీ చేసే మెమోలను తదుపరి ఉన్నతాధికారులు పరిశీలించే విధానం ఉండాలని చెప్పారు. ఎస్. సెక్షన్ లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యలపై కమిషనర్ బాలస్వామి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో డియుసేవ ప్రధాన కార్యదర్శి శివ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బొబ్బిలి డిప్యూటీ ఎంపీడీవో అల్లు భాస్కర్ రావుకు ఎల్ కోట ఎంపిడిఓగా పదోన్నతి



**బొబ్బిలి, ఫిబ్రవరి 13: మేజర్ న్యూస్ :** బొబ్బిలి మండలంలో డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న అల్లు భాస్కర్ రావు కి పదోన్నతి పొంది, ఎల్. కోట (లక్కవరపుకోట) మండల ఎంపీడీవోగా నియామక ఉత్తర్వులు ను పదోన్నతి పొందారు.ఈ మేరకు విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, వైఎస్ఆర్ సీపీ జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) తమ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ, కొత్తగా బాధ్యతలు స్వీకరించనున్న భాస్కర్ రావు ఎల్. కోట మండల అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు.

# పిఆర్‌సి తక్షణమే ప్రకటించాలి : యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పతివాడ త్రినాధ్



**నెల్లిమర్ల, ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పిఆర్ సి కమిషనర్ ను నియమించి, 29 శాతం ఐఆర్ ప్రకటించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పతివాడ త్రినాథ్ డిమాండ్ చేశారు. నెల్లిమర్ల ఎమ్మార్సీ కార్యాలయం వద్ద శుక్రవారం పోస్టుకార్డు ఉద్యమం ప్రారంభించారు. త్రినాథ్ మాట్లాడుతూ 11వ పిఆర్ సి కాలం ముగిసి ఇప్పటికే రెండేళ్లు తొమ్మిది నెలల కాలం నష్టం జరిగిందన్నారు. ఎన్నికల హామీ మేరకు తక్షణమే పిఆర్ సి నియమించి ఈబడ్జెట్ లోనే అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. పిఆర్ సి ప్రకటించడంతో పాటు బకాయి ఉన్న డిఎలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెమో 57 ప్రకారం 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలు చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.30వేలు కోట్లకు పైగా పేరుకుపోయిన బకాయిలు చెల్లించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి పోస్ట్ కార్డులు పంపిస్తున్నట్లు తెలియజేశారు. ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యల పరిష్కారం కోరుతూ ఫిబ్రవరి 17న చలో విజయవాడ కార్యక్రమానికి యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు ఇచ్చిందన్నారు చలో విజయవాడ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు మద్దిల సత్యనారాయణ, కోశాధికారి సుంకర చలపతిరావు, నాయకులు పాల్గొని ముఖ్యమంత్రికి పంపించే పోస్ట్ కార్డును ఆవిష్కరించారు.

## ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి : యూటిఎఫ్ పోస్ట్ కార్డ్ ఉద్యమం

**బొబ్బిలి, ఫిబ్రవరి 13: మేజర్ న్యూస్ :** బొబ్బిలి యూటిఎఫ్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో 12 వ పిర్ సి కమిషన్ నియమించాలని,మధ్యంతర భృతి ప్రకటించాలని,సిపి స్ రద్దు చేయాలని, మెమో 57 అమలు చేయాలని, కరువు భత్యం చెల్లించాలని,పెన్షనర్సు బెనిఫిట్స్ విడుదల చేయాలని,బకాయి పడ్డ అన్నిరకాల నిధులు విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కి పోస్ట్ కార్డు లను స్థానిక స్వామి వారి వీధిలో గల పోస్టాఫీసు లో 55 మంది ఉపాధ్యాయుల యొక్క పోస్టు కార్డు లను పోస్ట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా యూటిఎఫ్ సీనియర్ నాయకులు విజయ గౌరి మాట్లాడుతూ పై సమస్యలు పై స్పందించాలని ,లేని పక్షంలో అనివార్యంగా ఈనెల 17 వ తేదీన ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలియచేసారు. మున్సిపల్ టీచర్ల జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ తేలు స్వామి నాయుడు సమస్యలు పరిష్కారానికి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు కదలాలని కోరారు. ఈ




కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు పి.సత్యన్నారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి పైడి శ్రీనివాస్, మహేష్, హేమ సుందర్, ఆదినారాయణ, రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రామ కమిటీలతో పార్టీ బలోపేతం : మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ



**భోగాపురం, ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్ :** వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని నెల్లిమర్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సూచించారు. పార్టీ గ్రామస్థాయి కమిటీల ఏర్పాటు కోసం మండలంలోని రాజపులోవ గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసేవారికి కమిటీల్లో చోటు కల్పిస్తున్నా మని చెప్పారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, మోసాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయిలో పార్టీని పటిష్టం చేసేందుకు కృషి చేయాలని కోరారు. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, సర్పంచ్ కిలారి స్వప్న ఎంపీటీసీ కిలారి వెంకటరమణ, నాయకులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సుందర హరీష్, కొల్లి రామ్మూర్తి, బైరెడ్డి ఎర్రప్పలనారాయణ, శీరపు గురునాథ్ రెడ్డి, పీబి.రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

# రైతుల సాగు భూములే మీకు కావాలా?

### – వందల ఏళ్ల అనుభవంలో ఉన్నవారిపై జులుం ప్రకటిస్తారా – పరిహారం ఇస్తే గాని భూములను వదిలిపెట్టం

**భోగాపురం, ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్ :** తూడెం పంచాయతీ బసవపాలెం రెవెన్యూలో రైతుల స్వాధీనంలో ఉన్న సుమారు 20 ఎకరాలకు పైగా భూమిని ఒక్కసారిగా ఖాళీ చేయమంటే ఎలా అంటూ సంబంధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్లనాటి తమ అనుభవంలో ఉన్న భూములకు పరిహారం అందజేయాలన్నారు. ఎవరూ లేని సమయంలో జెసిబి లు తీసుకొచ్చి పనులు చేపడితే ఊరుకునేది లేదంటూ వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం వ్యాపార దృక్పథంతోనే ప్రైవేట్ సంస్థలు పనిచేస్తున్నాయని, తాత తండ్రుల నుంచి వస్తున్న వారసత్వ భూములను అప్పనంగా తీసుకుందామంటే ఊరుకునేది లేదన్నారు. ఇంత జరుగుతున్న జిఎంఆర్ సంస్థకు చెందిన వారి ప్రతినిధులు జెసిబి లతో భూమిని చదును చేయడంపై వారంతా ఒక్కసారిగా మండిపడ్డారు. సుమారు వందమందికి పైగా రైతులు ఆయా ప్రాంతంలో అడ్డుకొని పరిహారం ఇస్తే తప్ప భూమిని ఖాళీ చేసేదే లేదంటూ మొండికేసి కూర్చున్నారు. అక్కడే టెంట్లు వేసి నిరసనలు తెలిపి బైటాయించారు. పరిస్థితిని తెలుసుకున్న పోలీసులు రంగంలో దిగి సంబంధిత రైతులను అడిగి విషయం తెలుసుకున్నారు. ఇక్కడ పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఇలా టెంట్లు వేసి నిరసనలు తెలపడం సరైన పద్ధతి కాదంటూ వారికి సూచించారు. స్థానిక నాయకులైన



ఎంపీటీసీ ప్రతినిధి కోరాడ తాతారావు, రీసు రమణ కొందరు రైతులు కలసి ఎస్సై పాపారావుకు గత పరిస్థితిని అంత వివరించి తక్షణమే మాకు న్యాయం చేసి భూమ్మీదకి వెళ్లాలంటూ తెలియజేశారు. గతంలో సుమారు 200 ఎకరాలకు పైగా రైతుల నుండి స్వాధీనం చేసుకున్న భూములకు ఇప్పటివరకు ఎలాంటి పరిహారం ఇవ్వలేదని, ఇప్పుడు కూడా మమ్మల్ని మోసం చేసేందుకే ఇలాంటి కుట్రలు పన్నుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై భవిష్యత్తులో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సిందే.

## కేంద్ర బడ్జెట్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు



**నెల్లిమర్ల, ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కె రేఖ అధ్యక్షతన 2026 –27 బడ్జెట్ పై ఆర్థిక శాస్త్ర శాఖా అధిపతి డాక్టర్. ఎం. రమణ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ ప్రొఫెసర్ బి. రామకృష్ణా రావు బడ్జెట్ పై ప్రసంగించారు. ఖరీదైన వాచీలు, ఆల్కహాల్, వీడియో గేమ్ యంత్ర తయారీ పరికరాలు, దిగుమతి చేసుకున్న గోదుములు, ఎటిఎం మిషన్ విడి భాగాలు కొన్ని రసాయనక పదార్థాలు, సిగరెట్ల ధరలు పెరిగాయన్నారు. సోలార్ గ్లాస్ తయారీ పరికరాలు, క్రీడారంగ పరికరాలు, లెదర్ ఉత్పత్తులు, విమాన విడిభాగాలు, విదేశీ విద్యపై వడ్డీ రేట్లు, క్యాన్సర్ సంబంధించి 17 రకాల ఔషధాల ధరలు తగ్గాయని వెల్లడించారు. కేటాయింపులో రాంజీ పథకానికి రూ.95 వేల కోట్లు కేటాయించారని, పెండింగ్ పనుల కోసం రూ.35వేల కోట్లు కేటాయించారని తెలిపారు. బడ్జెట్ కేటాయింపులు, ప్రాధాన్యత అంశాలు, జిడిపి వంటి విషయాలు మీద పూర్తిస్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ కె రేఖ మాట్లాడుతూ అనుభవజ్ఞ లైన ప్రొఫెసర్లతో మాట్లాడించడం వల్ల విద్యార్థుల్లో ఆసక్తి కలగడమే కాకుండా విజ్ఞానం, అవగాహన కలుగుతాయన్నారు. ఐక్యుఎసి కోఆర్డినేటర్ డాక్టర్ జయపాల్ రావు మాట్లాడుతూ రక్షణ, విద్య, వ్యవసాయ రంగాలకు బడ్జెట్ కేటాయింపులు సక్రమంగా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు ఆర్. ఉమామహేశ్వరరావు, పి.జయలక్ష్మి, బి.శుభ, ఏ.టి.ఎస్ నాయుడు, తదితర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పన్నుల వసూళ్లకు ప్రత్యేక కౌంటర్లు
## నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి



**విజయనగరం కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నులు వసూలు చెల్లించేందుకు నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని కమిషనర్ బి బాలస్వామి తెలిపారు. శని, ఆదివారాలు సెలవు దినాలు అయినప్పటికీ, కౌంటర్లను తెరిచి ఉంచుతామని చెప్పారు. అందువల్ల ప్రజలు తమ ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు, నీటి ఛార్జీలను ఆయా కౌంటర్ల వద్ద చెల్లించుకోవచ్చునని తెలిపారు. అలాగే ఆన్ లైన్ విధానంలో కూడా పన్నులు చెల్లించుకోవచ్చున్నారు.

## ఘనంగా శ్రీ సూక్త హోమం



**లక్క వరపు కోట, ఫిబ్రవరి 13 (మేజర్ న్యూస్) :** మండలం లోని ఎల్ కోట మేజర్ పంచాయతీ లో గల శ్రీ వీరభద్ర స్వామి ఆలయం లో 27వ శివ రాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్ర వారం ఏకాదశి పర్వదినంను పురస్కరించుకొని ఆలయ ప్రధాన అర్చకులు వేద పండితులు అక్కా జోస్యుల శ్రీ హరి శర్మ ఆలయం లో శ్రీ శరబన సమేత సంపత్ వినాయక స్వామి కి ప్రత్యేక అర్చన శ్రీ సూక్త హోమం( 108 మారేడు పలముల తో ) ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం లో భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా శ్రీ హరి శర్మ మాట్లాడుతూ మహా శివునికి ప్రీతి పాత్ర మైన మహా శివ రాత్రి సందర్భంగా నిర్వహిస్తున్న పూజలలో పాల్గొని అయన కృపకు పాత్రులు కావాలి అని అన్నారు శనివారం ద్వాదసి సందర్భంగా సుదర్శన హోమం నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు శివ రాత్రి రోజున ప్రత్యేక పూజలు హోమం ఆలయ ప్రాంగణం లో అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేసి నట్లు తెలిపారు.

## ప్రశాంతంగా బార్ కౌన్సిల్ పోలింగ్



**పాలకొండ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు శుక్ర వారం జరిగిన పోలింగ్ ప్రక్రియ, స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనంలో ప్రశాంతంగా జరిగింది. ఈ ఎన్నికలలో రాష్ట్ర బార్ అసోసియేషన్ అధ్యక్ష స్థానానికి సుమారు 145 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, ఈరోజు జరిగిన పోలింగ్ లో, ప్రధానంగా ఇద్దరు, ముగ్గురు అభ్యర్థుల మధ్యనే ప్రధాన పోటీ నడిచినట్లు తెలుస్తోంది. పాలకొండ బోరోసోసియేషన్ కి సంబంధించి మొత్తం 70 మంది సభ్యులు ఉండగా, వీరిలో కేవలం ముగ్గురు మినహా మిగిలిన 67 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీనితో 98% ఓటింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సీనియర్ న్యాయవాది ఎం.శామ్యూల్ ప్రకటించారు. ఈ ఎన్నికల పోలింగ్ కార్యక్రమంలో సహాయకులుగా మరో సీనియర్ న్యాయవాది యు. మురళీమోహనరావు వ్యవహరించారు. పోలింగ్ ముగిసిన అనంతరం సామ్యూల్ మాట్లాడుతూ ఓటింగ్లో పాల్గొన్న సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## ధన్యవాదములు సిఎం సార్




**పాలకొండ, మేజర్ న్యూస్ :** 108 అంబులెన్సు లో ఉద్యోగులుగా పనిచేస్తున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీసియన్ డ్రైవర్ లకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీనియర్స్ కి 2 వేలు, జూనియర్స్ కి 5 వేలు రూపాయలు పెంచుతూ నిధులు విడుదల చేయడం తో వారు ముఖ్యమంత్రి కి ధన్యవాదములు తెలిపారు. పెరిగిన జీతాలు ఈ నెల నుండే అమలులోకి వచ్చేలా చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 108 ఉద్యోగులు అందరూ ముఖ్యమంత్రి కి అలాగే 108 నిర్వహణ సంస్థ అయిన భవ్య కంపెనీ వారి కి కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ సందర్భంగా పాలకొండ 108 అంబులెన్సు లో పనిచేస్తున్న సిబ్బంది మాట్లాడుతూ మరింత మెరుగైన సేవలు ఆపదలో ఉన్న వారికీ అందిస్తూ ప్రభుత్వం కి అలాగే భవ్య కంపెనీ వారికీ మంచి పేరును తెస్తామని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో గిరి గణపతి, శ్రీనివాస్, మురళి, అనంత్ రావులు పాల్గొన్నారు.

### నిడిగల్లు, కృష్ణ రాయపురం రోడ్డుకు శంకుస్థాపన చేసిన టిడిపి నాయకులు



సీతానగరం ఫిబ్రవరి 13 మేజర్ న్యూస్ : పార్వతి పురం, శాసనసభ్యులు, నియోజకవర్గ బోనెల విజయ్ చంద్ర ఆదేశాలతో శుక్రవారం నిడగల్లు నుండి కృష్ణారాయిపురం వరకు, అలాగే చెల్లమనాయుడు వలస నుండి వెంకటాపురం బీటీ రోడ్లు నిర్మాణానికి తెలుగుదేశం నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల గ్రామస్తులు శాసనసభ్యులు విజయచంద్ర కి పెద్ద ఎత్తున ఆయనకి రుణపడి ఉంటామని ఆయనకి ధన్యవాదాలు తెలియపరిచారు.ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పెంట సత్యం నాయుడు , రౌతు వేణుగోపాల్ నాయుడు గ్రామ సర్పంచులు గుణుపూర్ అన్నమనాయుడు, గాజాపు శ్రీనివాసరావు, వాకాడ పారినాయుడు, వైస్ ఎంపీపీ తోడబండ సూర్యనారాయణ, సర్పంచ్ గోట్టాపుఅప్పారావు, సాల హరిగోపాలరావు అలాగే వివిధ గ్రామాల నుంచి ముఖ్య నాయకులందరూ హాజరవ్వడం జరిగింది.

# ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల విడుదలపై హర్షం

- మండల పరిషత్ అధ్యక్షులు ఉరిటి రామారావు
- వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధు,నాటక రంగ అకాడమీ డైరెక్టర్ అంబటి రాంబాబులు
- బలహీన వర్గాల విద్యార్థులకు ఎంతో ఉపశమనం..ఎంపీపీ రామారావు



**గరుగుబిల్లి ,ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో 1200 కోట్ల రూపాయలు మేర ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేసి విద్యార్థుల చదువుకు రాష్ట్ర ఐటీ మరియు విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ భరోసా కల్పించారని మండల పరి షత్ అధ్యక్షులు ఉరిటి రామారావుతో పాటు రాష్ట్ర కొప్పుల వెలమ సంక్షేమము మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధు సూదనరావు,రాష్ట్ర ప్రభుత్వ నాటక రంగ అకాడమీ డైరెక్టర్ అంబటి తవిటినాయుడు(రాంబాబు)లు కొనియాడారు. మండల పరిధిలోని ఖడ్గవలస జంక్షన్ లో శుక్రవారం మండల పరిషత్ అధ్యక్షులు ఉరిటి రామారావు,రాష్ట్ర కొప్పుల వెలమ సంక్షేమము మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధు సూదనరావు, రాష్ట్ర ప్రభుత్వ నాటక రంగ అకాడమీ డైరెక్టర్ అంబటి తవిటినాయుడు (రాంబా బు)లు స్థానిక విలేకరులతో మాట్లా డారు.కూటమి ప్రభుత్వం చెప్పింది చెప్పినట్టు చేస్తోందనడానికి ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడు దల నిదర్శనమన్నారు.1200 కోట్ల రూపాయల మేర ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ప్రభుత్వం విడు దల చేయడంతో పేద,బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు పెద్ద ఎత్తున ఉపశమనం కలిగిందన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయడంతో విద్యార్థుల భవిష్యత్తు కు భరోసా కలిగిందన్నారు.ఫీజ్ రీయింబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయడం పట్ల మండల పరిషత్తు అధ్యక్షులు ఉరిటి రామా రావు,రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొ రేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదన రావు, రాష్ట్ర ప్రభుత్వ నాటక రంగ అకాడమీ డైరెక్టర్ అంబటి రాంబాబులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.రాష్ట్ర అభి వృద్ధి లక్ష్యముగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పని చేయడం జరుగుతుందని ఎంపీపీ ఉరిటి రామారావు, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధు,రాష్ట్ర ప్రభుత్వ నాటక రంగ అకాడమీ డైరెక్టర్ అంబటి రాంబాబులు పేర్కొన్నారు.

## తాత్కాలిక ఏనుగుల సంరక్షణ కేంద్రం పనులు వేగవంతం కావాలి





**సీతానగరం, ఫిబ్రవరి 13 మేజర్ న్యూస్ :** జిల్లాలోని పార్వతీపురం రేంజ్, గుచ్చిమి రిజర్వ్ ఫారెస్ట్‌లో సుమారు రూ. 3 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న “తాత్కాలిక ఏనుగుల సంరక్షణ కేంద్రం” పనులను జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏనుగులు జనవాసాల్లోకి రాకుండా నిరోధించేందుకు అత్యాధునికమైన ఏనుగు నిరోధక కందకాలు, సోలార్ హ్యాంగింగ్ ఫెన్సింగ్,పట్టుబడిన ఏనుగుల కోసం ప్రత్యేకంగా ఎలిఫెంట్ షెడ్లు, క్రాళ్లు, వాటర్ టబ్‌లు, స్నానపు కొలనుల నిర్మాణ పనులను పర్యవేక్షించి, పలు సూచనలు చేశారు. గుచ్చిమి బీట్‌లోని కంపార్ట్‌మెంట్ నంబర్ 195 మరియు 196 పరిధిలో సుమారు 50 హెక్టార్ల విస్తీర్ణంలో దీన్ని నిర్మిస్తున్నట్లు డీఎఫ్ఓ కలెక్టరుకు వివరించారు. మావటిల కోసం ప్రత్యేక క్వార్టర్లు, కిచెన్ షెడ్ మరియు ఏనుగుల ఆరోగ్య సంరక్షణ కోసం అత్యాధునిక వెటర్నరీ కేర్ సెంటర్ (వైద్య కేంద్రం) ఇక్కడ అందుబాటులోకి రానుందన్నారు. అటవీ ప్రాంతం లోపలికి సులభంగా చేరుకోవడానికి పక్కా అప్రోచ్ రోడ్లను సిద్ధం చేస్తున్నట్లు ఆమె వివరించారు. తనిఖీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఒడిశా సరిహద్దుల నుండి వస్తున్న ఏనుగుల వల్ల జరుగుతున్న ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు ప్రభుత్వం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. గత పదేళ్లలో మానవ-వన్యప్రాణి సంఘర్షణల వల్ల 14 మంది ప్రాణాలు కోల్పోవడం, 9 ఏనుగులు మృతి చెందడం బాధాకరం అన్నారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే, సమస్య కలిగించే ఏనుగులను తాత్కాలికంగా ఇక్కడ ఉంచి, ఆపై సురక్షిత ప్రాంతాలకు తరలించడం సాధ్యమవుతుందని తెలిపారు. నాణ్యతతో కూడిన పనులను సకాలంలో పూర్తి చేయాలని అటవీ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్. వైశాలి, జిల్లా అటవీ శాఖ అధికారి జి.ఏ.పి.ప్రసూన, అటవీ క్షేత్ర అధికారులు మరియు ఇతర రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గిజబ శివాలయంలో ప్రారంభమైన పూజా కార్యక్రమాలు



**గరుగుబిల్లి, ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని గిజబ గ్రామంలోని శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వ దినం పురస్కరించుకుని శుక్రవారం నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉదయం విఘ్నేశ్వరపూజ,పుణ్యాహవాచనం, రక్షా సూత్రధారణ, అఖండ దీపా రాధన, యాగశాల ప్రవేశము, మండపారాధన తోపాటు మధ్యా హ్నం మూడు గంటలకు చండీ యాగం, మండపార్చనలు, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించా రు.అదే విధంగా శనివారం ఉదయం మండ పార్చనలు వల్లీ దేవ సేన సహిత సుబ్రమణ్య స్వామి కళ్యాణము, సూర్య నమస్కారాలు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు 1116 లింగాలతో సహస్ర లింగార్చన కార్యక్రమం జరుగుతుందని శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు కిషోర్ బాబు తెలిపారు. 15వ తేదీన మహాశివరాత్రి సందర్భముగా ఉదయం 9 గంట లకు మండపార్చనలు, హోమాలు అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు శివపార్వతుల కళ్యాణ మహోత్సవమును నిర్వ హించడం జరుగుతుందన్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భం గా వేకువ జామున మూడు గంటల నుండి స్వామివారికి అభిషేకములు ప్రారంభమవుతాయని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుందన్నారు.ఈ మేరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదము లు స్వీకరించాలని గ్రామ పంచా యతీ సర్పంచ్ మండల భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు మరడాన సింహాచలంనాయుడు, మరడాన కృష్ణమూర్తినాయుడు, మండల శంకర్రావులు కోరారు.

## ఎల్.కోటలో మశివాని పాలెం పాఠశాలను సందర్శించిన జిల్లా విద్యాశాఖ అధికారి



**లక్క వరపు కోట ఫిబ్రవరి 13 (మేజర్ న్యూస్)** మండలం లో శుక్రవారం జిల్లా విద్యాశాక అధికారి యు మాణిక్యం నాయుడు ఎల్ కోట మండలం లో శుక్రవారం పర్యటించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కోనమసివాని పాలెం సందర్శించి . పాఠశాలలో ని ప్రతి విద్యార్థి యొక్క నోట్ బుక్స్ ను, వర్క్ బుక్స్ ను పరిశీలించడం జరిగింది. విద్యార్థులు యొక్క చేతిరాత నైపుణ్యాలను పరిశీలించారు, విద్యార్థుల గణితంలో భాగంగా చతుర్విధ ప్రక్రియలను పరిశీలించారు. స్వయంగా ఆయన బోర్డుపై గుణకార భాగాహారాలను ఇచ్చి విద్యార్థులుచే చేయించారు. అనంతరం జిఎఫ్ఎల్‌ను పరిశీలించడం జరిగింది. పరిశీలించిన తరువాత 100% పర్సెంట్ జిఎఫ్ఎల్ఎన్ పాఠశాలగా ప్రకటించడం జరిగింది. అనంతరం పాఠశాల పరిసరాలను, మరుగుదొడ్లను , కిచెన్ గార్డెన్ , డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకమున పరిశీలించి పాఠశాల ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ అధికారులు ప్రశంసించారు. ఈ పాఠశాలలా మండలంలో ఉన్న అన్ని పాఠశాలలోఉపాధ్యాయులు పనిచేసి 100% జిఎఫ్ఎల్ ఎన్ పాఠశాలలుగా తయారు చేయాలని మండల విద్యాశాఖ అధికారులకు సూచించడం జరిగింది. డిఈఓతో పాటు ఏం ఈఓ శ్రీనివాస రావు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో సమస్యలు ప్రస్తావించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు మాజీ సైనిక సంక్షేమ సంఘం



**బొబ్బిలి, ఫిబ్రవరి 13: మేజర్ న్యూస్ :** బొబ్బిలి పట్టణంలోని శ్రీ ఉమా సాయి ఫిల్లింగ్ స్టేషన్ వద్ద శుక్రవారం వీర బొబ్బిలి మాజీ సైనిక సంక్షేమ సంఘ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆ సంఘ గౌరవ అధ్యక్షుడు మరడ అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మాజీ సైనికుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కే కే రంగారావు (బేబీ నాయన)కు సంఘ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశంలో మాజీ సైనికుల సమస్యలను ప్రస్తావిస్తూ, వారికి 4--5 సెంట్ల ఇంటి స్థలాలు మరియు సాగుభూమి కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరినందుకు అభినందనలు తెలియజేశారు. మాజీ సైనికుల సమస్యలను గతంలోనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు, ఆయన సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చినట్లు సభ్యులు పేర్కొన్నారు. ఆ హామీ మేరకు అసెంబ్లీలో ఈ అంశాన్ని ప్రస్తావించడంపై సంఘం ఆనందం వ్యక్తం చేసింది. దేశ రక్షణ కోసం సేవలందించిన మాజీ సైనికులకు ప్రభుత్వం తగిన గౌరవం ఇవ్వాలని, భూమి కేటాయింపు వంటి అంశాల్లో త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, పలువురు మాజీ సైనికులు పాల్గొన్నారు.

## వందరోజుల పని దినాలు పెరగాలి

**విజయనగరం (మేజర్ న్యూస్) :** ఉపాధి వేతనదారులకు 100 రోజుల పనిదినాలు ప్రతి కుటుంబానికి కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. 100 రోజుల పని కల్పనతో పాటు వేతనాలు కూడా అధికంగా అందేలా చూడాలని అన్నారు. శుక్రవారం కలెక్టర్ సంబంధిత అధికారులతో ఉపాధి పనులు, ఓ.డి.ఎఫ్, వాట్సాప్ సేవలు, మహాశివరాత్రి ఏర్పాట్ల పై టిసి ద్వారా సమీక్షించారు. మార్చి లోపల ఉపాధి లక్ష్యాలను చేరుకోవాలని, బిల్లులను వెంటనే అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఓ.డి.ఎఫ్ , ఓ.డి.ఎఫ్ ప్లస్ పనులను వేగవంతం చేయాలన్నారు. వాట్సాప్ సేవలు పెరగాలని, ఈ సర్వీసెస్ పై అవగాహన కలిగించాలని , ముఖ్య0గా తహశీల్దార్లు ముందుగా అవగాహన చేసుకొని, రెవిన్యూ సేవలను వాట్సాప్ ద్వారా అందించడానికి కృషి చేయాలని తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలో 10 దేవాలయాల వరకు ఎక్కువగా భక్తులు దర్శనాలకు వచ్చే అవకాశం ఉందని, ఆ దేవాలయాల్లో ఏర్పాట్లను పక్కాగా చేయాలని అన్నారు. తహశీల్దార్లు, పోలీస్, దేవాదాయ శాఖ వారు అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు.

## బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాల ఏర్పాటు కొరకు ఎమ్మెల్యే బేబినాయన అసెంబ్లీలో ప్రస్తావించాలి: ఏపి జేఏసి నాయకులు



**బొబ్బిలి, ఫిబ్రవరి 13: మేజర్ న్యూస్ :** బొబ్బిలి లో ప్రభుత్వ డిగ్రీ మరియు జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేసేలా ఎమ్మెల్యే బేబినాయన అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడాలని ఎపి జెఏసి నాయకులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పూల్ బాగ్ జంక్షన్ వద్ద నిర్వహించిన పత్రిక సమావేశంలో ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. సాయికిరణ్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి బొబ్బిలి పట్టణంలో ప్రభుత్వ జూనియర్ మరియు డిగ్రీ కళాశాల ఏర్పాటు కొరకు విద్యార్థి యువజన సంఘాలు ప్రజాసంఘాలు అలాగే పార్టీ నాయకులు ఎన్నో కార్యక్రమాలు చేశారు. దానికి స్పందించి గౌరవ బొబ్బిలి శాసనసభ్యులు బేబీ నాయన స్పందించి గౌరవ ముఖ్యమంత్రివర్యులకి అలాగే విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ కి కలిసి ఈ సమస్యని తెలియజేయడం జరిగింది. అయితే తెలియజేసి ఇప్పటికే ఐదు నెలలు పైగా కాలం గడిచింది ఇప్పుడు ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా మరొకసారి అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తారని గౌరవ ఎమ్మెల్యే గారి హయాంలోనే అడ్మిషన్లు ఓపెన్ జరిగేలా చూస్తారని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

# ముంజేరులో రైతన్నల నిరసన ఘోష

### – వెయ్యి మంది రైతులతో దద్దరిల్లిన నిరసన సెగ – భూములు ఇచ్చేది లేదంటూ రైతుల తీర్మానం





**భోగాపురం, ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్ :** మనభూమి మన హక్కు మన భూములు ఎవ్వరికి ఇచ్చేది లేదంటూ రైతుల ఆగ్రహ జ్వాలలు మిన్నంటాయి. ఇటీవల కాలంలో ఐటీ హబ్ పేరుతో అధికారులు పలువురు ప్రైవేటు సంస్థలు కలిసి భోగాపురంతో పాటు ముంజేరు నందిగాం తదితర ప్రాంతాలను పరిశీలించడంపై జిల్లా రాష్ట్రస్థాయి అధినేతల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లడం జరిగింది. అయినప్పటికీ ముంజేరు రైతులంతా కలిసి ఉద్యమ బాట పట్టేందుకు సిద్ధమయ్యారు. తాత తండ్రుల నుంచి వస్తున్న వారసత్వ సంపదను హరించేందుకు ప్రైవేటు సంస్థలు చేపడుతున్న కుట్రలో భాగమేనని మండిపడ్డారు. సంస్థలు వచ్చి ఉద్యోగాలు ఇవ్వడం లేదు సరి కదా అన్నదాత లేకపోతే ఆకలి మంటలతో చావులు వినబడతాయంటూ రైతన్నల కడుపు మంటతో వచ్చిన ప్రతి మాట సభా వేదికను దద్దరిల్లేలా చేసింది. కార్యక్రమానికి ఉత్తరాంధ్ర తెలగ సంఘం అధ్యక్షులు పివిఆర్ తో పాటు, ఎంపీటీసీ పిడుగు వెంకట సత్యం సర్పంచ్ నూకరాజు, మాజీ ఎంపీటీసీ పిడుగు రాంబాబు తదితర నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 28 లోపు పెన్షనర్లు లైఫ్ సర్టిఫికేట్ సమర్పించాలి



**విజయనగరం, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు (సర్వీస్ మరియు కుటుంబ పెన్షన్ దారులు) తమ పెన్షన్ నిరంతరాయంగా పొందేందుకు, నిర్ణీత గడువులోగా లైఫ్ సర్టిఫికేట్ (జీవన ప్రమాణ పత్రం) సమర్పించాలని విజయ నగరం జిల్లా ఖజానా అధికారి వి.నాగమహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. గడువు తేదీ ప్రకారం పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికేట్‌ను జనవరి 1, 2026 నుండి ఫిబ్రవరి 28, 2026 మధ్యలో మాత్రమే సమర్పిం చాల్సి ఉంటుందని తెలిపారు. జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా ఇంట్లోనే ఉండి డిజిటల్‌గా సమర్పిం చవచ్చునన్నారు. సమీపంలోని ఉప ఖజానా కార్యాలయాలు, లేదా జిల్లా ఖజానా కార్యాలయంలో స్వయంగా హాజరై సమర్పించవచ్చున న్నారు. లైఫ్ సర్టిఫికేట్లలపై జిల్లా గణాంకాలు గురించి ఆయన వివవరిస్తూ విజయనగరం జిల్లాకు సంబంధించి మొత్తం 14,852 మంది పెన్షనర్లకు గాను, ఇప్పటివరకు 12,382 మంది తమ వివరాలను నమోదు చేసుకున్నారన్నారు. బకాయి ఉన్నవారు ఇంకా 2,470 మంది పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికేట్‌ను సమర్పించాల్సి ఉందని తెలిపారు. పెన్షన్ దారుల సౌకర్యార్థం జిల్లాలోని అన్ని ఉప ఖజానా కార్యాలయాల్లో తగిన ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఇంకా సర్టిఫికేట్ సమర్పించని వారు ఫిబ్రవరి 28, 2026 లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని, లేనిపక్షంలో పెన్షన్ చెల్లింపుల్లో అంతరాయం కలిగే అవకాశం ఉందని జిల్లా ఖజానా అధికారి స్పష్టం చేశారు.

## పరీక్షలు ప్రశాంతంగా జరగడానికి అన్ని చర్యలు చేపడుతున్నాం : తాహల్దార్ ఆదిలక్ష్మి



**గుర్ల, ఫిబ్రవరి13 (మేజర్ న్యూస్)** విద్యార్థులు పరీక్షలు ప్రశాంతంగా రాయడానికి అన్ని భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తాహల్దార్ ఆదిలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం తెట్టంగి,గుర్ల జిల్లా పరిషత్ పాఠశాలలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 16వ తేదీ నుండి 10వ తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ముందస్తు చర్యలో భాగంగా పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించిన ధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నుద్దేశించి మాట్లాడిన ఆమె పరీక్షలకు భయపడకుండా ధైర్యంగా హాజరు కావాలని అన్నారు. పరీక్షలు రాసేటప్పుడు భయపడకుండా మనోధైర్యంతో ఉండాలని సూచించారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసే విధంగా చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. ఆమెతోపాటుగా ఎంపీడీవో. రవికుమార్ ఎస్ఐ.నారాయణరావు పాల్గొన్నారు.

# నేడు మరుపెంట తారు రహదారి పనులు ప్రారంభంకు శంకుస్థాపన

**- కోటి 60 లక్షల రూపాయలు నిధులు మంజూరు - శంకుస్థాపన చేయనున్న ఎంపీపీ ఉరిటి రామారావు తదితరులు**

**- మండల టిడిపి కన్వీనర్ మరడాన నారాయణస్వామి వెల్లడి**




**గరుగుబిల్లి, ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని మరుపెంట గ్రామము నుంచి సాంబన్న వలస గ్రామం వరకు తారు రోడ్డు రహదారి నిర్మాణం పనులు ప్రారం భానికి సంబంధించి కురుపాం నియోజకవర్గం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ఆదేశాలు మేరకు మండల పరిషత్తు అధ్యక్షులు ఉరిటి రామారావుతోపాటు మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ మరడాన నారాయణస్వామి తదితరులు శనివారం శంకుస్థాపన చేయనున్నారు. మరుపెంట గ్రామం నుంచి సాంబన్నవలస గ్రామం వరకు తారు రోడ్డుగా మార్పు చేసేం దుకు కురుపాం నియోజకవర్గం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు కోటి 60 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని మండల పరిషత్ అధ్యక్షులు ఉరిటి రామారావు తెలిపారు. మరుపెంట సాంబన్నవలస గ్రామ రహదారి పూర్తిస్థాయిలో మరమ్మతులకు గురవడంతో రహదారి మీదుగా ప్రయాణించే వాహన చోదకులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న విషయమును ఇటీ వల కురుపాం నియోజకవర్గం శాసన సభ్యులు మరియు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. ఈనేపథ్యంలో మరుపెంట సాంబన్న వలస గ్రామ రహదారిని తారు రోడ్డుగా మార్పు చేసేందుకు అవస రమైన నిధులు మంజూరు చేసి ఎప్పటినుండో ఉన్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానని కురుపాం నియోజక వర్గం శాసన సభ్యులు మరియు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ఇచ్చిన మాట ప్రకారం నిధులు మంజూరు చేయడం జరిగిందని ఎంపీపీ ఉరిటి రామారావు పేర్కొన్నారు. ఈమేరకు మరుపెంట గ్రామం నుంచి సాంబన్న వలస గ్రామం వరకు తారు రోడ్డుగా మార్పు చేసేందుకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు కోటి 60 లక్షల రూపాయలు మంజూరు అయ్యా యని మండల పరిషత్ అధ్యక్షులు ఉరిటి రామారావు చెప్పారు. రహదారి పనులు ప్రారంభానికి సంబంధించి శనివారం శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఉద్దవోలు గ్రామం నుంచి గరుగుబిల్లి గ్రామం వరకు తారు రోడ్డు నిర్మాణంకు నిధులు మంజూ రు కావడంతో ఈపనులు ప్రారంభా నికి సంబంధించి శంకుస్థాపన చేయనున్నారు. లఖనాపురం గ్రామం నుండి గదబవలస గ్రామం వరకు తారు రోడ్డు రహదారి నిర్మాణం నిమిత్తం నిధులు మంజూరు కావ డంతో ఈపనులు ప్రారంభానికి శంకుస్థాపన చేయనున్నారు. రహ దారుల శంకుస్థాపన కార్యక్రమంకు టీడీపీ నాయకులు మర్రాపు పురుషోత్తమునాయుడు, మరడాన తవిటినాయుడు, రాష్ట్ర రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావు, రాష్ట్ర ప్రభుత్వ నాటక రంగ అకాడమీ డైరెక్టర్ అంబటి తవిటినాయుడు (రాంబాబు), అరకు పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి ద్వారపు రెడ్డి సత్యనారాయణ (సత్తిబాబు), రావివలస ఎంపీటీసీ సభ్యులు కోట భరత్ కుమార్, ముదిలిబాబు విజయవాంకుసం తదితరులు హాజరుకానున్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరంకు ఏర్పాట్లు పూర్తి

**- లయన్స్ క్లబ్ అధ్యక్షులు చింతల చలపతిరావు - లయన్స్ క్లబ్ ట్రెజరర్ పెంటపాటి సాయికిరణ్, బడే గౌరునాయుడు**



పార్వతీపురం/గరుగుబిల్లి ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్:పార్వతీపురం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆవరణ లో నిర్వహించనున్న ఉచిత మెగా వైద్య శిబిరము ఏర్పాట్లపై లయన్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ చింతల చలపతిరావు,లైన్స్ క్లబ్ ట్రెజరర్ పెంటపాటి సాయికిరణ్, బడే గౌరునాయుడు,ఆకుల శ్రీనివాస రావు,నల్ల మధుసూదన రావు శుక్రవారం పరిశీలించారు. ఈమేరకు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆవరణ లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వ హణకు సంబంధించి వివరాలు తెలియజేశారు. ఉచిత మెగా వైద్య శిబిరమును శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించడం జరుగు తుందన్నారు. నిష్ణాతులైన వైద్యులచే ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరమును నిర్వహించనున్నామని పేర్కొన్నా రు. వైద్య శిబిరం లో ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ యాళ్ల వివేక్, స్త్రీ ప్రసూతి వైద్యులు డాక్టర్ యాళ్ల వెంకట పద్మజ, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ భోగి ఈశ్వరరావు, డాక్టర్ గుంట్రెడ్డి వాసుదేవరావులు, డాక్టర్ పి బి పి ఆర్ నాయుడు (నాని), నల్లా దుర్గా ప్రసాద్, డాక్టర్ ఎన్ ఎం కె తిరుమలప్రసాద్ లు తనిఖీలు నిర్వహించడం జరుగు తుందన్నారు. అదే విధంగా డాక్టర్ కె శ్రీరేఖ, డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు, డాక్టర్ పిజె నాయుడు, డాక్టర్ పి వసంత్ కుమార్, డాక్టర్ జి. భాను ప్రసాద్, డాక్టర్ డి. శకుంతల, డాక్టర్ గొల్లు శ్రావణ్ కుమార్, డాక్టర్ కున్ మున్ సాహు, డాక్టర్ జి స్నిగ్ధ, డాక్టర్ జ్యోత్స్న లాల్, డాక్టర్ బి సతీష్, డాక్టర్ బి గౌరీశంకర్ లు తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈమేరకు పార్వతిపురం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తు న్న ఉచిత మెగా వైద్య శిబిరమును సద్వినియోగం చేసుకోవాలని సభ్యులు నల్ల మధుసూదనరావు కోరారు.

# ప్రోటోకాల్‌ను విస్మరించి సర్పంచును అవమానపరిచారు



పూసపాటిరేగ, ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్: రహదారి అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో సర్పంచ్ కొయ్య సన్యాసమ్మ ను అవమానపరిచే విధంగా ప్రోటోకాల్ ను మిస్మరించారంటూ మాజీ సర్పంచ్ కొయ్య ఎల్లన్నరెడ్డితో పాటు వైకాపా నాయకులు శ్రావణ్, రామస్వామి మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న ఎంపీడీవో రాధికాకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిధులైన ఉపాధి హామీ పథకం గ్రాండ్ ద్వారా చౌడువాడ, లంకలపల్లిపాలెం పంచాయతీలకు అనుసంధాన రోడ్డు తెదేపా నాయకులు శంకుస్థాపన కార్యక్రమానికి పిలిచి తన పంచాయతీ అయినా చౌడువాడకు సర్పంచ్ అయిన సన్యాసమ్మకు ఎటువంటి ఆహ్వాన పత్రం ఇవ్వకుండా, శంకుస్థాపనకు పిలవకుండా అగౌరవ పరిచారంటూ ఎంపీడీవో రాధికాకు ఇచ్చిన ఫిర్యాదులో పంచాయతీకి చెందిన నాయకులు అసహనం వ్యక్తం చేశారు. కనీసం చౌడువాడ సచివాలయం కు చెందిన పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి గాని, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాంబాబు గాని లక్షలాది రూపాయల రోడ్డు శంకుస్థాపనకు పిలవకపోవడం వలన సర్పంచ్ పదవికే దిగజార్చినట్లు అయిందంటూ నాయకులు ఎంపీడీవో వద్ద తన ఆవేదనను వ్యక్తం చేశారు.

ప్రోటోకాల్ ను విస్మరించిన అధికార సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలంటూ ఈ సందర్భంగా ఎంపీడీవోను నాయకులు కోరారు. దీనితో ఎంపీడీవో రాధిక స్పందిస్తూ రహదారి శంకుస్థాపనకు సర్పంచ్ సన్యాసమ్మను ఆహ్వానించకపోవడం అన్యాయమైన అని దీనిపై పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానంటూ హామీ ఇవ్వడంతో ఫిర్యాదు చేసిన నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## శ్రీశివపార్వతుల కల్యాణ మహోత్సవంకు ఏర్పాట్లు




**గరుగుబిల్లి, ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని బురద వెంకటాపురం గ్రామంలోని శ్రీజగదీ శ్వరస్వామి ఆలయంలో ఈనెల 15వ తేదీన మహాశివరాత్రి పర్వ దినం సందర్భంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవమును ఘనం గా నిర్వహించేందుకు ఆలయ ధర్మ కర్తలు బొత్స సత్యమునాయుడు మరియు అన్నదమ్ములు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈమేరకు ఉదయం అభిషేకములు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అనంతరం శ్రీజగదీశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వీరఘట్టముకు చెందిన ప్రముఖ యజ్ఞ యాగ కర్త ఎస్ వి ఎల్ ఎన్ శర్మయాజీ సంపూర్ణ పర్యవేక్షణలో శ్రీశివపార్వతుల కల్యాణం మహోత్సవంను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని బొత్స చక్రధర్, బొత్స జగదీష్ లు తెలి పారు. మహాశివరాత్రి సందర్భంగా నిర్వహిస్తున్న శివపార్వతుల కళ్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాద ములు స్వీకరించాలని బొత్స చక్రధర్, బొత్స జగదీష్ లు కోరారు. కళ్యాణ మహోత్సవం సందర్భంగా మధ్యాహ్నం భారీ ఎత్తున అన్న ప్రసాద వితరణ కార్యక్రమమును నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదమును స్వీకరిం చాలని పేర్కొన్నారు. మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా ఆలయ ప్రాంగణంలో రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందని బొత్స చక్రధర్, బొత్స జగదీష్‌లు తెలిపారు.

## ప్రతి ఉద్యోగి పొదుపు చేయాలి



**నెల్లిమర్ల, ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్ :** ప్రతి ఉద్యోగి పొదుపు చేయడం అలవర్చుకోవాలని ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్-1 అమర్దీప్ మిశ్రా కోరారు. శుక్రవారం టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పొదుపును ఇతర రంగాలలో పెట్టుబడి పెట్టేదానికంటే ప్రావిడెంట్ ఫండ్‌లో పొదుపును పెంచు కుంటే దీనికి భద్రత ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ మొత్తాన్ని ప్రభుత్వం భద్రత ఉన్నటువంటి రంగాలలోనే పెట్టుబడి పెడుతుందని అందు వల్ల ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. ప్రతి ఒక్కరూ యూఏఎన్ నెంబర్ను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఉద్యోగం లో చేరే సమయంలో యూఏఎన్ నెంబర్ ఉంటే ఆ నెంబర్‌ని కొనసాగించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమాన్ని డీన్ జె. అనిల్ కుమార్ నిర్వహించారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్‌కు శాలువను కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, అధ్యాపకులు, కాంట్రాక్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం విశ్వవిద్యాలయంలో ఉన్న వివిధ ల్యాబ్ లను ఆయన పరిశీలించి సిబ్బందిని అభినందించారు.

## దివ్యాంగులకు నిత్యవసర సరుకుల పంపిణీ



**భోగాపురం, ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్ :** నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే లోకం నాగ మాధవి జన్మదిన వేడుకల్లో భాగంగా ఆదివారం 15వ తేదీన దివ్యాంగులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేపట్టనున్నామని జనసేన మండల పార్టీ అధ్యక్షులు వందనాల రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పార్టీ కార్యాలయ ఆవరణలోనే రక్తదాన శిబిరం చేపట్టనున్నామన్నారు. పేదవారికి ఆపదలో ఉన్నవారికి సేవ చేయాలని ఆలోచనతోనే ఇలాంటి మంచి కార్యక్రమాలు చేసేందుకు ప్రతి జన సైనికుడు ముందుకు రావాలని కోరారు.

## అధికారుల ఏకపక్ష నిర్ణయాలు సరికాదు



**శృంగవరపుకోట, ఫిబ్రవరి 13 మేజర్‌న్యూస్:**దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన పుణ్యగిరి క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణ విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై స్థానిక ప్రజాప్రతినిధులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎంపీపీ సోమేశ్వరరావు, ఏపీ టూరిజం డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి, సర్పంచ్ గనివాడ సంతోషి సంయుక్తంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి ఏటా లక్షలాది మంది భక్తులు తరలివచ్చే పుణ్యగిరి ఉత్సవాలను పార్టీలకతీతంగా, అందరినీ సమన్వయం చేసుకుంటూ జరపడం ఆనవాయితీ అని కానీ ఈసారి అధికారులు ప్రజాప్రతినిధులను సంప్రదించకుండా అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఇటీవల తహసీల్దార్ ఆధ్వర్యంలో జరిగిన కమిటీ మీటింగ్‌కు కనీస సమాచారం ఇవ్వకపోవడంపై మండిపడ్డారు. ఎండోమెంట్ శాఖ, రెవెన్యూ అధికారులు ప్రోటోకాల్ పాటించకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నేతలు వెంకట్రావు, గోవింద్, సుంకర బుల్లి తదితరులు పాల్గొన్నారు.

## శివరాత్రి ఏర్పాట్లపై డిపిఓ పరిశీలన



**శృంగవరపుకోట, ఫిబ్రవరి 13 మేజర్‌న్యూస్:** మహాశివరాత్రి సందర్భముగా పుణ్యగిరికి వచ్చే యాత్రికులకు స్థానిక పంచాయితీ ద్వారా చేపట్టిన సౌకర్యాలను శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్ల పరిశీలించి తగు సూచనలు చేశారు. మరియు స్త్రీలు, పురుషులు లకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు పరిశీలించి మహాశివరాత్రి సందర్భంగా పుణ్యగిరి కి వచ్చే యాత్రికులకు అసౌకర్యం కలగకుండా చూడాలని స్థానిక పంచాయతీ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ కు ఆదేశించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సతీష్, శానిటేషన్ మేస్త్రి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పుణ్యగిరి కి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

**శృంగవరపు కోట, ఫిబ్రవరి 13 మేజర్‌న్యూస్:**మహాశివరాత్రి సందర్భంగా స్థానిక ఆర్టీసీ డిపో నుంచి పుణ్యగిరి జాతర సందర్భంగా ఈ నెల 15 వ తేది ఆదివారం ఉదయం నుండి 16 వ తేదీ సోమవారం సాయంత్రం వరకు ఎస్. కోట బస్టేషన్ నుండి పుణ్యగిరికి మరియు సన్యాసయ్యపాలెం లో వెలసిన సన్యాసయ్య గుడి కి యాత్రికుల కొఱకు ప్రత్యేక బస్సులు నడుపుచున్నట్లు డిపో మేనేజర్ కె. సుదర్శనరావు తెలిపారు. పుణ్యగిరి కి 15 బస్సులు మరియు సన్యాసయ్యపాలెం నకు 3 బస్సులు మొత్తం 18 బస్సులు నడుపుతామని తెలిపారు. ప్రయాణీకు ల రద్దీ ని బట్టి బస్సులు పెంచుత్తమన్నారు. పట్టణంలోని దేవి కూడలి వద్ద, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద, సన్యాసయ్య పాలెం లోను యాత్రికుల సౌకర్యార్థం సమాచారం కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.



# అంతర్జాతీయ మానవతా చట్టంపై గీతంలో జాతీయ సదస్సు




**విశాఖ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 13 మేజర్‌న్యూస్:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మానవతా చట్టంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా సాయుధ సంఘర్షణల కారణంగా ఏర్పడుతున్న మానవతా సవాళ్లపై ప్రముఖ న్యాయ నిపుణులు, అధ్యాపకులు, పరిశోధకులు ఈ సదస్సులో చర్చించారు. సదస్సులో ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి ఇన్‌చార్జ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆర్.వెంకటరావు, ధర్మశాస్త్ర నేషనల్ లా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మనోజ్ కుమార్ సిన్హా, ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ న్యాయ కళాశాల విశ్రాంత ప్రొఫెసర్ ఎస్.సుమిత్ర, గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎరోల్‌డిసౌజా, గీతం న్యాయ కళాశాల డీన్ ప్రొఫెసర్ ఎ.రాజేంద్రప్రసాద్, డైరక్టర్ డాక్టర్ మౌమిత సేన్ చక్రవర్తి పాల్గొని ప్రసంగించారు. రష్యా-ఉక్రేన్ యుద్ధం మరియు గాజాలో కొనసాగుతున్న సంఘర్షణలను ప్రస్తావిస్తూ, మానవతా చట్టాల ఉల్లంఘనలు తీవ్రంగా చోటుచేసుకుంటున్నాయని అవి చట్ట అమలులో లోపాలను బహిర్గతం చేస్తున్నాయని నిపుణులు పేర్కొన్నారు. సాయుధ ఘర్షణలు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర మానవతా సంక్షోబాలకు దారితీస్తూ లక్షలాది నిరపరాదులైన పౌరుల జీవితాలను ప్రభావితం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సదస్సులో ఇంటర్నేషనల్ హ్యూమానిటేరియన్ లా (ఐహెచఎల్) సాయుధ ఘర్షణల సమయంలో మానవతా చర్యలకు అవసరమైన చట్టపరమైన రూపకల్పనను అందిస్తుందని శాంతి సాధనకు ఇది ఒక వంతెనగా పనిచేయగలదని పేర్కొన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల చట్టం మరియు అంతర్జాతీయ మానవతా చట్టం పరస్పరం అనుబంధమైనవని, వ్యక్తుల జీవితం, సంక్షేమం మరియు సమగ్రతను భిన్న కోణాల్లో రక్షించడమే వాటి లక్ష్యమని వివరించారు. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటి సాయుధ ఘర్షణలు జరిగినప్పుడు మానవతా సూత్రాలను కాపాడడానికి, బాదితులను రక్షించడానికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. జెనీవా ఒప్పందాలకు ప్రపంచ వ్యాప్తంగా ఆమోదం ఉన్నప్పటికీ, చట్టబద్ధ బాధ్యతలు మరియు వాస్తవ అమలులో ఉన్న అంతరం పెరుగుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మానవతా చట్టం (ఐహెచఎల్)ను దేశాలు గౌరవిస్తే యుద్ధ నేరాలు నివారించవచ్చునని తద్వారా యుద్ధానంతర న్యాయం, బాధితులకు రక్షణ సాధ్యపడుతుందని నిపుణులు అభిప్రాయ పడ్డారు. కార్యక్రమంలో విద్యార్థులు, పరిశోధకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## గీతం కెమిస్ట్రీ రీసెర్చి కాన్ఫరెన్స్ లో నూతన పదార్థాలపై శాస్త్రవేత్తల చర్చలు



**విశాఖ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** రసాయన శాస్త్రవేత్తలు పరిశోధించే పదార్థ విజ్ఞానం వ్యవసాయ, వైద్య, శక్తి ఉత్పాదక రంగాలలో ఎలాంటి విప్లవాత్మక మార్పులు తీసుకురాగలదో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న "గీతం కెమిస్ట్రీ రీసెర్చి కాన్ఫరెన్స్ (జిసిఆర్‌సి-2026)లో శుక్రవారం ప్రముఖ శాస్త్రవేత్తలు వెల్లడించారు. రసాయన శాస్త్రం ఇతర శాస్త్రాలకు మార్గదర్శకంగా మారుతున్న తీరు ఈ సదస్సులో స్పష్టమైంది. సదస్సులో నానో క్రిమి సంహారకాలు అనే అంశంపై గీతం రసాయన శాస్త్ర విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎన్.వి.ఎస్.వేణుగోపాల్ ప్రసంగిస్తూ ఆధునిక వ్యవసాయంలో పురుగుమందులు అనివార్యమైనప్పటికీ, వాటి అధిక వినియోగం వల్ల పర్యావరణ కాలుష్యం, జీవుల్లో విషపూరితం, పురుగుల్లో నిరోధక శక్తి పెరగడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. రసాయన శాస్త్రంలో నానో సాంకేతికత ఆధారంగా అభివృద్ధి చేసిన నానో పురుగుమందులు లక్ష్యిత పంపిణీ ద్వారా తక్కువ పరిమాణంలోనే ఎక్కువ ఫలితాలను ఇస్తాయని, పర్యావరణ నష్టాన్ని తగ్గిస్తాయని వివరించారు. మూత్ర సంబంధమైన వ్యాధుల పరీక్షకు తక్కువ వ్యయం కాగల సాంకేతికతను అభివృద్ధి చేసినట్లు ఎసఆరఎమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన డాక్టర్ ప్రదీప్ దాస్ వెల్లడించారు. మూత్ర మార్గ ఇన్ఫెక్షన్లు (యుటిఐ) వేగంగా గుర్తించడంలో ప్రస్తుత పరీక్షా విధానంలో ఉన్న పరిమితులను వివరిస్తూ రసాయన శాస్త్రం ఆధారంగా తక్కువ ఖర్చుతో ల్యాబ్ సౌకర్యాలు లేకుండానే ఉపయోగించగల పేపర్ ఆధారిత ఆప్టికల్ సెన్సార్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా త్వరితగతిన, ఖచ్చితంగా వ్యాధి నిర్ధారణ సాధ్యమవుతుందని, సరైన చికిత్స అందించడంతో యాంటీబయోటిక్ నిరోధకతను తగ్గించవచ్చునని పేర్కొన్నారు. నొప్పి లేకుండా రోగులకు చికిత్స అందించే 2-డి నానో పదార్థాలపై జరుగుతున్న అధ్యయనాలను ఐఐటి జోద్‌పూర్‌కు చెందిన డాక్టర్ రవిరాజ్ వంకాయల వివరించారు. కాంతికి స్పందించే 2-డి నానో పదార్థాలు (ఎమఓఎఫ్స్ బోరోఫీన్, బ్లాక్ ఫాస్పరస్, మిక్సన్స్) ఆధారంగా అభివృద్ధి చేస్తున్న సాంకేతికతలు నిర్దిష్టంగా, నొప్పిలేకుండా, రోగికి అనుకూలంగా చికిత్స అందించే అవకాశాలను తెరుస్తున్నాయని తెలిపారు. భవిష్యత్తు వైద్య రంగంలో ఇవి కీలక పాత్ర పోషించనున్నాయని వివరించారు. సౌరశక్తితో దీర్ఘకాలం పనిచేసే బ్యాటరీల తయారీపై సిఎసఐఆర్-ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (హైదరాబాద్)లో జరుగుతున్న పరిశోధనలను డాక్టర్ లింగమల్లు గిరిబాబు తెలియజేశారు. అధిక సామర్థ్యంతో పనిచేసే డై-సెన్సిటైజ్డ్ సోలార్ సెల్స్ అభివృద్ధికి పోర్ఫిరిన్ ఆధారిత పదార్థాల రూపకల్పనపై తమ పరిశోధనలను వివరించారు. సౌరశక్తి వినియోగంలో ఇవి కొత్త అవకాశాలను తెరుస్తాయని తెలిపారు. అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన భతిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ చంద్రభాస్ నారాయణ డిస్కవరింగ్ న్యూ టాపోలోజికల్ మెటీరియల్స్ అండర్ ప్రొసీజర్ అంశంపై ప్రసంగించారు. టొపాలజికల్ ఇన్సులేటర్లు వంటి నూతన పదార్థాలు స్పిన్‌ట్‌రానిక్స్, థర్మోఎలక్ట్రిక్ పరికరాలు వంటి రంగాల్లో విస్తృ?తత ప్రయోజనాలు కలిగిస్తాయని చెప్పారు. అధిక పీడన పరిస్థితుల్లో ఎక్స్‌రే డిఫ్‌రాక్షన్, రామన్ స్పెక్ట్రోస్కోపీ, సైద్ధాంతిక అనుకరణల సమ్మేళనంతో కొత్త టోపాలజికల్ పదార్థాలను గుర్తించినట్లు వివరించారు. మొత్తంగా ఈ సదస్సు వ్యవసాయం, వైద్యం, పునర్వినియోగ శక్తి ఆధునిక ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో రసాయన శాస్త్రం ఆధారిత పరిశోధనలు సమాజానికి ఎంతో ఉపయోగకరమో స్పష్టం చేసింది. విద్యార్థులు, పరిశోధకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విలువైన అవగాహన పొందారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్‌లు డాక్టర్ అనిక్ సేన్ మరియు డాక్టర్ ఎం.సురేష్, యువ పరిశోధకులు మరియు విద్యార్థుల, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# అంధురాలికి సౌండ్ బాక్సు వితరణ

**విశాఖపట్నం, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** పేదరికం, ఆపై కొడుకు అనారోగ్యంతో బాధపడుతున్న నగరానికి చెందిన అంధురాలు శిరీషా సహాయం కోసం చారిటీ బాక్సును ఆశ్రయించింది. స్ట్రీట్ ఆర్కెస్ట్రాకు వెళ్తున్న ఆమె సౌండ్ బాక్సు ఇప్పించమని వేడుకుంది. ఆమె అడిగిన ఆ సౌండ్ బాక్సును చారిటీ బాక్సు ప్రతినిధి మహమ్మద్ ఆజంఖాన్ చేతుల మీదుగా శు క్రవారం అందజేశారు. రూ.16,500 విలువైన ఈ సౌండ్ బాక్సుకు చారిటీ బాక్సు సభ్యులు తమవంతుగా సహకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఎదురుదెబ్బలు తగిలినా ముందుకు సాగాలన్న ఆ సంకల్పం గొప్పదన్నారు. భర్త నిరాదరణకు గురైనా కొడుకు కోసం అహర్నిశలు శ్రమిస్తుందన్నారు. ఆ పిల్లాడు గుండె అనారోగ్యంతో సతమతం అవుతున్నాడన్నారు. ఈ సౌండ్ బాక్సు ఆమెను ఆర్థికంగా స్థిరపరుస్తుందన్నారు. చారిటీ బాక్సు ద్వారా గత ఐదేళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. అభాగ్యులకు అండగా నిలవడమే చారిటీ బాక్సు లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో లక్కోజు నూకరాజు పాల్గొన్నారు.



## నీలకంటేశ్వర దేవాలయం లో శివరాత్రి ఏర్పాట్లు



**కొత్తూరు, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** కొత్తూరు మండలం మెట్టూరు బిట్ వన్ పంచాయితీ లో మహాశివరాత్రి సందర్భంగా శ్రీ ఉమా నీలకంటేశ్వర స్వామి దేవాలయం లో ఆలయ ధర్మ కర్త బూర్లే శ్రీనివాస రావు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రాంగాణం అంతా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సుమారు మూడు వేల యస్ యఫ్ టి లో టైల్స్ పనులు చురుగ్గా సాగుతున్నాయి . ఈ పనులు తుది దశకు చేరుకొన్నాయి.అదపాకాల శేషగిరి ఆధ్వర్యంలో విశాఖ వాస్తవ్యులు త్రిపురాణ రాంబాబు సునీత దంపతులు ఆలయ అభివృద్ధికి లక్ష రూపాయలు విరాళం గా అందజేశారు.హరహర మహాదేవునికి శివరాత్రి పర్వదినాన దర్శించుకోడానికి పలు గ్రామాలనుండి వచ్చే భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. విధ్యుత్ కాంతులతో అలంకరణ చేశారు.

## పెండింగ్ పనులకు శ్రీకారం



**రణస్థలం, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** రణస్థలం మండలం కోస్ట పంచాయతీలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం నిర్వహించామని టి.డి.పి. సీనియర్ నాయకులు పిసిని జగన్నాథం నాయుడు గారు తెలిపారు. పంచాయతీ పరిధిలోని నాలుగు గ్రామాల్లో నిలిచిపోయిన రోడ్ల నిర్మాణాలు, మరమ్మతు పనులను పూర్తి చేయడానికి చర్యలు ప్రారంభించామన్నారు. గ్రామ పెద్దల సమక్షంలో పనులను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి కోస్ట పంచాయతీని అభివృద్ధిలో ముందంజలో నిలపడానికి పనులు చేపడుతున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పిసిని అసిరినాయుడు, ఎక్స్ ఎంపీటీసీ పైడి అప్పడు దొర , యువ నాయకుడు పిసిని హరికృష్ణ, జనసేన నాయకులు పిసిని. చిన్న, కోటి పిసిని, చిన్నంనాయుడు, పి పాపి నాయుడు. జనతా గ్యారేజ్ బ్రదర్స్ లక్ష్మణరావు, పిసిని సూరిబాబు, పిసిని అప్పలనాయుడు, దువ్వన సంతు,పిసిని అప్పారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

## విజయ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న కింజరాపు హరివరప్రసాద్



**కోటబొమ్మాళి, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** మండలంలోని చిన్నబమ్మిడి పంచాయతీ సుబ్బారావు పేటగ్రామంలో శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ విజయ వెంకటేశ్వర స్వామి దేవాలయం 24వ వార్షికోత్సవం సందర్భంగా కోటబొమ్మాళి పి ఎ సి ఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్ ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. ఆయనతో పాటు సౌడాం సర్పంచ్ పట్ట సింహాచలం, చిన్న బమ్మిడి సర్పంచ్ చల్ల శ్రీను, మండల ముఖ్య నాయుకులు పాల్గున్నారు.

## విజయనగరం జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా ఇంచార్జి గా పసుపులేటి సురేష్ సింగ్



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆదేశాలు మేరకు రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షులు గోపి శ్రీనివాస్ ఆంధ్ర ప్రదేశ్ లో బీజేపీ రాష్ట్ర ఓబిసి నూతన కమిటీలో, జిల్లా ఇంచార్జి లు ప్రకటించారు. ఈ కమిటీలో శ్రీకాకుళానికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు పసుపులేటి సురేష్ బాబు సింగ్ రాష్ట్ర బిజెపి అధిష్టానం సముచిత గౌరవం కల్పించింది. ఆయనను బీజేపి ఓబీసీ మోర్చా విజయనగరం జిల్లా ఇంచార్జి గా నియమిస్తూ, బీజేపీ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షులు గోపి శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈయన భారతీయ జనతా పార్టీలో ఒక సాధారణ కార్యకర్తగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి,మొదట శ్రీకాకుళం పట్టణ కార్యదర్శిగా, తర్వాత పట్టణ ఉపాధ్యక్షులుగా, శ్రీకాకుళం జిల్లా బిజెపి సోషల్ మీడియా కన్వీనర్ గా, తరువాత బిజెపి రాష్ట్ర ధార్మిక విభాగానికి రాష్ట్ర కార్యదర్శిగా, తరువాత శ్రీకాకుళం జిల్లా బిజెపి ఉపాధ్యక్షులుగా, ప్రస్తుతం రాష్ట్ర బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కోకన్వీనర్ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కరోనా టైంలో శ్రీకాకుళం జిల్లా కరోనా వాక్సన్ డ్రైవ్ ఇన్చార్జిగా చాలా ధైర్యంగా విస్తృతంగా శ్రీకాకుళం జిల్లాలో ఉన్న అనేక హాస్పిటల్స్ కరోనాతో బాధపడుతున్న పేషెంట్స్ ను మనో ధైర్యం చెబుతూ జిల్లాలో ప్రజలందరికీ కరోనా వ్యాక్సిన్ గురించి అవగాహన కలిగిస్తూ చాలా సమర్ధవంతంగా పనిచేసే సారు. అదేవిధంగా జిల్లాలో బిజెపి జరిపే అనేక కార్యక్రమాలకు ఇన్చార్జిలుగా వ్యవహరిస్తూ చక్కటి పనితీరును కనబరుస్తూ అటు జిల్లా నాయకులు, రాష్ట్ర బిజెపి నాయకుల ఆదరాభిమానాలు పొందారు. సురేష్ సింగ్ పనితీరును గమనించిన రాష్ట్ర నాయకత్వం అయన ను ఓబీసీ విజయనగరం జిల్లా ఇంచార్జి గా( రాష్ట్ర పదాధికారిగా ) నియమిస్తూ ఆదేశాలు ఇవ్వడం ద్వారా కష్టపడి బాధ్యతగా పనిచేసే వారికి పార్టీలో ఎప్పుడు గౌరవం న్యాయం జరుగుతుందని రుజువు అయింది. ఈ సందర్భంగా పత్రికా వేలేకరులు తో అయన మాట్లడుతూ రాష్ట్ర బీజేపీ పార్టీ నా మీద పెట్టుకున్నా నమ్మకాన్ని మమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని మరియు,. తనకు అప్పగించిన ఈ బాధ్యతలను అంకితభావంతో నెరవేర్చి బీజేపీ ఓబీసీ విభాగాన్ని బలోపేతం చేస్తాను అన్నారు, తనకు మరొకసారి రాష్ట్ర ఓబిసి కమిటీలో విజయనగరం జిల్లా ఇంచార్జి గా నియమించినందుకు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ , రాష్ట్ర ఓబిసి మోర్చా అధ్యక్షులు రంగోల గోపి శ్రీనివాస్ , బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాల్ , రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవి బాబ్జి, శ్రీమతి సవ్వనా ఉమా మహేశ్వరీ ,మాజీ జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వర రావు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సిరిపురం తెజేశ్వర రావు మరియు శ్రీకాకుళం జిల్లా బీజేపి నాయకులు కు, పేరు పేరున ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేసారు.

## విశ్రాంతి కొరకు బెంచీలు ఏర్పాటు



**మెలియాపుట్టి, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** మెలియాపుట్టి మండల కేంద్రం లో టిడిపి నాయకుడు ఎరుసు శ్రీనివాసరెడ్డి తన స్వంత నిధులతో గ్రామంలో ప్రజలు విశ్రాంతి తీసుకునేందుకు అవసరమైన సిమెంట్ బెంచీలు శుక్రవారం ఏర్పాటు చేశారు. మెలియాపుట్టి అమ్మవారి గుడి దగ్గర, రెడ్డి బజార్ ,పోలీస్ స్టేషన్ దగ్గర ,మహేంద్ర తనయ నది తదితర వీధులలో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదేశాలు మేరకు తన తల్లిదండ్రులు ఎరుసు అప్పారావు, అమ్మయమ్మ జ్ఞాపకార్థం ఈ సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. ఇవి ఏర్పాటు చేసినందుకు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఆయనతోపాటు మాడుగులు బానోజీ రావు, చిన్న బాబు,దున్న పండరి,ఆనంద్, దుక్క జోగారావు,తదితరులు ఉన్నారు.

## అక్రమ నిర్మాణం పై ఫిర్యాదు



**సంతబొమ్మాళి, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** మండలం నౌపడ పంచాయతీ సీతానగరం గ్రామంలో అక్రమ నిర్మాణం పై జిల్లా కలెక్టర్కు గ్రామానికి చెందిన బచ్చల. తాతారావు , ఢిల్లీమ్మ ఫిర్యాదు చేశారు. పూర్వం నుంచి రాకపోకలు సాగించే స్థలంను గ్రామానికి చెందిన బచ్చల బ్రహ్మానందం కబ్జా చేశారు. అంతటితో ఆగకుండా ఆక్రమించిన స్థలంలో దౌర్జన్యంగా పునాదులు వేశారు. ఎటువంటి డాక్యుమెంట్లు లేకపోయినా రాకపోకలు సాగించే దారిలో పునాదులు ఎందుకు వేసావని ప్రశ్నించిన మాపై దాడి చేశారని తెలిపారు. దీనిపై నౌపడ పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. గ్రామ పెద్దలు చెప్పిన ఆక్రమదారుడు బ్రహ్మానందం పట్టించుకోవడంలేదని అన్నారు. రాకపోకలు సాగించడానికి చాలా ఇబ్బందులు పడుతున్నామని, దీంతో జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశామన్నారు. బుధవారం పునాదులు తొలగించడానికి ప్రయత్నించిన తిరిగి మాపై మరోసారి దాడి చేశారని అన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాన్ని తొలగించి దారిని చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## తూర్పు కాపు సంక్షేమ సంఘ కార్యవర్గ సమావేశం..



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** శ్రీకాకుళం జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘం కార్యాలయంలో శుక్రవారం జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది, ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ తూర్పుకాపు సంక్షేమ సంఘం శ్రీకాకుళం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా నియమిస్తూ నియామక పత్రాన్ని విడుదల చేస్తున్న సందర్భంగా మీడియాతో మాట్లాడుతున్న అలిండియా తూర్పుకాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు పిసిని చంద్రమోహన్,జాతీయ గౌరవఅధ్యక్షులు పతివాడ గిరీశ్వరరావు, ఝాంఖూూ ఉద్యోగవిభాగరాష్ట్ర అధ్యక్షులు బలగ మల్లేశ్వరరావు,రాష్ట్ర కార్యదర్శి మచ్చ బుచ్చిబాబులు, తూర్పుకాపు సంక్షేమ సంఘం శ్రీకాకుళం జిల్లా నూతన కమిటీని ప్రకటించారు,శ్రీకాకుళం జిల్లా కార్యవర్గం జిల్లా అధ్యక్షులుగా కొబగాపు గౌతమ్,జిల్లా గౌరవఅధ్యక్షులు ముంజెటి పాపారావు, జిల్లా సహధ్యక్షులుగా రెడ్డి వాసుదేవరావు, జిల్లా కోఆర్డినేటర్ గా యాబాజీ చంద్రశేఖర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లుగా 1,రౌతు చిరంజీవిరావు, 2,గుమ్మడి శాంతారావు, 3,రౌతు జగన్నాధరావు, జిల్లా ఉపాధ్యక్షులుగా 1,కలమట సుప్రియ రమేష్, 2,కిల్లారి గోవిందరావు, 3,రౌతు నారాయణరావు, జిల్లా ప్రధానకార్యదర్శిలుగా 1,శైలాడ అన్నయ్యనాయుడు, 2,వంగపల్లి లక్ష్మినారాయణ, 3,లోలుగు సింహాచలం, జిల్లా కార్యదర్శిలుగా 1,మీసాల రామారావు, 2,సింగుపురపు రవికుమార్, 3,గార బాబూరావు, జిల్లా సంయుక్తకార్యదర్శిలుగా 1,గోకర్ల సునీల్, 2,లుకలాపు సతీష్, 3,కరణం నాగరాజు, జిల్లా కోశాధికారిగా తులగాపు ధనుంజయరావు లను నియమిస్తూ నియామక పత్రాన్ని విడుదల చేశారు, ఈ నేపథ్యంలో ఝాంఖూూ జాతీయ అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ మాట్లాడుతూ తూర్పుకాపుజాతి అభ్యుదయము కోసం రాజకీయపార్టీలకు అతీతంగా పని చెయ్యాలని నూతన జిల్లా కమిటీకి సూచించారు, సంఘం పిలుపునందుకొని ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పేర్కొన్నారు.

## ఆల్ ఇండియా యూనివర్శిటి క్రాస్ కంట్రి పురుషుల జట్టు ఎంపిక



**విశాఖఎడ్యుకేషన్, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** ఆంధ్రవిశ్వవిద్యాలయం పురుషుల క్రాస్ కంట్రీ జట్టు ఎంపిక జరిగింది. ఈసందర్భంగా ఏయు డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్. విజయమోహన్ క్రీడాకారులను అభినందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పురుషుల క్రాస్ కంట్రి పోటీలు రొహతక్ మహారుషి ధ్యాన్ వండ్ యూనివర్శిటి లో ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటి క్రాస్ కంట్రీ పోటీలు ఈనెల 15 న జరుగుతుందన్నారు. క్రాస్ కంట్రీ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ సాదించి వర్సిటికి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ వ్యాయామ విద్యా విభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి, అరకు గవర్నమెంట్ డిగ్రీ కళాశాల పీడీ ఎస్. అప్పారావు, ఏ వి ఎన్ కాలేజీ పి డి డాక్టర్ గోపి కృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

## నేటి నుండి మహాశివరాత్రి మహోత్సవాలు



**ఎండాడ, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** మహాశివరాత్రి పురస్కరించుకుని ఎండాడలో మూడు రోజులు పాటు నిర్వహించనున్న 90వ త్రిమూర్తి శివ జయంతి మహాశివరాత్రి మహోత్సవాలు శనివారం నుండి ప్రారంభం కానున్నట్లు ప్రజాపిత బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయం ప్రతినిధి బి.కె. రామేశ్వరి తెలిపారు. శుక్రవారం ఆమె ఏర్పాట్లు పర్యవేక్షించారు. గత 20 సంవత్సరాలుగా ప్రతి శివరాత్రి నాడు మహోత్సవాలు ఇక్కడ అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని అన్నారు. ఈ మూడు రోజులు కార్యక్రమాల్లో భాగంగా ఉదయం 7 గం.ల నుండి 9 గం.ల వరకు శివలింగం, లక్ష్మీనారాయణ ఊరేగింపు, శాంతియాత్ర, సాయంత్రం 5 గం.ల నుండి 7 గం.ల వరకు రుద్రాభిషేకం, సహస్ర లింగ దర్శనం, అభిషేకం సాంస్కృతిక కార్యక్రమాలు, మహాశివరాత్రి ఆధ్యాత్మిక రహస్యం వంటి అంశాలపై ప్రవచనాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మణిభూషణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ నరేంద్రకు అల్లూరి జాతీయ సేవా పురస్కారం




**ఆనందపురం, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** పేద,బడుగు వర్గాల ప్రజలకు వైద్య సేవలందించడంతో పాటు,గ్రామీణ వైద్యులకు సేవలందిస్తున్న విశాఖపట్నం యన్ఏడికి చెందిన ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం విశాఖపట్నం జిల్లా గౌరవ అధ్యక్షుడు గొర్లె నరేంద్రకుమార్ కు అల్లూరి సీతారామరాజు జాతీయ సేవా పురస్కారం లభించింది.ఈ మేరకు యన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెంకు చెందిన మధర్ సర్వీస్ సొసైటి పేద ప్రజలకు ఉచిత వైద్య సదుపాయాలు అందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం, మలేరియా,కుష్టు,ఎయిడ్స్ వ్యాధుల నివారణకు ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు కృషి చేస్తున్నందుకు అల్లూరి సీతారామరాజు జాతీయ సేవా పురస్కారానికి ఎంపిక చేశారు.

## సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం

### - ముఖ్యఅతిథిగా ముగడ రాజారావు



**ఆరిలోవ, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** జీవీఎంసీ, 11వ వార్డు ఆరిలోవ బాలాజీ నగర్ వద్ద శ్రీ సంపత్ వినాయక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సమేత అయ్యప్ప స్వామి దేవాలయం 22వ వార్షికోత్సవం సందర్భంగా ధర్మకర్త చింతలపాటి ఆదినారాయణ రాజు ఆహ్వానం మేరకు ఏపీ ఎం.ఎస్.ఎం.ఇ డైరెక్టర్ ముగడ రాజారావు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ అర్చకులు అనంతశర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. స్వామి ఆశీస్సులు ప్రజలపై ఉండి అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని డైరెక్టర్ ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మదుపాడ సన్యాసిరావు ,తెలుగుదేశం పార్టీ నాయకులు ముదిండి కృష్ణంరాజు, మూడి అప్పారావు, పేపర్ నాయుడు, బోయి శ్రీను, కొల్లి ఎర్రాజీరావు, అదపాక వెంకటరమణ, లక్ష్మణ్ రెడ్డి, గోవిందు భక్తులు పాల్గొన్నారు.

## కేజిహెచ్ విశాఖలో థలసేమియా బాధిత చిన్నారుల కోసం డీకెఎంఎస్ ఫౌండేషన్ ఉచిత హెచ్ఎల్ఏ పరీక్షల శిబిరం

### - ఆంధ్రప్రదేశ్‌లోని 55కి పైగా కుటుంబాలు ఉచిత పరీక్షలకు నమోదు - నిపుణులైన వైద్యుల నుంచి ప్రత్యేక వైద్య సలహాలు





**విశాఖపట్నం, ఫిబ్రవరి 12, మేజర్‌న్యూస్:** డీకెఎంఎస్ ఫౌండేషన్ ఇండియా, చెన్నైలోని ఎంజీఎం క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ మరియు సప్త ఫౌండేషన్ సంయుక్తంగా విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ జనరల్ హాస్పిటల్ (కేజిహెచ్) లో థలసేమియా మరియు సికిల్ సెల్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించింది. ఈ శిబిరానికి విశాఖపట్నం, విజయనగరం, పాడేరు, శ్రీకాకుళం, పార్వతీపురం ప్రాంతాల నుంచి 55కి పైగా కుటుంబాలు హాజరయ్యాయి. రోగులు మరియు వారి కుటుంబ సభ్యుల నుంచి చెంప స్వాబ్ ద్వారా 200కు పైగా నమూనాలను సేకరించి ఉచిత హై-రిజల్యూషన్ హెచ్ఎల్ఏ టైపింగ్ పరీక్షలు నిర్వహించారు. అదనంగా, నిపుణ వైద్యుల ద్వారా భవిష్యత్ చికిత్స మార్గాలపై సలహాలు అందించారు.

## సమస్యలు లేని ప్రశాంతంగా వున్న మహారాణిపేట వసతి గృహం చీఫ్ వాల్డెన్‌ను మార్చాల్సిన అంతర్యం ఏమిటో ?

### - 2021 లో సేవింగ్ రూ 2.కోట్ల 68 లక్షలు అకౌంట్ ఇచ్చిన నాటి చీఫ్ వార్డెన్ - ప్రెసెంట్ 6. కోట్ల 36 లక్షల 86 వేలు సేవింగ్స్..

**విశాఖ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** ఆంధ్రవిశ్వవిద్యాలయం మహారాణి పేట మహిళా వసతి గృహం చీఫ్ వార్డెన్ ను ఏయూ వీసీ ఆగమేఘాలమీద మార్పుచేసారు. ఎటువంటి సమస్యలు లేక పోయినప్పటికి ప్రశాంతంగా నడుస్తున్న వసతిగృహం అయినప్పటికీ ఈ వసతి గృహం చీఫ్ వార్డెన్ ఆచార్య ఎ. పల్లవి మార్పుకు కారణం ఏమిటో నని హాస్టల్ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వసతి గృహం గురించి వివరాల్లోకి వెలితే మహారాణిపేట చీఫ్ వార్డెన్ గా ఆచార్య ఎ. పల్లవి 2021 అక్టోబర్ లో గత వీసీ చీఫ్ వార్డెన్ గా నియమించారు. అప్పటి వరకు చేసిన చీఫ్ వార్డెన్ ఆచార్య పల్లవికి సేవింగ్ బ్యాంక్ అకౌంట్ 2 కోట్ల 68 లక్షలు రూపాయలు అప్పజెప్పారు. చీఫ్ వార్డెన్ ఆచార్య పల్లవి జాయినింగ్ తేదీకి విద్యార్థులు 73 లక్షల రూపాయలు డ్యూస్ విద్యార్థులు చెల్లించాల్సి ఉంది. 28 లక్షలు డ్యూస్ విద్యార్థులు నుంచి కలెక్ట్ చేయగా వర్సిటి నుంచి ఇంకా డ్యూస్ చెల్లించ కుండా 45 లక్షల రూపాయలు వున్నాయి. 2021 నుంచి విద్యార్థులు ఎటువంటి డ్యూస్ లేకుండా వసూలు చేసారు. కాక ప్రస్తుతం బ్యాంక్ బాలెన్స్ ఫిబ్రవరి 2026 నాటికి 6 కోట్ల 36 లక్షల 86 వేల రూపాయలు హాస్టల్ బ్యాంక్ సేవింగ్ అకౌంట్ లో ఉంది. ఈ వసతి గృహం నుంచి గతంలో ఉన్న యూనివర్శిటి అధికార్లు 2021 లో ఉన్న చీఫ్ వార్డెన్ ద్వారా 86 లక్షలు రూపాయలు యూనివర్శిటి కి తీసుకున్నారు. మరలా యూనివర్శిటీ అధికార్లు సెవింగ్స్ లో నిధులు కావాలని అడిగినా ఆచార్య పల్లవి ఇవ్వలేని సందర్భాలు ఉన్నాయి. ఈ సెవింగ్స్ కేవలం విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఒక బ్లాక్ నిర్మాణం చేయాలని అధికార్లు కు ఆమె తెలియజేయడం తో ఈ నిధులు జోలికి ఏయూ అధికార్లు రాలేదని సమాచారం. 2021- 22 లో హాస్టల్ అభివృద్ధి కి ఆచార్య పల్లవి శ్రీకారం చుట్టారు. వీటిలో భాగంగా గతంలో 1300 మంది విద్యార్థులుకు సరిపడా వసతి గృహం లేనందు మరో బ్లాక్ ఏర్పాటుకు ఏయూ అధికార్లుకు ప్రతిపాదనలు చేసేరు. ఇ ప్రతి పాదనలు ఏ యూ అదకారులు సమ్మతి తెలిపి ఎల్ బి బ్లాక్ ఏయూ ఇంజనీరింగ్ అదికార్లు చేసారు. ఈ బ్లాక్ నిర్మాణానికి కోటి రూపాయలు కాంట్రాక్ట్ ద్వారా ఇంజనీరింగ్ అధికార్లు నిర్మాణం చేసారు. ఈ బ్లాక్ 300 మంది పిల్లలుకు సరిపడా ఏర్పాటు చేసారు. అలాగే డైనింగ్ హాల్, రిన్నోవేషన్, వాస్ రూం లు సరిపడా ఏర్పాటు, వాటర్ ప్లాంట్ నిర్మాణం, విద్యార్థులు వ్యాయామం చేసేందుకు జిమ్ కూడా ఏర్పాటు చేసారు. ఇదిలా ఉండగా । విద్యాతరంగణి వసతి గృహం కు పూర్తి స్థాయిలో అభివృద్ధికి చేసినప్పటికి వర్సిటీ అధికార్లు సెల్ఫ్ సపోర్ట్ వసతి గృహంగా తీర్చిదిద్దారు. అలాగ్ ప్రగతి వసతి గృహం కూడా ఇదే తరహాలో ఏర్పాటు చేసారు. ప్రస్తుతం మహారాణి పేట లేడీస్ హాస్టల్, నాగార్జున వసతి గృహంలో 1450 మంది పిల్లలు ఉంటున్నారు. 5 బ్లాక్ లలో ప్రస్తుతం మహారాణి పేట లేడీస్ హాస్టల్, నాగార్జున వసతి గృహం. వుంది. అదనంగా సెల్ఫ్ సపోర్ట్ తో వసతి గృహంలో కూడా విద్యార్థులు ఉన్నారు. ఈవిద్యార్థులు కు లైబ్రరీ సదుపాయం కల్పించేందుకు సాయంత్రం బస్సు ఏర్పాటు కు ఏయూ ఉన్నత అధికార్లు సహకారంతో ప్రొఫెసర్ పల్లవి ఏర్పాటు చేసారు. అలాగే విద్యార్థులకు తరచూ హెల్త్ క్యాంపు లు ఏర్పాటు చేసి వైద్య సదుపాయం కల్పిస్తున్నారు. ఇప్పటివరకు ఎటువంటి సమస్యలులేకుండా అడ్మినిస్ట్రేషన్ చేస్తున్న ఆచార్య పల్లవి ని చీఫ్ వార్డెన్ తీసి వేసి గతంలో పరిశోధక హాస్టల్ చీఫ్ వార్డెన్ గా బాధ్యతలు కూడా సక్రమంగా నిర్వహించ లేని ఆమెను తీసుకు రావడం ఎంత వరకు సమంజమని విద్యార్థులు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం సెంటనరీ సెలబ్రేషన్స్ నడుస్తున్న సమయంలో సమస్యలు ఉన్న హాస్టల్స్ ను జోలికి పోకుండా సమస్యలు లేని మంచి అడ్మినిష్ట్రషన్ ఉన్న వసతి గృహం చీఫ్ వార్డెన్ మార్చడం ఎంతవరకు సమంజసమని విద్యార్థులు వైస్ చాన్సలర్స్ వారిని వినతి చేస్తున్నారు. ఏ యూ వైస్ ఛాన్సలర్ ని సమస్య ల లోకి నెట్ట దానికి ఈ మార్పు లా ఉందని కొంత మంది భావిస్తున్నారు. ఈ విషయంపై ఏయూ మహారాణిపేట మాజీ చీఫ్ వార్డెన్ ఆచార్య పల్లవిని వివరణ కోరగా నాలుగున్నర సంవత్సరం లు చేశానని తనకు చీఫ్ వార్డెన్ గా 2021 నుంచి హాస్టల్ అభివృద్ధికి కృషి చేసానని తాను సేవలు అందించే విధంగా తనకు అవకాశం ఇచ్చిన ఏయూ అధికార్లుకు కృతజ్ఞతలు తెలియజేసారు.



## బైక్ దొంగతనం కేసులో నిందితుడికి 5 నెలల జైలు శిక్ష



అనకాపల్లి, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్: స్థానిక అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2025 సంవత్సరం జూన్ 30వ తేదీన జరిగిన బైక్ దొంగతనం కేసులో నిందితుడికి కోర్టు ఐదు నెలల కఠిన కారాగార శిక్ష విధించినట్లు టౌన్ ఎస్.హెచ్.ఓ జి.ప్రేమ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారిలోని పూడిమడక జంక్షన్ బ్రిడ్జి కింద ఫిర్యాదిదారుడు లంక రామునాయుడు పార్క్ చేసిన ఏపీ 31 ఈపీ5252 నంబర్ గల పల్సర్ బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించిన ఘటనపై అనకాపల్లి టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితుడైన మరిపి గోవిందరావు అలియాస్ గౌతమ్ (36), తండ్రి త్రినాథ్, ఆనందపురం నివాసి, స్వగ్రామం పార్వతీపురం మన్యం జిల్లా) ను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. ?ఈ కేసుపై విచారణ చేపట్టిన అనకాపల్లి 11వ ఏఎంఎం మెజిస్ట్రేట్ ఎ.రమేష్, నేరం రుజువు కావడంతో ముద్దాయికి 5 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసులో ప్రభుత్వ తరపున ఏపీపీ మృణాళిని బలమైన వాదనలు వినిపించి, నిందితుడికి శిక్ష పడేలా చేశారని కొనియాడారు.?నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు తమ వాహనాల భద్రత విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఈ సందర్భంగా ఎస్.హెచ్.ఓ జి.ప్రేమ్ కుమార్ సూచించారు.

## ఉగ్గనపాలెం శివారులో బల్లాటపై దాడి

**- ఐదుగురు వ్యక్తులు, పట్టా, డబ్బా, రూ. 2,140 నగదు స్వాధీనం - సీఐ స్వామి నాయుడు**



కశింకోట(అనకాపల్లి), ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని ఉగ్గనపాలెం గ్రామ శివారు ఖాళీ స్థలం వద్ద, డబ్బులు ఫణంగా పెట్టి బల్లాట ఆడుతున్నారనే ఖచ్చితమైన సమాచారంపై సబ్-ఇన్స్పెక్టర్లు కె. లక్ష్మణరావు, పి.. మనోజ్ కుమార్, కానిస్టేబుళ్లు రాజశేఖర రావు, శ్రీనివాసరావు, ఉమామహేశ్వరావులతో కలిసి శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో రైడ్ నిర్వహించారని కశింకోట పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఏ. స్వామి నాయుడు తెలిపారు. ఈ రైడ్లో డబ్బులు ఫణంగా పెట్టి బల్లాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకొని, బల్లాట ఆడటానికి ఉపయోగించిన పట్టా, డబ్బా, నగదు మొత్తం రూ. 2,140/-లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ప్రజలు ఎవరూ కూడా అక్రమ కార్యకలాపాలకు పాల్పడకుండా, శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసులకు సహకరించాలని కోరారు.

## కళ్యాణపులోవ ఉత్సవాలకు ఆటోలకు అనుమతి లేదు

**: సిఐ కోటేశ్వరరావు**



రావికమతం ఫిబ్రవరి 13 మేజర్ న్యూస్: మండలములో చీమలపాడు పంచాయతీ కళ్యాణపులోవ పోతురాజు బాబు ఉత్సవాలకు ఆలయం వరకు ఆటోలకు అనుమతి లేదని కొత్తకోట సిఐ కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు, ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆటోలు, భారీ వాహనాలు, గూడ్స్ వాహనాలు కు అనుమతి లేదని తెలిపారు. ఈ వాహనాలు అన్ని దొండపూడి చెక్ పోస్ట్ వద్ద నిలిపివేయాలని తెలిపారు. దొండపూడి చెక్ పోస్ట్ నుంచి కళ్యాణపులోవ ఆలయం వరకు వరకు ఆర్టీసీ బస్సులు , ద్విచక్ర వాహనాలు విఐపి వాహనాలకు మాత్రమే అనుమతిస్తామని ఆయన వివరించారు. ఈ అసౌకర్యానికి భక్తులు సహకరించాలని కోరారు.

## జిల్లా కలెక్టర్ కు కలసిన మాజీ ఎమ్మెల్యే కలమట

**- నియోజకవర్గం సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేత**



కొత్తూరు, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్: పాతపట్నం నియోజకవర్గం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మాజీ శాసన సభ్యులు కలమట వెంకట రమణ శుక్రవారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ను కలసి వినతి పత్రం అందజేశారు. దరఖాస్తు చేసుకొన్న అర్హులైన వికలాంగులకు పెన్షన్లు మంజూరు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లారు. ఇవే కాకుండ నియోజకవర్గం లో గల ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కు అన్నారు. గత కొంత కాలం నుండి పరిష్కారం కానీ సమస్యలు పై ఆయన చర్చించారు. కలమట ఇచ్చిన వినతి పత్రం కలెక్టర్ సానుకూలంగా స్పందించారని కలమట కార్యాలయం వెల్లడించింది.

## డీఎల్ పురంలో దళితులకు న్యాయంచేయండి



నక్కపల్లి, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్: నక్కపల్లిమండలం డీఎల్.పురం గ్రామంలో 6.56 ఎకరాల భూములకు సంబంధించిన దళితులకు నష్టపరిహారం ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. శుక్రవారం రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో దళితులంతా డీటీ నారాయణరావుకు వినతి పత్రం అందజేశారు. దళితులు సాగులో ఉన్న 75 రైతులకు భూములను తీసుకున్నప్పుడు వారికి ఇవ్వాల్సిన నష్టపరిహారం అందజేయాలని రామకృష్ణ కోరారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఎ.పి.డబ్ల్యు.జె.ఎఫ్ కృషి

**- జర్నలిస్టుల ఛలో విజయవాడ జయప్రదం చేయండి - ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు**




అనకాపల్లి, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్: అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి వాటిని పరిష్కరించుకునేందుకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎ.పి.డబ్ల్యు.జె.ఎఫ్) చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టిందని, రాష్ట్రంలోని జర్నలిస్టులందరూ పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఆంజనేయులు కోరారు. శుక్రవారం అనకాపల్లి సీపీఎం కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని జర్నలిస్టులను సంఘటితం చేసి చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేసేందుకు అన్ని జిల్లాల్లో ఫెడరేషన్ నాయకులు పర్యటిస్తున్నారని, అందులో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం, అల్లూరి సీతారామరాజు జిల్లా, అనకాపల్లి జిల్లాల్లో పర్యటించడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలోని జర్నలిస్టులకు మూడు సెంట్లు చొప్పున కేటాయిస్తామని గత ప్రభుత్వం జీవో జారీ చేసి దరఖాస్తులను స్వీకరించిందని, వారికి స్థలాల కేటాయింపు చేయడంతో పాటు అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు కేటాయించేందుకు వీలుగా ప్రభుత్వం తగిన ఉత్తర్వులు జారీ చేయాలని, ఇళ్ల కట్టుకునేందుకు తగిన ఆర్థిక సహాయం అందించాలని అన్నారు. రాష్ట్రంలోని జర్నలిస్టుల ఇళ్లస్థలాల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తక్షణం తగిన చర్యలు తీసుకోవాలని ఫెడరేషన్ డిమాండ్ చేస్తుందని అన్నారు. అలాగే మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, సమాజంలో మారిన పరిస్థితుల దృష్ట్యా జర్నలిజం వృత్తి ప్రమాదంలో పడిందని, జర్నలిస్టుకు రక్షణ కొరవడిందని, రక్షణ లేని వృత్తిగా జర్నలిజం ప్రపంచదేశాల్లో 149వ స్థానంలో ఉందని అన్నారు. భద్రత, పని పరిస్థితులు, ఇతర సదుపాయాలు తదితర అంశాలన్నింటిపై అధ్యయనం చేసేందుకు మెరుగైన చర్యలు చేపట్టేందుకు వీలుగా ప్రభుత్వం మీడియా కమిషన్ను ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే దేశంలోని దాదాపు 18 రాష్ట్రాల్లో జర్నలిస్టులకు ప్రభుత్వాలు పెన్షన్ పథకాన్ని అమలు చేస్తున్నాయని, మనరాష్ట్రంలో జర్నలిస్టులకు వాటన్నిటి కన్నా మెరుగైన పెన్షన్ పథకాన్ని అమలు చేసేందుకు గల అవకాశాలను పరిశీలించేందుకు వీలుగా ఒక కమిటీని నియమించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ సమాచార శాఖ ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమ నిధి ఉందని, మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు తాత్కాలిక భరోసా కల్పించేందుకు మూడేళ్ల పాటు నెలకు వెయ్యి రూపాయలు పెన్షన్ గా ఇచ్చే ఏర్పాటు ఉందని, ఆ మొత్తాన్ని ఐదువేల రూపాయలకు పెంచే ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద పెండింగ్లో ఉన్నాయని అన్నారు. జర్నలిస్టులపై జరిగే దాడులను అరికట్టేందుకు వీలుగా గత రాష్ట్రంలో హోటలీంశాఖ మంత్రి నేతృత్వంలో హైపవర్ కమిటీ, జిల్లాలో ఉన్నత పోలీసు అధికారులతో కూడిన కమిటీలు వేసేందుకు ఉత్తర్వులు ఉన్నప్పటికీ కమిటీలు లేవని అన్నారు. కార్మిక శాఖ పరిధిలో అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులకు కల్పిస్తున్న బీమా పథకం జర్నలిస్టులకు వర్తింపజేసేందుకు వీలుగా కార్మిక శాఖ కమిషనర్ ప్రతిపాదనలు పంపారని, చాలాకాలంగా పెండింగ్లో ఉన్న ఈ అంశంపై ప్రభుత్వం సానుకూలమైన నిర్ణయం తీసుకుని జర్నలిస్టులకు బీమా సదుపాయం కల్పించాలని కోరారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బి. వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. ఈశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాదర్, విశాఖ సిటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఏపీబీజేపి విశాఖ సిటీ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, కార్యదర్శి మదన్, అనకాపల్లి పాత్రికేయులు పాల్గొన్నారు.

# పరీక్షలకు సమగ్రంగా సిద్ధం కావాలి

**- వంశధార విద్యా సంస్థల వ్యవస్థాపకులు చింతాడ అను రుద్రుడు**



కోటబొమ్మాళి, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్: త్వరలో జరుగనున్న పరీక్షలకు సమగ్రంగా సిద్ధం కావాలని వంశధార విద్యాసంస్థల వ్యవస్థాపకులు చింతాడ అను రుద్రుడు పిలుపునిచ్చారు. వంశధార జూనియర్ కళాశాల, ఇంటర్మీడియట్ విద్యార్థులతో జరిగిన ప్రత్యేక సమావేశంలో శుక్రవారం ఆయన ప్రతి విద్యార్థికి హృదయపూర్వక శుభాశీస్సులు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ -- నేటి పోటీ ప్రపంచంలో విద్యా దశలో కష్టపడి చదివిన వారే మంచి ఫలితాలు సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో స్థిరపడతారని స్పష్టం చేశారు. "కష్టే ఫలి" అనే సామెతకు ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఉన్నత విద్యలు అభ్యసించి గొప్ప స్థాయిలో ఎదగాలని ఆశిస్తూ రేయింబవళ్ళు కష్టపడుతూ ప్రతి పైసా ఖర్చు చేస్తున్నారని గుర్తుచేశారు. వారి ఆశలను అడియాసలు చేయకుండా కృషి చేయాలని విద్యార్థులను కోరారు. "మీరు ఉన్నత స్థానాల్లో నిలిస్తే మొదట గర్వపడేది మీ తల్లిదండ్రులే. తర్వాత 'వీరు మా విద్యార్థులు' అని గర్వంగా చెప్పుకునేది మీ గురువులే" అని ఆయన హృదయాన్ని తాకేలా చెప్పారు. విద్యా దశలో గురువులు మందలించినా అది కేవలం విద్యార్థుల మంచికే తప్ప ఎటువంటి కక్ష సాధింపు కాదని అనురుద్రుడు స్పష్టం చేశారు.అనంతరం పరీక్షల దిశగా అడుగులు వేస్తున్న ప్రతి విద్యార్థికి -- విజయం మీ సొంతం కావాలని దీవిస్తూ పరీక్షలు వ్రాయడానికి పెన్నులను బహూకరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డి.వి. రమణమూర్తి, కోట సింహాచలం, నంబారి వెంకటేశ్వరరావు, దవిల లక్ష్మి, యం. రామారావు, బెహర రాజేష్, గొల్లంగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొని తమ లక్ష్యాల సాధనకు కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు.

# క్రైం రివ్యూలో అధికారులు సీపీ దిశానిర్దేశం..

**- రౌడీషీటర్లపై కఠిన నిఘా ఉంచాలి - మాదక ద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట - పెండింగ్ కేసులకు గడువు, కన్విక్షన్ శాతం పెంపుపై దృష్టి పెట్టాలి - సమస్యాత్మక ప్రాంతాల్లో విజిబుల్ పోలీసింగ్, డికాయ్ బృందాల ఏర్పాటుచేయాలి - మహిళల భద్రతకు ప్రాధాన్యం - మిస్సింగ్, పోక్సో కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు చేయాలి - విధుల్లో పారదర్శకతకు ప్రాధాన్యం**



**క్రైం బ్యూరో, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** విశాఖ నగరంలో శాంతి భద్రతలు మరింత పటిష్టం కావాలంటే ప్రతి పోలీస్ స్టేషన్ పనితీరు బాధ్యతాయుతంగా, ఫలితాల దిశగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి స్పష్టం చేశారు. శుక్రవారం కాన్ఫరెన్స్ హాల్‌లో డిసిపి ఏడీసీపీలు నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో నిర్వహించిన ఈ నెల సమీక్షా సమావేశంలో ఆయన విభాగాల వారీగా సమగ్రంగా పనితీరును పరిశీలించారు. రౌడీషీటర్లపై నిఘా కఠినతరం నగరంలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో యాక్టివ్‌గా ఉన్న రౌడీషీటర్ల వివరాలను ఆరా తీసిన సీపీ, వారిపై చేపడుతున్న నిఘా చర్యలు ఫలితాల దిశగా ఉండాలని ఆదేశించారు. నగరంలో ఎటువంటి ఎన్‌డీపీఎస్ (మాదక ద్రవ్యాలు) రవాణా జరగకుండా కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించాలని స్పష్టం చేశారు. పెండింగ్ కేసులపై దృష్టి లాంగ్ పెండింగ్‌లో ఉన్న కేసులపై వివరాలు సేకరించిన కమిషనర్, ఆలస్యానికి కారణాలు తెలుసుకొని వాటిని సత్వరమే పరిష్కరించాలని సూచించారు. కోర్టు తీర్పులు వెలువడిన కేసుల పురోగతిని సమీక్షిస్తూ కన్విక్షన్ శాతం పెంచేలా సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక చర్యలు సీపీ నంబర్‌కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా గుర్తించిన సమస్యాత్మక ప్రాంతాల్లో నిర్ణీత గడువులో సమస్యలను పరిష్కరించాలని సంబంధిత స్టేషన్ అధికారుల కు ఆదేశాలు జారీ చేశారు. నిర్మానుష్య ప్రాంతాలు, సున్నిత ప్రాంతాల్లో విజిబుల్ పోలీసింగ్, పికెట్‌లు, అవసరమైతే డికాయ్ బృందాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్, ఈవ్‌టీజింగ్‌పై కట్టడి ట్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్, ఈవ్‌టీజింగ్ వంటి ఘటనలు చోటు చేసుకోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైన వాహనాలు, సిబ్బంది కొరత ఉంటే వెంటనే తెలియజేయాలని తెలిపారు. గంజాయి విక్రయాలు, అసాంఘిక కార్యకలాపాలపై జీరో టాలరెన్స్ విధానం పాటించాలని ఆదేశించారు. మహిళల భద్రతకు ప్రాధాన్యత మహిళలపై వేధింపులు, మిస్సింగ్ కేసులలో ఆలస్యం లేకుండా స్పందించాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంలో వ్యవహరించాలని సూచించారు. పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి వేగవంతమైన దర్యాప్తు చేపట్టాలని తెలిపారు. సైబర్ నేరాలపై బలోపేతం సైబర్ క్రైమ్ నియంత్రణకు కొత్త సాఫ్ట్‌వేర్‌లు వినియోగిస్తూ అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. విజిటర్స్ మానిటరింగ్ సిస్టమ్ (వీఎంఎస్) వినియోగాన్ని అన్ని విభాగాల సిబ్బంది తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. లోక్ అదాలత్, న్యాయ సమన్వయం లోక్ అదాలత్‌లో గతం కంటే ఎక్కువ కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో పరస్పర చర్చలు జరిపి న్యాయ సంబంధిత సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. పారదర్శక విధులే ప్రమాణంవిధుల్లో అవినీతి, అధికార దుర్వినియోగం, చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు. వచ్చే నెల సమీక్షలో ప్రతి స్టేషన్ క్రైమ్ రేటు తగ్గుదలతో మెరుగైన ఫలితాలు చూపాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీసీపీలు,ఏడీసీపీలు, ఏసీపీలు, స్టేషన్ ఎస్.హెచ్.ఓలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విశిష్ట సేవలకు విశాఖ పోలీసులకు ఘన సత్కారం..

**- 291 మంది సిబ్బందికి రివార్డులు అందజేసిన సీపీ - గంజాయి, సైబర్ నేరాల నియంత్రణలో విశిష్ట సేవలకు గుర్తింపు**

**- టాస్కోర్స్ పనితీరు పై సీపీ హర్షం**



**విశాఖ క్రైం, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** నగర భద్రత కోసం అహర్నిశలు శ్రమిస్తున్న పోలీసు సిబ్బందికి ప్రోత్సాహం అందిస్తూ నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి 291 మంది సిబ్బందికి రివార్డులు మంజూరు చేశారు. క్రైమ్ రివ్యూ సమావేశంలో ఉన్నతాధికారుల సమక్షంలో రివార్డు మంజూరు ఆర్డర్లను అందజేసి సిబ్బంది సేవలను ప్రశంసించారు. హోంగార్డు నుంచి సీఐ స్థాయి అధికారుల వరకు విస్తృతంగా ఎంపికైన సిబ్బంది గత నెలలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచారు. ముఖ్యంగా గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంలో, నగరం అక్రమంగా రవాణా అవుతున్న మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించారు. పలు చోరీ కేసుల్లో దొంగిలించిన సొత్తును రికవరీ చేసి నిందితులను అరెస్టు చేయడంలో విశేష చురుకుదనం ప్రదర్శించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పేరుమోసిన నేరస్తులను గుర్తించి పట్టుకోవడం, సైబర్ నేరాల విచారణలో సమర్థవంతంగా వ్యవహరించడం వంటి అంశాల్లో కూడా పలువురు అధికారులు, సిబ్బంది విశిష్ట సేవలు అందించారు. వారి కృషిని గుర్తించి రివార్డులు అందజేయడం ద్వారా ఇతర సిబ్బందికి ప్రేరణ కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించబడింది. పోలీసు శాఖలో ఉత్తమ పనితీరును ప్రోత్సహించే విధంగా ప్రతి నెలా ప్రతిభావంతులైన సిబ్బందిని గుర్తించి గౌరవించడం కొనసాగుతుందని కమిషనర్ తెలిపారు. నగరాన్ని మరింత సురక్షితంగా, నేరరహితంగా తీర్చిదిద్దే దిశగా ఇదే ఉత్సాహంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 13 వ వార్డు రామాలయంలో నారాయణ సేవ

**- హాజరైన ఏడువాక సన్యాసిరావు శ్రీ మహాలక్ష్మి**



**ఆరిలోవ, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** జీవీఎంసీ, 13వ వార్డు పరిధిలో గల వేర్ని దుర్గా నగర్ రామాలయం లో ప్రతి గురువారం నిర్వహిస్తున్న నారాయణ సేవ కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ 13 వ వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు శ్రీ మహాలక్ష్మి దంపతుల ఆర్థిక సాయంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏడువాక సన్యాసి రావు శ్రీ మహాలక్ష్మి పాల్గొని ఆమె చేతుల మీదుగా భక్తులకు అన్నదాన ప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా గ్రామ, ఆలయ అధ్యక్షులు పి ఐ బాలరాజు మాట్లాడుతూ జనవరి నెల నుంచి ఏడువాక దంపతులు తన వంతు ఆర్థిక సాయంతో ప్రతి వారం అన్నదాన కార్యక్రమాన్ని ఇప్పటివరకు నిర్వహించామని తెలిపారు. ఏడువాక సన్యాసిరావు శ్రీమహాలక్ష్మి కి కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీ మహాలక్ష్మి ని సత్కరించారు. ఇటువంటి మంచి సేవా కార్యక్రమాలకు తన వంతు సాయాన్ని అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్న ఏడువాక దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పి ఐ బాలరాజు వైస్ ప్రెసిడెంట్ గురుమూర్తి, జనరల్ సెక్రెటరీ కిరణ్, జాయింట్ సెక్రెటరీ శివ ప్రసాద్, సాయి సేవకులు గుబ్బల శివరాము. సత్యనారాయణ, అనకాపల్లి కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

# సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం

**: సీపీ - 21 మంది సిబ్బందికి పదోన్నతులు - కమిషనరేట్‌లో ఉత్సాహ వాతావరణం - కానిస్టేబుళ్ల నుంచి ఏఎస్ఐల వరకు పదోన్నతి జాబితా**







**విశాఖ క్రైం, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** సిబ్బంది సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తూ నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి పదోన్నతి పొందిన సిబ్బందిని సత్కరించి,కొత్త హోదాలకు సంబంధించిన ర్యాంకులు మరియు పోస్టింగ్ ఆర్డర్లను అందజేశారు. నగర పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కమిషనరేట్‌కు చెందిన మొత్తం 21 మంది సిబ్బందికి పదోన్నతులు కల్పించబడ్డాయి. ఒక అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్‌ను రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్‌గా, 17 మంది ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుళ్లను ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుళ్లుగా, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లను అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్లుగా, ఒక ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్‌ను అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్‌గా పదోన్నతి కల్పించారు. పదోన్నతి పొందిన సిబ్బందిని వారి కుటుంబ సభ్యులతో కలిసి ఉడా చిల్డ్రన్ ఎరీనాకు ఆహ్వానించి, ఉన్నతాధికారుల సమక్షంలో నూతన ర్యాంకులు ధరింపజేసి పోస్టింగ్ ఆర్డర్లు స్వయంగా అందజేశారు. సిబ్బంది కృషిని అభినందించిన కమిషనర్, నూతన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించి శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# మల్కాపురం పోలీసుల పనితీరు భేష్..

**- తొమ్మిది కేసుల్లో ప్రతిభకు..కమిషనర్ ప్రశంస -**

**ఛేదించిన సిబ్బందికి రివార్డులు అందజేసిన సీపీ**



**పెద గంట్యాడ, క్రైం, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** లనగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన నెలవారీ క్రైమ్ సమీక్ష సమావేశంలో మల్కాపురం పోలీసులకు రివార్డుల పంట పండింది. మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో పనిచేస్తున్న సిబ్బంది తొమ్మిది కేసుల్లో చూపిన ప్రతిభకు నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి రివార్డులు ప్రకటించారు. గంజాయి కేసులను ఛేదించి నిందితులను అరెస్టు చేయడం, రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవడం, మద్యం అక్రమంగా విక్రయిస్తున్న బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించడం వంటి చర్యల్లో మల్కాపురం పోలీసులు చురుకుదనం ప్రదర్శించారు. అదేవిధంగా మిస్సింగ్ కేసులను త్వరితగతిన చేధించి తప్పిపోయిన వారిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మల్కాపురం పోలీసుల పనితీరును అభినందిస్తూ ఇదే ఉత్సాహంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఉన్నతాధికారులు కూడా సిబ్బందిని ప్రశంసించారు.యన సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పరవాడ మండలంలో రోడ్డు భద్రత అధికారుల తనిఖీ



**అనకాపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** పరవాడ మండలంలో తరచూ రహదారి ప్రమాదాలు జరిగే లంకెలపాలెం, మూడు కల్వెర్ట్ జంక్షన్ ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలు రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాలను తగ్గించేందుకు తక్షణ మరియు దీర్ఘకాలిక భద్రతా చర్యలను అమలు చేయడం లక్ష్యంగా సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా శుక్రవారం స్థల పరిశీలన చేశారు ఇ తనిఖీలో పోలీసు శాఖ ప్రతినిధులు, రహదారి మరియు భవనాల శాఖ అధికారులు, ట్రాఫిక్ విభాగ సిబ్బంది, నేషనల్ హై వే సిబ్బంది ఈ ప్రాంతంలో ఉన్న సమస్యలను సమగ్రంగా అంచనా వేశారు. వీటిలో గుర్తించిన ప్రధాన సమస్యలు, ప్రమాదకర అంశాలు గుర్తించబడ్డాయి అధిక వేగంతో వాహనాల రాకపోకలు సరైన హెచ్చరిక బోర్డులు మరియు మార్గదర్శక సూచనలు లేకపోవడం రాత్రి సమయంలో తగిన వెలుతురు లేకపోవడం గ్రామీణ రహదారులు ప్రధాన రహదారితో కలిసే చోట స్పష్టత లోపం చెట్లు మరియు కొమ్మలు దృష్టి అడ్డుకోవడం సూచించిన భద్రతా చర్యలు ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టడం అవసరమని నిర్ణయించారు.వేగ నియంత్రణ కోసం రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు అనధికారిక పాదచారి దాటివేతను నివారించేందుకు గార్డ్‌రైల్స్ ఏర్పాటు స్పష్టమైన లేన్ మార్కింగ్స్ మరియు "స్లో" సూచనలు ఏర్పాటు రాత్రి సమయంలో దృశ్యమానత పెంచేందుకు అదనపు వీధి దీపాలు / హైమాస్ట్ లైటింగ్ ఏర్పాటు చెట్ల కొమ్మల తొలగింపు ద్వారా దృష్టి స్పష్టత పెంపు రాత్రి మార్గదర్శకత్వం కోసం సోలార్ క్యాట్‌ఐలు ఏర్పాటు జంక్షన్‌కు ముందుగా హెచ్చరిక బోర్డులు మరియు వేగ పరిమితి సూచనలు ఏర్పాటు పై చర్యలను సమన్వయంతో తక్షణం అమలు చేస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచనలు చేశారు. సంబంధిత శాఖలు పరస్పర సహకారంతో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలనీ డిటిఓ మనోహర్ సీఐ మల్లిఖార్జున రావు మోటారు వెహికిల్ ఇన్స్పెక్టర్ గోపి కృష్ణ ఏ ఎం వి ఐ హసీనా సుల్తానా, గీతా కావ్య నేషనల్ హై వే ఇంజనీరింగ్ విభాగం రిచర్డ్ లు గుర్తించి వీటిని అమలు చేయడానికి నిర్ణయించారు.

# వైసిపి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**- తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు**



**ఆరిలోవ, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** జీవీఎంసీ, 13వ వార్డు కార్యాలయంలో వైసిపి వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్ ఆధ్వర్యంలో వార్డు నాయకులు, కార్యకర్తలతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావు హాజరయ్యారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కమిటీల నిర్మాణం చాలా ముఖ్యమని,దీనికి ప్రతీ ఒక్క కార్యకర్త సహకరించి,పార్టీ కోసం కష్టపడే వారినే నియమించుకుని అనుబంధ విభాగాల కమిటీలను,సచివాలయ కమిటీలను వేసుకుని అత్యంత బలమైన వార్డుగా 13 వ వార్డు ఉండేలా చూడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు..ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ విభాగం అధికార ప్రతినిధి అల్లంపల్లి రాజబాబు,రాష్ట్ర ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి గూడపాటి విక్టర్,రాష్ట్ర బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి సత్యాల సాగరిక,తూర్పు బీసీ విభాగం అధ్యక్షులు బేతా దుర్గారావు,బూత్ కమిటీ విభాగం అధ్యక్షుడు ప్రసంగి వాసు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దిబ్బవీధి కొబ్బరి తోటలో వాలీబాల్ నేషనల్ పోటీలకు ఎంపిక

**- ఎంపికైన క్రీడాకారులను అభినందించిన మళ్ల సురేంద్ర**



**అనకాపల్లి, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** స్థానిక గవరపాలెం దిబ్బవీధి కొబ్బరి తోటలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేషనల్ సబ్ జూనియర్స్ టీమ్ సెలక్షన్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలలో రాష్ట్రం నలుమూలలు నుండి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉదయం 9 గంటలకు నుండి సాయంత్రం 5 గంటల వరకు పోటీలు నిర్వహించారు. వీరిలో 18 మంది బాయ్స్ టీమ్,18 మంది గర్ల్స్ టీమ్ లను ఎంపిక చేశారు. వారం రోజుల ట్రైనింగును పూర్తి చేసుకొని వీరు ఈ నెల 25 న వెస్ట్ బెంగాల్ లో జరిగే నేషనల్ టీమ్ లో పాల్గొంటారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళా సురేంద్ర హాజరై ముందుగా క్రీడాకారులను పరిచయ కార్యక్రమం చేసి అనంతరం మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం క్రీడలకు ప్రోత్సాహం అందిస్తుందని, నేషనల్ పోటీలకు ఎంపిక అయిన వారినందరినీ ఈ సందర్భంగా అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జగన్నాథ స్వామి దేవస్థానం చైర్మన్ దాడి బుజ్జి, ఆర్గనైజర్స్ దాడి శ్రీను, యల్లపు గోవింద్, బుద్ధ శివ, పీలా రమణారావు, కోచెస్, టీమ్ మేనేజర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాబా వార్షికోత్సవ వేడుకలు ముగింపు



**ఆరిలోవ, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** జీవీఎంసీ, 12 వార్డు పరిధిలోగల చినగదిలి బాబా ఆలయ 13 వార్షికోత్సవ కార్యక్రమాలలో భాగంగా మూడో రోజు ఎంతో ఘనంగా ఉదయం పంచామృత అభిషేకములు పూజా అర్చన కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం 13 కలశలను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 11:30 గంటలకు గురు బాబా వారి సన్నిధానంలో అన్నాభిషేకం భక్తుల చేతుల మీదగా నిర్వహించారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయింత్రం సాయి సుహృత హోమం, పూర్ణాహుతి రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, సాయి నామ సంకీర్తణ, భజన కార్యక్రమం, నక్షత్ర హారతి, శేజ్ హారతి,పవళింపు సేవ, ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు నగేష్ శర్మ, ప్రభాస్ నిర్వహించారు ఈ కార్యక్రమాలలో ఆలయ చైర్మన్ వానపల్లి అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆంధ్ర యూనివర్సిటీ రిటైర్డ్ డిప్యూటీ రిజిస్టర్ గవర రాజు దంపతులు, ఆలయ చీఫ్ సెక్రెటరీ ఆర్ ఎ పాత్రో, కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మహిళా ఉపాధ్యాయులకు సత్కారం...



**నరసన్నపేట, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** నరసన్నపేట మారుతి నగర్ రెండో వీధిలోని శ్రీ జ్ఞాన జ్యోతి పాఠశాలలో శుక్రవారం జాతీయ మహిళా దినోత్సవం పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా బోధన చేస్తున్న మహిళా ఉపాధ్యాయులను సత్కరించి వారి సేవలను కొనియాడారు. వారికి చిరుకానుకలు అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ జ్ఞాన జ్యోతి స్కూల్ యాజమాన్య ప్రతినిధులు వెలమల భాస్కరరావు, బోర రామారావు, తర్ర సత్యనారాయణ, పాగోటి లక్ష్మీ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వేల్పుల వీధి కాశీ విశ్వేశ్వర స్వామిని దర్శించిన డిప్యూటీ కమిషనర్ సుజాత



అనకాపల్లి, ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్: స్థానిక వేల్పుల వీధిలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోగల స్వయంభు దేవాలయం, శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం దేవదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్ సుజాత స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్శహించారు. ఈ సందర్భంగా ఆమెను పాలకవర్గ సభ్యులు, ఈవో ఘనంగా సత్కరించారు, ఆలయంలో స్తంభానికి నూతనంగా తయారుచేసిన ఇత్తడి తొడుగులను పూజలు చేసి ప్రారంభించారు. ఆలయంలో శివరాత్రి ఏర్పాట్లు కూడా ఏ విధంగా చేస్తున్నారో ఆలయ ఈవో బి మురళీకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తాటికొండ కామేశ్వరరావు(రాంబాబు), ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భీమిలిలో ప్రశాంతంగా ముగిసిన బార్ అసోసియేషన్ ఎన్నికలు

**- 95.71 శాతం ఓట్లు నమోదు**



**భీమిలి, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ బార్ అసోసి యేష న్ ఎన్నికలు భీమునిపట్నంలో శుక్రవారం ప్రశాంతంగా ముగిసాయి. జ. 136వ బూత్ లో 70 మంది న్యాయవాదులకు ఓట్లు హక్కు ఉండగా 67మంది తమ ఓటు హక్కును వినియోగించుకు న్నారు. ప్రతి అయిదు ఏళ్ల కొకసారి జరిగే బార్ అసో సియే షన్ ఎన్నికల్లో భీముని పట్నం పోలింగ్ బూత్ ఆఫీసర్ గా ఎన్ జనార్ధన్ ఎన్నికలు నిర్వహించారు.బూత్ ఏజెంట్ గా డి. కనకమహాలక్ష్మి, జి వి సన్యాసిరావు లు పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో 143 మంది సభ్యులు పోటీలో పాల్గొన్నారు.

# జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ కుమార్ ఆకస్మిక సందర్శన



**భీమిలి, ఫిబ్రవరి 13, మేజర్‌న్యూస్:** మజ్జి వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు అమలవుతున్న వంద రోజులు యాక్షన్ ప్లాన్ ను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. సబ్జెక్టు ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థులకు మరింత బోధన చెయ్యాలి అని సూచించారు. పాఠశాల పరిసరాలను చూసి సంతృప్తి చెందారు. విద్యార్థులకు స్వయంగా మధ్యాహ్న భోజనాన్ని వడ్డించి తాను కూడా విద్యార్థులతో కలిసి భుజించారు. ఉపాధ్యాయుల అసెస్మెంట్ పుస్తకాలను పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. పదవ తరగతిలో మంచి మార్కులు రావడానికి విద్యార్థులకు ప్రేరణ కలిగించే విధంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఐ. పద్మజ, ఉపాధ్యాయులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# విధులకు డుమ్మా కొడుతున్న పంచాయతీ కార్యదర్శి పై వెంటనే చర్యలు తీసుకోవాలి

**పెదబయలు ఫిబ్రవరి 13 మేజర్ న్యూస్** :మండలంలోని అడుగులు పుట్టు పంచాయతీ కేంద్రం పంచాయతీ కార్యదర్శి ప్రజలకు అందుబాటులో ఉండకుండా విధులకు దుమ కొడుతుందని పంచాయతీ ప్రజలు ముక్తకంఠంతో ఆరోపిస్తున్నారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. అనంతరంపత్రిక విలేకరులకు ప్రకటన రూపంలో అందించిన వివరాల మేరకు 13 రోజులు పాటు పంచాయతీ కార్యదర్శి, వీ తులసి ప్రజలకు అందుబాటులో లేకపోవడం వలన పంచాయితీ ప్రజలు తీవ్ర ఇక్కట్లు గురి అవుతున్నామని పేర్కొన్నారు.వివిధ అవసర పనుల నిమిత్తం పంచాయతీ కేంద్రంలో వచ్చిన



పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి అందుబాటులో ఉండకపోవడం వలన ప్రజలు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు ప్రజలకు అందుబాటులో ఉండాని పంచాయతీ కార్యదర్శి పై అధికారులు వెంటనే చర్యలు చేపట్టి ప్రజలకు కార్యదర్శి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు. ఈ మధ్యకాలంలో అడుగులు పుట్టు పంచాయతీ కేంద్రం పరిధిలోగల వివిధ గ్రామాలలో అనేకమంది మృత్యువాత పడ్డారు అలాగే జననాలు కూడా జరిగి ఉన్నాయని వాటికోసం వివిధ కుటుంబాలు ధ్రువపత్రాలు కోసం దరఖాస్తు చేసుకునేందుకు పంచాయతీ కార్యాలయంలో వస్తే పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉండకపోవడం వలన ఏ ఒక్క కుటుంబానికి కూడా జననం మరణ ధ్రువపత్రాలు పొందలేక అనేక అవస్థలు ప డుస్తున్నారని ముక్తకంఠంతో తెలిపారు

# ప్రమాదాలకు నిలయంగా అంత్రిగుడ మలుపు



**డుంబ్రిగుడ, ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్:–** 516 ఈ జాతీయ రహదారి మండలంలోని అంత్రిగుడ మలుపు తరచు ప్రమాదాలతో ప్రమాదాలకు నిలయంగా మారింది. దీంతో వాహనదారులు ప్రయాణికులు భయంతో గురవుతున్నారు. తరచుగా ఈ మలుపు వద్ద ద్విచక్ర వాహనాలు కానీ, కార్లు యాక్సిడెంట్లకు గురవుతున్నాయి. గత నెల 24న రెండు ద్విచక్ర వాహనాలు అదే మలుపు వద్ద ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరొక యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతోపాటు గతంలో జరిగిన పలు యాక్సిడెంట్లలో పలువురు చనిపోయి ఉన్నారు. తాజాగా శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలు అదే మలుపు వద్ద ప్రమాదవశాత్తు కొట్టడంతో ఇద్దరు యువకులకుతీవ్ర గాయాలయ్యాయి వారిని వైద్య చికిత్సల నిమిత్తం 108 అంబులెన్స్ లో అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా అక్కడ తరచుగా ప్రమాదాలు జరిగి మృత్యువాత చెందుతున్న ప్రమాదాల నివారణకు ఏ అధికారులు కూడా పట్టి పట్టనట్లు వ్యవహరించడం విచారకరమని స్థానిక గిరిజనులతో పాటు పర్యాటకులు పలువురు అంటున్నారు. అరకులోయ పర్యాటక ప్రాంతంలో ప్రముఖ పర్యాటక ప్రాంతం చాపరాయి జలపాతం సమీపంలో ఉండడంతో అరకులోయ సందర్శించిన పర్యాటకులు అధిక సంఖ్యలో చాపరాయి జలపాతంలో





తిలకించడానికి వస్తున్నారు. దీంతో ఈ జాతీయ రహదారి నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. కాగా ప్రమాదాల నివారణకు అక్కడ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి అంత్రిగుడ మలుపు వద్ద ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రతిష్టమైన చర్యలు తీసుకోవాలని స్థానికులతో పాటు పర్యాటకులు, వాహనదారులు ప్రయాణికులు, పలువురు కోరుతున్నారు.

# హస్త కళాకారుల వర్క్ షెడ్ ప్రారంభం



**అరకులోయ, ఫిబ్రవరి13, మేజర్ న్యూస్:** మండలంలోని మాదల పంచాయతీకి చెందిన ముసిరి గుడ గ్రామంలో డెవలప్మెంట్ కమిషనేర్ హ్యాండీక్రాఫ్ట్స్ వారి ఆర్థిక సహకారంతో ఏపీ ఐటి సీవో ద్వారా హస్త కళాకారులకు 50 రోజులు గురుశిష్య హస్త శిల్ప (జి ఎస్ హెచ్ పి పి)పై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రామ్ లో స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పట్టాసి. చలపతిరావు ముఖ్య అతిథిగా పాల్గొని బాంబో క్రాఫ్ట్ కళాకారులు సమిష్టి కృషితో నిర్మించిన తత్కాలిక వర్క్ షెడ్ ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పట్టాసి. చలపతిరావు మాట్లాడుతూ హస్త కళాకారులందరూ చేయి చేయి కలిపి ఐక్యంగా షెడ్ ఏర్పాటు చేసుకోవటం అభినందనీయమన్నారు. స్థానిక పట్టాసి ఫౌండేషన్ సహకారం హస్త కళాకారులకు ఎప్పుడు ఉంటుందని, కళాకారులు కూర్చొని పని చేయటానికి వీలుగా తుంగ చాపల కొనుగోలు నిమిత్తం ఆర్థిక సాయం అందించినట్టు ఆయన తెలిపారు. అనంతరం ముసిరిగుడ గ్రామ పెద్దలు స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి. చలపతిరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ తరువాత హస్త కళాకారులకు ప్రిన్సిపాల్ బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టాసి ఫౌండేషన్ ప్రతినిది సుందర రావు,ముసిరిగుడ హస్త కళాకారులు కొర్రా. సింహాద్రి,సోమేష్ కుమార్, జన్ని. జగన్నాధం, తమల కృష్ణ,చిన్నయ్య ,దాసుబాబు, కొర్రా. రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

# పెట్టిందే మెనూ అదే తిను



**హుకుంపేట.ఫిబ్రవరి. 13 సూర్య మేజర్ న్యూస్..** పాడేరు ఐటీడీఏ పరిధిలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, ఏకలవ్య, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో సక్రమంగా మెనూ అమలు కావడం లేదు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించవలసిన కొంతమంది పాఠశాలల సిబ్బంది చేతివాటం ప్రదర్శి స్తున్నారు. 'పెట్టేందే మెనూ.. అదే తిను'అన్న చందనంగా వ్యవహారిస్తున్నారు. దీనితో గిరిజన విద్యార్థులకు ఆకలి బాధలు తప్పడం లేదు. చాలీచాలని కూరలు,ఉడికీ ఉడకని అన్నం.. నీరు లాంటి సాంబారు, రెండు ముక్కల చికెన్ తోసర్దుకోవాల్సి వస్తోంది. మరోవైపు సౌకర్యాలేమి కూడా వారిని తీవ్రంగా వేదిస్తోంది. చాలాచోట్ల నేలపైనే కూర్చొని భోజనం చేయాల్సి వస్తోంది. అమాయక గిరిజన బిడ్డలు ప్రశ్నించలేకపోవడం.. ఉన్నతాధి కారుల పర్యవేక్షణ కొరవడడంతో పాఠశాలల సిబ్బంది ఇస్తానుసారంగా వ్యవహారిస్తూ న్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గిరిజన విద్యను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుంటే క్షేత్ర స్థాయిలో మాత్రం సిబ్బంది తీరతో భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. పాడేరు ఐటీడీఏ పరిధిలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు, గురుకులాలు.. మినీ సుమారు ,వేల మంది గిరిజన విద్యార్థులు చదువు తున్నారు. వారిలో ప్రభుత్వ నిబంధనల మేరకు పక్కాగా మెనూ అమలు చేయాల్సి ఉంది. రోజూ నాణ్యమైన భోజనం పెట్టాల్సి ఉంది. అయితే ఏ పాఠశాలలోనూ మెనూ సక్రమంగా అమలు కావడం లేదనే వ్యఖ్యలు వినిపిస్తున్నాయి. ఐటీడీఏ కు కూత వేటు దూరంలో ఉన్న పాఠశాలల్లో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఆశ్రమ, గురుకులాల్లో మెనూ ఇలా... ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక మెనూను ప్రకటించింది. దీనిని పక్కాగా అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం అది ఆచరణకు నోచుకోవడం లేదు. వాస్తవంగా ఆశ్రమ పాఠశాలల్లో పిల్లలకు ఒక్క శనివారం తప్ప రోజూ ఉదయం పూట ఉడకపెట్టిన గుడ్డు ఇవ్వాల్సి ఉంది. ఆదివారం మధ్యాహ్నం, మంగళవారం రాత్రి చికెన్ కర్రీ, కచెంబరి, పెరుగు, గోంగూర చట్నీ ఇవ్వాలి. కేజీబీవి, గురుకులాల్లో అయితే ఉదయం అల్పాహారంలో చిన్నపాటి మార్పులు మినహా వారంలో రెండు రోజులు చికెన్ కర్రీ, గోంగూర చట్నీ, పెరుగుతో పాటు మిగిలినవి విద్యార్థులకు పెట్టాల్సి ఉంది. ప్రతి గిరిజన విద్యార్థికి 100గ్రాములకు తగ్గకుండా చికెన్ కర్రీతో భోజనం పెట్టాలి. కానీ చాలాచోట్ల విద్యార్థులకు రెండు లేదా మూడు ముక్కల చికెన్ వేసి చేతులు దులుపుకుంటున్నారు. పెరుగు, గోంగూర చట్నీని పూర్తిగా పెట్టడం లేదు. సౌకర్యాల లేమి...గిరిజనుల విద్యాభివృధ్ధి కోసం ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా.. ఆ ఫలాలు విద్యార్థులకు అందడం లేదు. చాలా కళాశాలల్లో బాలికలకు డైనింగ్ హల్ లేకపోవడంతో విద్యార్థినులు రోజూ చెట్ల కింద, కూర్చొని వారు భోజనాలు చేయాల్సి వస్తోంది. గురుకుల పాఠశాలలో డైనింగ్ హల్ ఉన్నప్పటికీ విద్యార్థినులకు సరిపడా టేబుల్స్ లేని కారణంగా వారు కూడా నేలపై కూర్చొని భోజనాలు చేస్తున్నారు. మరికొన్ని పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పర్యవేక్షణ లోపం.. పాడేరు ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న గిరిజన పాఠశాలలపై సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీనితో పాఠశాలల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహారిస్తున్నారు. వారు పెట్టిందే మెనూ అన్నట్లుగా పరిస్థితి మారింది. గిరిజన విద్యార్థులు తమ బాధను ఎవరికి చెప్పుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరికొందరు పౌష్టికాహర లోపంతో బాధపడుతున్నారు. మరికొందరు అనారోగ్య సమస్యలతో ఇంటి దారి పడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు తమ కేమి పట్టనట్లు వ్యవహారిస్తుండడం పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిబంధనల మేరకు గిరిజన పాఠశాలల్లో మెనూ అమలు, మౌలిక వసతుల కల్పనపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై నిఘా.



**డుంబ్రిగుడ ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్:-** జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ ఆదేశాల మేరకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై డ్రోన్లతో ప్రత్యేక నిఘ ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు రావడంతో శుక్రవారం అరకు సంత బయలులో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిని పట్టుకుని వారి పైన పబ్లిక్ న్యూస్ కింద కేసు నమోదు చేయడం జరిగిందని స్థానిక ఎస్సై సురేష్ కుమార్ తెలిపారు..

# మంచినీటి సమస్య త్వరలో పరిష్కరిస్తాం



**ఎంపీడీవో చిన్నారావు :**

అచ్చుతాపురం ఫిబ్రవరి 13 మేజర్ న్యూస్.. దోప్పర్ల గ్రామపంచాయతీ తమ్మయ్యపేట గ్రామంలో 3 నెలల నుంచి మంచినీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న తమ్మయ్య పేట గ్రామస్తులను అచ్యుతాపురం ఎంపీడీవో ఎలక్ట్రికల్ ఏఈ వచ్చి త్వరలో మీ యొక్క మంచినీటి సమస్యకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చియున్నారు

## తపోవనం పీఠాధిపతి లసచ్చిదానందల సరస్వతి స్వామీజీకి నివాళులర్పించిన



**: టీడీపీ నాయకులు**

**పాయకరావుపేట ఫిబ్రవరి 13 మేజర్ న్యూస్.** తుని తపోవనం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామీజీ శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో శివైక్యం చెందారు.తెలుగుదేశం పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కొప్పిశెట్టి వెంకటేష్, టిడిపి సీనియర్ నాయకుడు ముజ్జూరి నారాయణరావు,జూరెడ్డి ప్రసాద్,మండల తెలుగు యువత అధ్యక్షుడు గొల్లపల్లి నాగు, నక్కపల్లి మండల తెలుగు యువత అధ్యక్షుడు కమ్మిల శివకృష్ణరాజు తదితరులు ఆశ్రమానికి చేరుకొని స్వామీజీ భౌతిక కాయానికి నివాళులర్పించారు.

## మూలపేట అభివృద్ధి పనులకు సర్పంచ్ భూమి పూజ



**మునగపాక ఫిబ్రవరి 13 మేజర్ న్యూస్:** మండలంలో మూలపేట గ్రామంలో గల ఆవకాలవ రెగ్యులేటర్ వద్దనున్న స్మశాన వాటిక ప్రహరీ గోడకు ఎంపీటీసీ గ్రాంట్ రెండు లక్షలు పంచాయతీ గ్రాంట్ లక్ష రూపాయలు మొత్తం మూడు లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణానికి తోటాడ ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి సర్పంచ్ బి శెట్టి గంగ అప్పలనాయుడు శుక్రవారం భూమి పూజ నిర్వహించారు, ఈ సందర్భంగా సర్పంచ్ బి శెట్టి గంగఅప్పలనాయుడు మాట్లాడుతూ మా పంచాయతీ పాలకవర్గం గ్రామ అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా యువత ప్రజలు సహకరిస్తున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం ఆడారి సత్యనారాయణ,మొల్లేటి గోవిందరావు, యల్లపు హైమావతి నాయుడు, ఆవకాలవ చైర్మన్ ఆడారి సన్యాసినాయుడు,విశాఖ డైరీ మాజీ అధ్యక్షులు సరగడం నాగేశ్వరరావు, కాండ్రేగుల నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు యల్లపు రాజేశ్వరరావు, ఆడారి కాశీ రావు, బీసెట్టి మధు, బీసెట్టి నాగేశ్వరరావు, సరగడం భాస్కరరావు, ఆళ్ల సూరి అప్పారావు, ఆడారి మోహన్ రావు, బీశెట్టి సాంబశివ, కాండ్రేగుల గోవిందరావు, దొడ్డి శ్రీను, బొడ్డేడ నాగరాజు,బొడ్డేడ సూరి అప్పారావు, కాండ్రేగుల చంటి తదితరులు పాల్గొన్నారు

**చోడపల్లి హెల్త్ వెల్నెస్ సెంటర్ ను సందర్శించిన జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం.**



**అచ్చుతాపురం ఫిబ్రవరి 13 మేజర్ న్యూస్:** ప్రభుత్వ వైద్య ఆరోగ్య సేవలు గ్రామ స్థాయి లో ప్రజలకు అందుతున్న తీరును పరిశీలించుటకు అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ టాస్క్ ఫోర్స్ టీం మండలం లో గల చోడపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం ను సందర్శించినది.రికార్డు లలో నమోదు చేసిన వివరాలు ఆధారం గా గర్భిణులు, బాలింతలు మరియు కౌమరదశ బాలిక ల వద్ద కు వెళ్లి, వారికీ వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగినది.రికార్డులు, రిపోర్ట్స్, ఆన్లైన్ లో హెచ్ ఎం ఐ ఎస్ఆ ఆర్ సి హెచ్ రిపోర్ట్స్ చెక్ చేయడం జరిగిందిటీం లీడర్ (జిల్లా ఎన్ హెచ్ ఎం అధికారి) డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఎన్ సి డి సర్వే సకాలం లో చేయమని, అందరకు ఏ బి హెచ్ ఎ ఐ డి చేయాలనీ, స్కూల్ మరియు హాస్టల్ విజిట్ లలో బాలికలకు టీనేజ్ ప్రెగ్నెన్సీ, హెల్త్ హైజీన్ పై అవగాహన కల్పించాలని, రాబోవు ఎన్ డి డి కార్యక్రమం విజయవంతం చేయాలనీ, మాత శిశు సంరక్షణ లక్ష్యం గా ఇండికేటర్స్ శత శాతం వచ్చునట్లు పని చేయాలనీ ఆరోగ్య సిబ్బందికి సూచించేరు.జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ ఏ. రామచంద్ర రావు, డి పి ఓ కె జగదీష్, సి హెచ్ ఓ, ఎం పి హెచ్ ఈవో, హెచ్ ఎస్ హెచ్.వి, ఎం ఎల్ హెచ్ పి , ఏఎన్ఎం లు ఆశ వర్కర్స్ పాలుగున్నారు

## ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల

**:మండల టిడిపి అధ్యక్షుడు పెంటకోట విజయ్**



**మునగపాక ఫిబ్రవరి 13 మేజర్ న్యూస్:** రాష్ట్ర విద్యా మరియు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల కింద మొత్తం రూ.1200 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు గత కొంతకాలంగా ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని మండల టిడిపి అధ్యక్షుడు పెంటకోట విజయ్ అన్నారు,విడుదల చేసిన నిధులు: రూ.1200 కోట్లునిధుల విడుదలతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఎదుర్కొంటున్న ఫీజుల సమస్యకు గణనీయమైన ఊరట లభించనుంది. ముఖ్యంగా ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు తమ చదువులను మధ్యలో ఆపకుండా కొనసాగించేందుకు ఇది పెద్ద తోడ్పాటుగా నిలుస్తుందని ఆయన అన్నారు.రాష్ట్ర అభివృద్ధిలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని, ఆర్థిక ఇబ్బందులు ఏ విద్యార్థి భవిష్యత్తుకూ అడ్డంకిగా మారకూడదనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమం, ఉన్నత విద్యా అవకాశాల విస్తరణ, పారదర్శక పాలన ఈ మూడు లక్ష్యాల దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని మండల టిడిపి అధ్యక్షుడు పెంటకోట విజయ్ అన్నారు

## భక్తులపై దురుసుగా ప్రవర్తించ వద్దు -జిల్లా కలెక్టర్



**రావికమతం ఫిబ్రవరి 13 మేజర్ న్యూస్:** మండలంలో చీమలపాడు పంచాయతీ కళ్యాణపులోవ పోతురాజు బాబు ఉత్సవాలు కు వచ్చే భక్తులపై దురుసుగా ప్రవర్తించవద్దని అధికారులకు జిల్లా కలెక్టర్ హితవు పలికారు. శుక్రవారం ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ రాజుతో పాటు ఆమె ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్తగా నిర్మించిన రింగ్ రోడ్డు, వాహన పార్కింగ్ , భోజనశాల, వంటశాల, భక్తుల విశ్రాంతి షామియానా, ఆలయం వద్ద క్యూ లైన్లు రిజర్వాయర్ వద్ద ఘాట్లు ఎమ్మెల్యే కేఎస్ ఎన్ రాజు స్వయంగా కలెక్టర్ కు చూపించారు. ఉత్సవాల ఏర్పాట్లను స్వయంగా ప్రజా ప్రతినిధి డిజైన్ చేయడం ఇక్కడే చూశానని ఎమ్మెల్యేను కొనియాడారు . అనంతరం అధికారులతో ప్రజా ప్రతినిధులు ఆమె సమావేశం అయ్యారు. ఈ ఉత్సవాలకు తరలి వచ్చే వారిని అతిథులుగా భావించి ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకునే ఏర్పాటు చేయాలని కోరారు. త్రాగునీటికి, అన్న ప్రసాదం పంపిణీ ఏర్పాట్లు చేస్తున్న ప్రజా ప్రతినిధుల బృందానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తన పిలుపుమేరకు ఇక్కడ ఏర్పాట్లు చేస్తున్న ప్రజా ప్రతినిధుల బృందానికి, అధికారులకు రుణపడి ఉంటారని ఎమ్మెల్యే రాజు అన్నారు. అధికారులు ప్రజా ప్రతినిధులు వారికి కేటాయించిన పనులను దగ్గరుండి పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు. దర్శనానికి వచ్చే భక్తులను స్నేహ భావంతో చూడాలని సూచించారు. ఎండిఓ మహేష్ మాట్లాడుతూ మండలంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 500 మంది సిబ్బందిని ఉత్సవాలకు నియమించమని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు కోమటి శంకర్రావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాజన్న కొండ నాయుడు, నియోజవర్గ టిడిపి మహిళా కోట నిలవేణి తాసిల్దార్ అంబేద్కర్, కొత్తకోట సిఐ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న విద్యార్థుల పంజాబీ వస్త్రధారణ



**రావికమతం ఫిబ్రవరి 13 మేజర్ న్యూస్ :** మండలంలో చినపాచిల హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన పంజాబీ వస్త్రధారణ, నృత్యం సుదర్శన ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా పంజాబీ రాష్ట్రంలో సాంస్కృతి సంప్రదాయం వస్త్రధారణ పై విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు విజయశ్రీ తెలిపారు. భిన్నత్వంలో ఏకత్వమైన భారతదేశంలో అన్ని రాష్ట్రాల సంప్రదాయాలు పై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహించమని తెలిపారు. దీనిలో ఫ్రెండ్స్ కమిటీ చైర్మన్ బంటు నాగమణి, వైస్ చైర్మన్ కరణం ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి సందర్భంగా పాల్మన్ పేట లో పోలీస్ సిబ్బంది విస్తృత పర్యవేక్షణ



పాయకరావుపేట ఫిబ్రవరి 13 మేజర్ న్యూస్: మహాశివరాత్రి సందర్భంగా పాల్మాన్ పేట గ్రామంలో శుక్రవారం పాయకరావుపేట పోలీస్ స్టేషన్ సి.ఐ జి.అప్పన్న,ఎస్.ఐ పురుషోత్తం తమ సిబ్బందితో విస్తృతంగా పర్యవేక్షణ చేపట్టారు. శివాలయం,జగన్నాథ స్వామి ఆలయం,స్టేజ్ ప్రోగ్రామ్స్,ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లు దగ్గరుండి పర్యవేక్షించారు. మహాశివరాత్రి సందర్భంగా సముద్ర స్నానానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకాలు, ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై గ్రామ పెద్దలకు,సంబంధిత అధికారులకు ముఖ్య సూచనలు అందించారు.

## దొప్పర్ల గంగునాయుడు చెరువులో చెట్ల నరికివేత



**.. బండారు రమణ అధికారులకు ఫిర్యాదు**

అచ్చుతాపురం, ఫిబ్రవరి 13 మేజర్ న్యూస్.. మండలంలోని దొప్పర్ల పంచాయతీ పరిధిలో సర్వే నెంబర్ 40లో ఉన్న గంగునాయుడు చెరువులో సుమారు 8 ఎకరాల విస్తీర్ణంలో పెరిగిన నేరేడు, అకేష్ చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా నరికి మిల్లులకు తరలించిన ఘటనపై శు క్రవారం ఫిర్యాదు నమోదైంది. చెరువు పరిసరాల్లో చెట్ల నరికివేత జరగడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై దొప్పర్ల వైస్సార్సీపీ అధ్యక్షులు బండారు రమణ, మండల కమిటీ సభ్యులు నడిపింటి శేఖర్ కలిసి అచ్చుతాపురం పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. అదేవిధంగా డిప్యూటీ ఎంపీడీఓ, అలాగే ఇరిగేషన్ డిపార్ట్మెంట్ అధికారులకు కూడా విషయాన్ని తెలియజేశారు.అక్రమంగా చెట్లు నరికి తరలించిన వారిపై పూర్తి స్థాయి విచారణ జరిపి, బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు

## రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబును

### మర్యాదపూర్వకంగా కలిసిన ఎలమంచిలి తెలుగుదేశం పార్టీ నాయకులు



అచ్చుతాపురం. ఫిబ్రవరి 13 మేజర్ న్యూస్..అమరావతి లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు మరియు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు గౌరవనీయులు నారా చంద్రబాబు నాయుడు ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మరియు ఎలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి యలమంచిలి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని, స్థానిక పరిశ్రమలలో తెలుగుదేశం పార్టీ శ్రేణులకు అవకాశాలు కల్పించాలని, ఎలమంచిలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు అధినేత చంద్రబాబు గారికి వివరించారు. ఈఈ సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కూనిశెట్టి రమణ సీనియర్ నాయకులు కర్రి వెంకటరమణ పాల్గొన్నారు

## మాజీ సర్పంచ్ ఎస్వీ రమణ సేవలు మరువలేనివి



**మునగపాక ఫిబ్రవరి 13 మేజర్ న్యూస్** :మండలం లో తిమ్మరాజుపేట గ్రామం లో మాజీ సర్పంచ్ ఎస్ వి రమణ 23వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమం లో రాష్ట్ర గవరకార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏకాదాటి గా 25సంవత్సరం లు సర్పంచ్ గా మా గ్రామం కు ఎనలేని సేవలు చేసి యున్నారు అని అదే విదంగా తిమ్మరాజుపేట నుండి వాడ్రాపల్లి వెళ్ళుటకు ముందు చూపుతో బ్రిడ్జి కన్స్ట్రక్షన్ చేసి ఉన్నాడు అని అదే విదంగా మా గ్రామం కు లైబ్రరీ. మరెన్నో కార్యక్రమం లు చేసారు అని తెలిపారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ భీమిశెట్టి మంగ లక్ష్మి కృష్ణారావు, మాజీ ఎంపీపీ ఆడారి మంజు నాగేశ్వరావు మాజీసర్పంచ్ రాము రాజేశ్వరి దీఎ రమణ ^ఎ రమణ ఆడారి సూర్య నారాయణ ఆడారి పాపారావు గ్రామ ప్రజలు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు మాజీ సర్పంచ్ ఎస్వి రమణ కుమారుడు రాజమండ్రిలో పెద్దాపురం డి ఎల్ డి ఓ గా తారక రాజేశ్వరావు సేవలందిస్తున్నారు శుక్రవారం గ్రామం లో సుమారు 1000మందికి అన్నదానం ఏర్పాటు చేశారు

## నేటి ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి



**దేవరాపల్లి, ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్** : మెడికల్ ఫార్మా మాఫియా ఆగడాలను అరికట్టేందుకు నేడు రాష్ట్రంలోని జిల్లా కేంద్రాల్లో నిర్వహించు ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి వేమల కన్నబాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ నాసిరకం మందులు అధిక ధరలకు విక్రయించి సామాన్య ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆయన మండి పడ్డారు మందుల షాపుల యజమానులకు ఔషధాలపై అవగాహన లేనప్పటికీ డబ్బులు ఆశ చూపి వేరొకరి నుండి సర్టిఫికెట్లతో చలామణి అవుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు ఔషధ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాల్సిన డ్రగ్స్ ఇన్స్పెక్టర్లు ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు మెడికల్ ఫార్మసీ మాఫియా పై ప్రభుత్వం చర్యలు చేపట్టే వరకు ఉద్యమం కొనసాగిస్తామని కన్నబాబు హెచ్చరించారు

## ఆకట్టుకున్న ఎడ్ల బండ్ల పరుగు పందాలు

**రావికమతం ఫిబ్రవరి 13 మేజర్ న్యూస్:** మండల కేంద్రం భక్తాంజనేయ స్వామి 29వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ఎడ్లబండ్ల పరుగు పందాలు అమితంగా ఆకట్టుకున్నాయి. జిల్లా నలుమూలల నుంచి 12 ఎడ్ల బండ్లు ఈ పందాలలో పాల్గొన్నాయి. జిల్లా పరిషత్ హైస్కూల్



మైదానంలో మూడు రౌండ్లు పరిగెత్తిన సమయం ప్రాతిపదిగా విజేతలను ఎంపిక చేశారు. ఉపాధ్యాయుల వేపాడ సత్యనారాయణ గెంజి నాగేశ్వరరావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. సూపర్ సర్పంచ్ గెంజి మోతి నాయుడు, మాజీ సర్పంచ్ గెంజి అప్పారావు లు పోటీలను ప్రారంభించారు ఈ పోటీలలో వరుసగా బి రుద్రకుమార్, పి రవికుమార్, ఎస్ దుర్గాప్రసాద్, పి వెంకటరావు, దుర్గంబిక లకు చెందిన ఎడ్ల బండ్లు విజేతలగా నిలిచాయి. విరిగి ఉత్సవ కమిటీ నగదు బహుమతులు అందజేసింది.

## స్మార్ట్ మీటర్స్ పై ప్రజలకు అవగాహన



నర్సీపట్నం ఫిబ్రవరి 13 మేజర్ న్యూస్:కేంద్ర ప్రభుత్వం ప్రజలకు విద్యుత్ శాఖ ద్వారా నాణ్యమైన సేవలు అందించడానికి తీసుకున్న చర్యల్లో భాగంగా ప్రతి ఇంటికి స్మార్ట్ మీటర్ అందించాలని నిర్ణయం తీసుకుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ తెలిపారు కేంద్ర ప్రభుత్వం 3 లక్షల కోట్ల రూపాయలతో బృహత్తర పథకం చేపట్టిందని నాణ్యమైన విద్యుత్తు అందించడానికి బిల్లుల్లో ఎటువంటి హెచ్చుతగ్గులు లేకుండా నాణ్యమైన విద్యుత్తు అందించడానికి స్మార్ట్ మీటర్ ఎంతగానో ఉపయోగపడుతుందని . ఎంత విద్యుత్తు వాడకం జరిగిందో తెలుస్తుందని అడ్వాన్స్ గా డబ్బులు కడితే రీఛార్జిగా కూడా ఉపయోగపడుతుందని ఈ ఈ తెలిపారు. విద్యుత్ శాఖకు సంబంధించి ఎటువంటి కంప్లైంట్స్ వచ్చిన 1912 నెంబరుకు ఫోన్ చేస్తే సమస్య పరిష్కారం చేసి కస్టమర్లను సంతృప్తి చెందేలాగా చర్యలు తీసుకుంటామన్నారు. స్మార్ట్ మీటర్లు అదాని గ్రూపు ద్వారా అందిస్తుందని వివరించారు. ప్రతి గృహము ఒక మినీ ఇండస్ట్రీ లాగా పనిచేయడానికి కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్తు ప్రమోట్ చేస్తుందని ప్రజలందరూ సహకరించి ప్రతి ఒక్కరు ఇంటిపై సోలార్ సిస్టం వాడాలని తెలిపారు. ఎమ్మార్వోరామారావు సోలార్ విద్యుత్తు వాడకానికి సహకరిస్తానని ఈ ఈ కు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఎల్ రామారావు. ఎస్ రామకృష్ణ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్. కె.వి త్రినాధరావు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్. బి మనోజ్ కుమార్ నర్సీపట్నం అసిస్టెంట్ ఇంజనీర్. శ్రీనివాసరావు. జే టి ఓ. రమణ జే టి ఓ. రమణ స్మార్ట్ మేటర్ మేనేజర్. ఎస్ బంగారయ్య. రోలుగుంట ఏఈ. గణేష్ లైన్ ఇన్స్పెక్టర్. విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## మహాశివరాత్రి ఉత్సవాలు ఏర్పాట్లను పరిశీలించిన ఆర్టీవో వివి రమణ.

**:అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలి.**



**నర్సీపట్నం ఫిబ్రవరి 13 మేజర్ న్యూస్**:మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 15, 16 మరియు 17 వ తేదీలలో జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాలు ఏర్పాట్లు ను రెవెన్యూ డివిజనల్ అధికారి వి. వి. రమణ పరిశీలించారు, ఉత్తరవాహిని వద్ద మరియు బ్రహ్మలింగేశ్వర స్వామి వారి ఆలయం వద్ద మున్సిపల్, రెవెన్యూ మరియు పోలీస్ అధికారులు తో కలిసి ఏర్పాట్లు ను పరిశీలించారు. మండలం లో గల అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో నర్సీపట్నం ఎమ్మార్వో ఎల్ రామారావు. కమిషనర్ జె సురేంద్ర. ఎస్సై ఉమామహేశ్వరరావు వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య దేవాలయంలో

### భావి భారత పౌరులు శాసనసభ ను సందర్శించిన విద్యార్థులు



నర్సీపట్నం ఫిబ్రవరి 13 మేజర్ న్యూస్:అమరావతి చట్ట సభలు ఎలా పనిచేస్తాయి? ప్రజా సమస్యలపై చర్చలు ఎలా జరుగుతాయి? అనే అంశాలపై విద్యార్థులు శుక్రవారం అసెంబ్లీలో స్వయంగా వీక్షించారు. సుమారు 200 మంది విద్యార్థులు శాసనసభను సందర్శించి, సభా వ్యవహారాలను ప్రత్యక్షంగా తిలకించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు మరియు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విరామం సమయంలో విద్యార్థుల వద్దకు వెళ్లి వారిని పలకరించారు. ఉన్నత లక్ష్యాలతో చదువుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని వారు ఆకాంక్షించారు అనంతరం వారితో గ్రూప్ ఫోటోలు దిగారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన పెంచుకునేందుకు ఈ పర్యటన ఎంతగానో దోహదపడిందని విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ గౌరవ పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## బొడ్డపాడులో వైభవంగా మరిడిమాంబ తీర్థ మహోత్సవం



దేవరాపల్లి, ఫిబ్రవరి 13, మేజర్ న్యూస్ : మండలంలోని తామరబ్బ పంచాయతీ శివారు బొడ్డపాడు గ్రామంలో గ్రామ దేవత మరిడిమాంబ తీర్థం శు క్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎస్టీ సెల్ అధ్యక్షులు ముసలి పైడిరాజు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఈ ఉత్సవాలు జరిగాయి. అమ్మవారికి ఉదయం 5 గంటల నుంచి ధూప దీప నైవేద్యంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ ద్వితీయ బహుమతులు ఎస్టీ సెల్ అధ్యక్షులు ముసలి పైడిరాజు అందించారు. సాయంత్రం మహిళల జానపద కోలాటాలతో అంగరంగ వైభవంగా అమ్మవారి తీర్థ మహోత్సవాలు జరిగాయి. సాయంత్రం పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ, చామంతుల ఎరుకన్న దొర, నాయుడు తదితరులు పాల్గొన్నారు